# మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 70 • పేజీలు:12+16 • వెల: రూ.5 గురువారం • 8-2-2018 www.manamnews.com /manamnews






## అంతరిక్షంలోకి కారు!

'ఫాల్కన్ హెవీ' ప్రయోగం దిగ్విజం
కక్ష్యలోకి కారును మోసుకెళ్లిన రాకెట్
తిరిగి నేలపైకి చేరిన 2 బూస్టర్లు
ప్రపంచంలోనే అతిపెద్ద ప్రయోగం
27 ఇంజన్లతో నింగికెగసిన రాకెట్

7లో..



## రోడ్డు ప్రమాదంలో మోదీ భార్యకు గాయాలు

బంధువు మృతి..
రాజస్థాన్‌లో దుర్ఘటన

# మౌనంలో మర్మం..

## కేంద్రంపై టీఆర్ఎస్.. వైసీపీ గప్‌చుప్

ఎక్కువ ఎంపీ సీట్ల సాధనే లక్ష్యమా
తెలంగాణలో అధికార పార్టీతో జట్టు
ఏపీలో ప్రతిపక్షంతో జోడీ ఆలోచన
టీడీపీతో 'షా'.. వ్యూహాత్మక దూరం
తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ రివర్స్ ప్లాన్
బడ్జెట్‌పై నిరసన.. తూతూ మంత్రం




హైదరాబాద్, ఫిబ్రవరి 7 (మనం ప్రతినిధి):

తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ రివర్స్ పొలిటికల్ ప్లాన్ అమలు చేయనుందా? వచ్చే ఎన్నికలకు ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్ షా ప్రణాళిక ఏమిటి? తెలంగాణలో ఒంటరి పోటీ నిజమేనా? ఏపీలో టీడీపీతో కటీఫ్ తప్పదా? వైసీపీతో జోడీ కట్టే యోచనలో ఉన్నారా? బడ్జెట్‌పై తెలంగాణలో టీఆర్ఎస్, ఏపీలో వైసీపీ గట్టిగా నోరు విప్పకపోవడంలో మర్మమేమిటో? ఒకవేళ నిరసన తెలిపినా అశ్వత్థామ హతః కుంజరః సూత్రం ఎందుకు వల్లిస్తున్నారు? బీజేపీతో దోస్తానాకు టీఆర్ఎస్ సిద్ధమవుతోందా? ఎన్నికలనాటికి పరిస్థితులు ఎలా మారుతాయి? తాజా పరిణామాలను గమనిస్తే ఈ ప్రశ్నలన్నిటికీ 'అవును' అన్న మిగతా 6లో..

# కాంగ్రెస్.. ఓ లోఫర్ పార్టీ

హత్యా రాజకీయాలు వారివే
1991నాటి నరమేధం ఎవరిది?
నా సవాల్‌కు కట్టుబడి ఉన్నా

**అధికారంలోకి రాకుంటే సన్యాసం**
**దాస్కుంటుంది ఉత్తమ్‌కుమార్ రెడ్డే**
**అప్పుడు ఇప్పుడూ సింగిల్‌గానే పోటీ**
**రాహుల్ గాంధీ.. ఓ పెద్ద పప్పు**
**గూగుల్‌లో వెతికితే ఆయనే వస్తారు**
**బీజేపీ మిత్రపక్షాలను ఒప్పించట్లేదు**
**దక్షిణాదిలో ఆ పార్టీకి ఉనికే లేదు**
**జాతీయ పార్టీ ఎలా అవుతుంది?**
**మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్**



హైదరాబాద్, ఫిబ్రవరి 7 (మనం ప్రతినిధి) :

''వచ్చే ఎన్నికల్లో తాము అధికారంలోకి రాకుంటే రాజకీయాల్లోంచి తప్పుకుంటానని చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నాను. కానీ.. కుటుంబం వెనకాల, గుడారాల వెనకాల దాక్కొని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నా సవాల్‌ను తప్పించుకుంటున్నారు. ఇప్పటి వరకు జరిగిన ఏ ఉప ఎన్నికలో కూడా కాంగ్రెస్‌కు గౌరవ ప్రదమైన ఓట్లు రాలేదు. 70 సీట్లు వస్తాయని తాడు, బొంగరం లేకుండా మాట్లాడుతున్నరు. 2019లో ఒంటరిగా పోటీ చేస్తాం. భారీ మెజార్టీతో గెలుస్తాం. 2014లో సింగిల్‌గానేపోటీ చేశాం. వచ్చే ఎన్నికల్లోనూ సింగిల్‌గానే పోటీ చేస్తాం'' అని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మేము గెలవకుంటే తాను రాజీనామా మిగతా 6లో..

## ఇదీలోకం!




ఉగ్ర దాడులకన్నా మీ మాటల బాంబుల భీబత్సం ప్రధానికి తెలుసు.. మిమ్మల్ని వదులుకోనూలేరు డోంట్ వర్రీ సార్..!



## కొనసాగుతున్న మేడారం కానుకల లెక్కింపు

రెండ్రోజుల ఆదాయం రూ.4.87కోట్లు

హన్మకొండ టౌన్, ఫిబ్రవరి 7 (మనం న్యూస్):

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర హుండీల లెక్కింపు బుధవారం రెండో రోజు కూడా కొనసాగింది. మొత్తం 202 హుండీల్లో కానుకలను సిబ్బంది లెక్కించారు. మంగళవారం, బుధవారం రెండురోజులకు కలిపి సుమారు రూ.4,87,40,000 ఆదాయం సమకూరిందని దేవాదాయశాఖ ఈవో రమేష్‌బాబు తెలిపారు. హుండీల లెక్కింపునకు మొత్తం పది రోజులు సమయం పడుతుందన్నారు. జాతరలో 452 ఇనుప హుండీలు, 24 క్లాత్ హుండీలు, మూడు ఒడి హుండీలు ఏర్పాటు చేశారు.

## సీపీ(ఐ)ఎం కార్యదర్శిగా తమ్మినేని

నల్లగొండలో ముగిసిన రాష్ట్ర మహాసభలు
కుంభకోణాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి
ప్రభుత్వ విధానాలను నిరసించండి
జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌రావు తీర్మానాలు



నల్లగొండ, ఫిబ్రవరి 7 (మనం న్యూస్) : సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా తమ్మినేని వీరభద్రం ఎన్నికయ్యారు. 60 మందితో రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటైంది. నాలుగు రోజుల పాటు నల్ల గొండలో నిర్వహించిన సీపీ(ఐ)ఎం రాష్ట్ర ద్వితీయ మహాసభల ఆఖరి మిగతా 6లో..



## ముద్దుకృష్ణమ కన్నుమూత

అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి
నేడు చిత్తూరు జిల్లాలో అంత్యక్రియలు
చంద్రబాబు, ప్రముఖుల సంతాపం
మంత్రిగా సేవలు..
టీడీపీలో కీలక పాత్ర

6లో..

## వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో గురువారం కూడా మబ్బులతో కూడిన వాతావరణం ఉంటుంది. అక్కడక్కడ చిరుజల్లులు పడే అవకాశం ఉంది.

**గరిష్ఠ ఉష్ణోగ్రత: 32 డిగ్రీలు**
**కనిష్ఠ ఉష్ణోగ్రత: 18 డిగ్రీలు**
**గాలిలో తేమ: 50 శాతం**

## ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: అష్టమి ఉ.10.13 తదుపరి నవమి; నక్షత్రం: విశాఖ మ.2.17 తదుపరి అనురాధ; వర్జ్యం: సా.6.43-8.30; దుర్ముహూర్తం: మ.3.09-4.40; రాహుకాలం: మ.1.56-3.21; అమృతఘడియలు: తె.4.46-6.31; శుభసమయం: మ.1.00-1.30.

**సూర్యోదయం: 6.50**
**సూర్యాస్తమయం: 6.11**

## మే 23,24న ఐసెట్

**ఫిబ్రవరి 22నుంచి దరఖాస్తులు**
**తొలిసారి ఆన్‌లైన్‌లో పరీక్ష**
**జూన్ 6న ఫలితాలు**
**ఉర్దూలోనూ పరీక్ష నిర్వహణ!**
**ఉన్నతవిద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి**

వరంగల్, ఫిబ్రవరి 7 (మనం న్యూస్):

2018-19 విద్యా సంవత్సరానికి గానూ ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఐసెట్ పరీక్ష మే నెల 23,24వ తేదీలలో జరుగుతుందని ఉన్నత మిగతా 6లో..



## ఉందా... లేదా?

సందిగ్ధంలో ఏపీ జేఏసీ
టీజేఏసీ స్ఫూర్తి ఉంటుందా.. ఉండదా
రాష్ట్రంపై జనసేన వైఖరి ఇటూ.. అటూ
బంద్‌తో బాధలేగానీ.. జన సైనికులు శాంతియుతంగా పాల్గొనాలని పిలుపు

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (మనం ప్రతినిధి):

రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలు, ప్రత్యేక హోదా సాధనకు టీజేఏసీ స్ఫూర్తితో ఆంధ్ర జేఏసీ ఏర్పాటు కావాలని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. ఈ దిశగా ముందడుగు వేస్తామంటూ- ఉండవల్లి అరుణ్‌కుమార్, లోక్‌సత్తా పార్టీ నేత జయప్రకాశ్ నారాయణ తదితర మేధావులతో చర్చిస్తానన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో అన్యాయంపై తమ వైఖరి వివరించేందుకు మిగతా 6లో..

# ప్రసంగ జ్వాల!

## మాటల్లో మంటలు... విమర్శల నిప్పులు



ఉభయసభల్లో కాంగ్రెస్‌పై చెలరేగిన మోదీ
నాడు పటేల్‌ను కాదని నెహ్రూకు అందలం
ఫలితంగా నేడు కశ్మీర్ సమస్యాగ్ని గుండం
దిగ్గజ నేతలను ఘోర అవమానం చేశారు
పరాభవ ఆగ్రహానుంచే టీడీపీ ఆవిర్భావం
ఆంధ్రప్రదేశ్‌ను అడ్డగోలుగా విభజించేశారు
బ్యాంకుల నిరర్థక ఆస్తులు మీ పాప ఫలమే
'కాంగ్రెస్ ముక్త భారత' నినాదం గాంధీజీదే
అది ఎంతమాత్రం బీజేపీ సృష్టించింది కాదు
'ధన్యవాదం'పై చర్చకు ప్రధానమంత్రి జవాబు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:

కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు... ఆంధ్రప్రదేశ్‌లో బడ్జెట్ సెగలు... ఎన్డీఏలో తెగదెంపుల గుబులు... వెరసి కాంగ్రెస్‌ను చీల్చిచెండాడుతూ ప్రధాని మోదీ ఉభయసభల్లో చేసిన ప్రసంగం పార్లమెంటును ఎన్నికల ప్రచార సభలా మార్చేసింది. ''ఎనలేని వాక్చాతుర్యం, భాషలో గాంభీర్యం, పదాల్లో వాడి, మాటల్లో వేడి.. కలగలిస్తే మోడీ'' అనిపించారు. సిసలైన మిగతా 6లో..

# ఆరోగ్య తెలంగాణ దిశగా ప్రభుత్వ కృషి

## త్వరలో తెలంగాణ డయాగ్నసిస్ పథకం: మంత్రి లక్ష్మారెడ్డి



రోగిని పరామర్శిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి

మెదక్, ఫిబ్రవరి 7(మనం బ్యూరో): ఆరోగ్య తెలంగాణ లక్ష్యంలో భాగంగా పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మా రెడ్డి అన్నారు. మెదక్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన డయాలసిస్, ఐసీయూ కేంద్రాలను లక్ష్మారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిచడంలో భాగంగా రాష్ట్రంలో 40 డయాలసిస్ కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఏజెన్సీ ప్రజలు తరచూ రోగాల బారిన పడేవారని, టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పరిస్థితి లేదన్నారు. ప్రజలకు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తూ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్య, వైద్య రంగాలకు అవసరమైన నిధులు కేటాయిస్తూ సీఎం కేసీఆర్ పేద ప్రజల సంక్షేమ కోసం కృషి చేస్తున్నారన్నారు. ప్రాంతీయ ఆస్పత్రుల్లో ఖాళీలను భర్తీ చేయడానికి రాష్ట్రంలో 10 వేల పోస్టులను మంజూరు చేస్తామని వెల్లడించారు. పేద ప్రజలకు కంటి చికిత్సను అందించడమే కాక అవసరమైన కళ్లద్దాలు కూడా పంపిణీ చేస్తామని చెప్పారు. త్వరలో రాష్ట్రంలో తెలంగాణ డయాగ్నసిస్ పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తున్నారని లక్ష్మారెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉప సభాపతి పద్మా దేవేందర్ రెడ్డి, కలెక్టర్ మానిక్ రాజ్ కణ్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ సమాచారంపై ఆందోళన వద్దు

- కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ఆధార్ సమాచారం పూర్తి సురక్షితంగా ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ మరోమారు స్పష్టం చేశారు. లోక్‌సభలో మాట్లాడిన ఆయన ఆధార్‌కు సంబంధించి పలు సందేహాలపై స్పష్టతనిచ్చారు. ఆధార్ అనుసంధాన ప్రక్రియ అనేక విప్లవాత్మక మార్పులను తీసుకురాబోతుందని ఆయన చెప్పారు. ఆధార్ సమాచారం దుర్వినియోగం కాకుండా భద్రపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. మీడియా కూడా ఇతరుల ఆధార్ వివరాలను బహిర్గతం చేయరాదని రవిశంకర్ ప్రసాద్ చెప్పారు. ఎంతోమంది ప్రజలు ఆధార్ అనుసంధానం తమకు మేలు చేస్తుందని భావిస్తున్నారని, ప్రభుత్వం ఆ దిశగానే అడుగులు వేస్తోందని ఆయన చెప్పుకొచ్చారు. ఏ సంస్థ అయినా ఇతరుల ఆధార్ సమాచారాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు తేలితే.. కఠిన చర్యలు తీసుకుంటామని, జరిమానాతో పాటు మూడు నుంచి ఏడేళ్ల జైలు శిక్ష తప్పదని మంత్రి హెచ్చరించారు. ఒక వ్యక్తి ఆధార్ సమాచారాన్ని దుర్వినియోగం చేయడం ఆధార్ చట్టం ప్రకారం నేరమని ఆయన తెలిపారు. ప్రభుత్వపరంగా అందాల్సిన ప్రయోజనాలను ఎగ్గొట్టొద్దని మంత్రి సూచించారు.

# ఏదైనా ఉద్యోగం చూసుకోమన్నందుకే..

- ఎల్బీనగర్ ట్రిపుల్ మర్డర్ కేసులో వీడిన మిస్టరీ
- ఖాళీగా ఉండొద్దని భార్య ఒత్తిడి చేసినందువల్లే హత్య
- పోలీసు విచారణలో నిజాన్ని అంగీకరించిన హరీందర్



హైదరాబాద్/ఎల్బీనగర్, ఫిబ్రవరి 07, మనం న్యూస్: ఎల్బీ నగర్ ట్రిపుల్ మర్డర్ కేసు మిస్టరీ వీడింది. ఉద్యోగం మానేసి ఖాళీగా ఉంటున్న హరీందర్ గౌడ్‌ను ఏదైనా ఉద్యోగం చూసుకోమన్నందుకే భార్య, ఇద్దరు పిల్లలను హత్య చేసినట్లు పోలీసులు విలేకరుల సమావేశంలో వివరించారు. ఎల్బీనగర్ డీసీపీ వెంకటేశ్వరరావు బుధవారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జీవనోపాధి నిమిత్తం హరీందర్ డెంటల్ ల్యాబ్ నడిపేవా డని, అది కూడా నష్టాలతో సాగడంతో గడిచిన కొన్ని నెలలుగా ఖాళీగా ఉంటున్నాడని తెలిపారు. అతని తల్లిదండ్రులు, ఇద్దరు సోదరులు ఆర్థికంగా ఆదుకుంటామని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని డీసీపీ చెప్పారు. తన భార్య జ్యోతి ఖాళీగా ఉండొద్దని చెప్పేదని, ఈ విషయంలో భా ర్యాభర్తల మధ్య పలుమార్లు గొడవలు కూడా తలెత్తినట్లు ఆయన తెలిపారు. తన భార్య బంధువులతో, స్నేహితులతో సలహాలు, సూచనలు ఇప్పిస్తూ తనను అవమాన పరుస్తుందని ఆమెపై కక్ష పెంచుకున్నాడని చెప్పారు. ఈ నేపథ్యంలోనే.. ఫిబ్రవరి 4వ తేదీన 4గంటల సమయంలో భార్యను వేరే గదిలోకి తీసుకెళ్లి ఇటుక పెళ్లతో కొట్టి, తలను గోడకేసి మోది హరీందర్ ఆమెను చంపాడని డీసీపీ తెలిపారు. భార్య చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత తన కొడుకు అభిని దిండుతో ముఖంపై వత్తి చంపేశాడని, కూతురు సహస్రను గొంతు నులిమి చంపినట్లు హరీందర్ అంగీకరించినట్లు ఆయన చెప్పారు. హరీందర్‌పై ఐపీసీ క్రైం నెంబర్ 98/2018 సెక్షన్‌ల క్రింద కేసు నమోదు చేసి కోర్టుకు తరలించనున్నట్లు తెలిపారు.

# 'గాలి' మృతి తీరని లోటు

- ఏపీ సీఎం సహా పలువురు ప్రముఖుల నివాళి

హైదరాబాద్, ఫిబ్రవరి 7(మనం ప్రతినిధి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి, ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమనాయుడు(71) బుధవారం కన్నుమూశారు. వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం ఉదయం 2:30 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారని వైద్యులు ప్రకటించారు. ఆయన మృతిపట్ల ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, టీ టీడీపీ అధ్యక్షుడు ఎల్ రమణ ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు. టీ టీడీపీ నేతలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, పెద్దిరెడ్డి, బుచ్చిలింగం, మోత్కుపల్లి నర్సింహులు, కాంగ్రెస్ నేత జానారెడ్డి, లక్ష్మిపార్వతి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, తదితరులు గాలి పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి సంతాపం తెలియజేశారు. బంజారా హిల్స్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో పలువురు టీడీపీ నేతలు గాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గాలి ముద్దుకృష్ణమనాయుడు మరణం టీడీపీకి తీరని లోటని అభిప్రాయపడ్డారు.

# మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

- రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు టి.వెంకటరత్నం



వనపర్తి, ఫిబ్రవరి 7(మనం ప్రతినిధి): మహిళల రక్షణ, భద్రత కోసం అనేక చట్టాలు ఉన్నా వాటిపై మహిళలకు అవగాహన ఉండడం లేదని రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు త్రిపురాన వెంకటరత్నం అన్నారు. మహిళలు – న్యాయం అనే అంశంపై వనపర్తిలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల పట్ల సమాజ ఆలోచన విధానంలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలను గౌరవించేలా పిల్లలను పెంచాలని, పిల్లలకు చదువుతో పాటు మానవతా విలువలు నేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. నిర్భయ వంటి చట్టం ఉన్నా వయస్సు నిమిత్తం లేకుండా మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ సాధించుకున్నప్పటికీ, మహిళలు వారి స్థానాలలో కూర్చోవడం లేదన్నారు.అనంతరం మహిళల చట్టాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్వేతామహంతి, జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని పాల్గొన్నారు.

# మహిళా బిల్లుపై బీజేపీకి చిత్తశుద్ధి లేదు

- మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు శారద

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (మనం ప్రతినిధి): మహిళా బిల్లు విషయంలో బీజేపీకి చిత్తశుద్ధి లేదని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు నేరళ్ల శారద ఆరోపించారు. గాంధీభవన్‌లో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ హయంలో ప్రవేశపెట్టిన పలు ప్రజా సంక్షేమ పథకాలకు టీఆర్ఎస్ ప్రభుత్వం తిలోదకాలిస్తుందన్నారు. మహిళా బిల్లు విషయంలో పూర్తి మెజారిటీ ఉన్నా బీజేపీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. బీజేపీ మహిళా బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడితే రాజ్యసభలో తమ పార్టీ మద్దతు ఇస్తుందన్నారు. మహిళా సంక్షేమాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వం మాటలకే పరిమితం చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వనపర్తి డిక్లరేషన్‌ను అమలు చేస్తామన్నారు. పనిచేసే మహిళా కార్యకర్తలకు ఈ సారి ఎన్నికల టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యత ఉంటుందని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తమకు హామీ ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే వీఓఏల వేతనం రూ.10వేలు చేస్తామని, స్వయం సహాయక సంఘాలకు రూ.లక్ష సబ్సిడీతో ఆర్థిక సాయం అందిస్తామని, అభయహస్తం పథకానికి పూర్వవైభవం తెస్తామని, రూ.500 పింఛనను వెయ్యి రూపాయలకు పెంచుతామని చెప్పారు.

# నేతన్నకు గవర్నర్ భరోసా

## సబ్సిడీ అన్ని పథకాల్లో అందేలా చూస్తానని హామీ

- చేనేత మ్యూజియంలో కార్మికులతో ముఖాముఖి
- అందరికీ జియోట్యాగ్ నంబర్ కల్పించేలా చర్యలు
- పోచంపల్లిలో 5గంటల పాటు గవర్నర్ దంపతుల పర్యటన



భూధాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 7(మనం న్యూస్): చేనేత కార్మికులకు అన్ని ప్రభుత్వ పథకాల్లో సబ్సిడీ అమలయ్యేలా చూస్తానని నేతన్నలకు గవర్నర్ నరసింహన్ హామీ ఇచ్చారు. యువత అభిరుచికి తగ్గట్లు చేనేత కార్మికులు నూతన డిజైన్లను రూపొందించాలని ఆయన సూచించారు. చీరలు మాత్రమే కాకుండా గృహ అవసరాలకు కూడా దుస్తులు నేయాలన్నారు. అప్పుడే మార్కెటింగ్ పరిధి పెరుగుతుందని గవర్నర్ చెప్పారు. బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండల కేంద్రంలో గవర్నర్ నరసింహన్ దంపతులు పర్యటించారు. ఉదయం హైదరాబాద్ రాజ్‌భవన్ నుంచి నేరుగా పోచంపల్లికి రోడ్డు మార్గంలో చేరుకున్నారు. పోచంపల్లి మండలం కనుముకులో గవర్నర్ దంపతులకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్‌రెడి పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. కనుముకులలో హ్యాండ్‌లూమ్ పార్కును గవర్నర్ దంపతులు సందర్శించారు. అక్కడి చేనేత కార్మికులతో మాట్లాడారు. నిఫ్ట్ విద్యార్థులు రూపొందించిన 33 నూతన డిజైన్లలను గవర్నర్ దంపతులు అవిష్కరించారు. చేనేత కార్మికులతో మాటామంతి కలుపుతూ వారి సమస్యలను సావదానంగా విన్నారు.చేనేత వస్త్రాలకు మార్కెటింగ్‌ను ఇంకా పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. నేత కార్మికులకు సంబంధించిన అన్ని సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని గవర్నర్ చెప్పారు. చేనేతలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. కార్మికులకు అన్ని ప్రభుత్వ పథకాల్లో సబ్సిడీ అమలు అయ్యేలా చూస్తానన్నారు. అంతకుముందు పోచంపల్లిలో చేనేత కార్మికుల ఇళ్ళల్లోకి వెళ్లి వారి స్థితిగతులను గవర్నర్ నరసింహన్ దంపతులు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితు ల్లోను విద్యను మధ్యలో ఆపవద్దని రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో గవర్నర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ఎలాంటి పరిస్థితులు ఎదురైన ఎట్టి పరిస్థితుల్లోను విద్యకు దూరం కావద్దని అన్నారు. మాత, పిత, గురు దైవమని, గురువులు దైవంతో సమానమని ఆనాడే అన్నారని ఆయన తెలిపారు. గురుకులాల్లో గురు, శిషులు కలిసి ఉంటారని, గురువుల నుంచి అలవర్చుకున్న మంచి లక్షణాలను విద్యార్థులు కొనసాగించడమే గురు శిష్యుల పరంపర అని, ఇదే గురుకులాల ముఖ్య ఉద్దేశమని అన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల భుజస్కంధాల మీద ఉందన్నారు. గవర్నర్ ఈ సందర్భంగా విద్యార్థులతో సరదాగా కొద్దిసేపు ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



# సంక్షేమ పథకాలు మరింత చేరువవ్వాలి


- సమన్వయంతో పనిచేస్తేనే అది సాధ్యం
- వివిధ శాఖల అధికారులతో సీఎస్ సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 7(మనం ప్రతినిధి): రాష్ట్రంలో అన్ని శాఖల్లో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు మెరుగైన ఫలితాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని చీఫ్ సెక్రటరీ శైలేంద్ర కుమార్ జోషి సూచించారు. ఇందు కోసం ప్రతి శాఖలో పనిచేస్తున్న అధికారులు నిర్దిష్ట లక్ష్యాలను ఏర్పరచుకుని పనిచేయాలని ఆయన చెప్పారు. బుధవారం సచివాలయంలో ముఖ్య శాఖల ఉన్నతాధికారులతో సీఎస్ సమావేశం నిర్వహించారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించి ఆయన ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తి అవసరాలు, ఉత్పత్తి పెంపునకు చర్యలు, నాణ్యత, మార్కెటింగ్ వివరాలు, ప్లాంట్ల సామర్థ్యం పెంపు వంటి అంశాలపై సమీక్ష జరిపారు. చేపల పెంపకంపై మత్స్యశాఖ, నీటి పారుదల శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. పశుగ్రాసంపై ప్రత్యేకంగా చర్చిస్తూ ఉద్యానశాఖ, వ్యవసాయశాఖ, మార్కెటింగ్ తదితర శాఖలన్నీ కలిసి కార్యచరణ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు వ్యాల్యూ ఆడిషన్ రావటంతోపాటు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. తెలంగాణలో వివిధ పంటల సాగు విస్తీర్ణం, ఉత్పత్తి, మార్కెటింగ్, గోడౌన్ల సామర్థ్యం, వ్యవసాయ యాంత్రీకరణ, వ్యవసాయ సబ్సిడీలు, సేంద్రీయ ఎరువుల వాడకం వంటి అంశాలపై చర్చించారు. వ్యవసాయ, నీటి పారుదల శాఖలు సంయుక్తంగా పంటల సాగుపై కార్యచరణ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. మైక్రో డ్రిప్ ఇరిగేషన్ ను ప్రోత్సహించాలని ఈ సందర్భంగా సూచించారు. తక్కువ నీటితో ఎక్కువ ఉత్పాదక సాధించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. అటవీ శాఖకు సంబంధించి సమీక్షిస్తూ ఎయిర్, వాటర్, క్వాలిటీ ఇండెక్స్, గ్రౌండ్ వాటర్ క్వాలిటీ, నాణ్యత, ఫారెస్ట్ కార్పొరేషన్ ద్వారా మరిన్ని కార్యక్రమాలు చేపట్టడం, డి గ్రేడ్ ఫారెస్ట్‌లలో మొక్కలు నాటడం లాంటి పనులు చేపట్టాలన్నారు. అటవీ, పీసీబీ, ఈపీటీఆర్ఐ సమన్వయంతో పనిచేయాలన్నారు. వివిధ సంక్షేమ కార్యక్రమాల కోసం ప్రభుత్వం మంజూరు చేస్తున్న ప్రభుత్వ ఉత్తర్వులను ఆంగ్లంతో పాటు తెలుగులోనూ జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి, ముఖ్య కార్యదర్శులు అధర్ సిన్హా, రామకృష్ణారావు, సోమేష్‌కుమార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# అజ్ఞాత దళ నేత ఐలయ్య అరెస్టు?

- కాంచనపల్లి అడవుల్లో అదుపులోకి
- విషయాన్ని ధ్రువీకరించని పోలీసులు



మహబూబాబాద్, ఫిబ్రవరి 7(మనం ప్రతినిధి ): రాయలవర్గానికి చెందిన అజ్ఞాత దళ నేత బండారు ఐలయ్యను పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిసింది. బయ్యారం మండలంలోని కాంచనపల్లి, మూలపోచారం సరిహద్దులోని అటవీ ప్రాంతంలో నిర్వహించిన కూంబింగ్‌లో అజ్ఞాత దళ నేత బండారు ఐలయ్య అలియాస్ వీరన్న అలియాస్ ప్రకాశ్, మరో ఇద్దరు దళ సభ్యులు భాదవత్ రాముడు, భీముడును పోలీసులు అదుపులోకి తీసుకున్నారని పార్టీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. అయితే అరెస్టు విషయాన్ని పోలీసులు ఇంకా ధృవీకరించలేదు. బయ్యారం మండలం గంధంపల్లి గ్రామానికి చెందిన బండారు ఐలయ్య కొన్నేళ్లు న్యూడెమొక్రటిక్ పార్టీలో పని చేశాడు. పార్టీ విచ్చనం తర్వాత రాయలవర్గంలో అజ్ఞాత దళనేతగా పని చేశాడు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆ పార్టీ లీగల్ ఆర్గనైజర్‌గా కీలక బాధ్యతలు చేపట్టాడు. అనారోగ్య సమస్యల వల్ల 2010లో అజ్ఞాతం వీడి కొత్తపేట గ్రామంలో ఆ పార్టీ జిల్లా ఆర్గనైజర్‌గా పని చేశాడు. 2013లో మండలంలోని ఇర్సులాపురంలో ఎన్డీ పార్టీ, టీఆర్ఎస్ పార్టీల మధ్య జరిగిన గొడవల్లో టీఆర్ఎస్‌కు చెందిన రవీందర్ హత్యకు గురయ్యాడు. అప్పటి నుంచి ఐలయ్య మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడు. బయ్యారం మండలం దళ కమాండర్‌గా పని చేస్తూ జిల్లాల పునర్విభజన అనంతరం ప్రస్తుతం ఆ పార్టీ మహబూబాబాద్ జిల్లా డివిజన్ కార్యదర్శిగా పని చేస్తున్నాడు. ఐలయ్యకు భార్య నీలమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఐలయ్య అరెస్టు వార్త నేపథ్యంలో బయ్యారం, గార్ల, గూడూరు, కొత్తగూడ, గంగారం మండలాలతో పాటు ఖమ్మం జిల్లా ఇల్లందు సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కాగా, సకల నేరస్తుల సర్వే అప్పటి నుంచే పోలీసులు ఐలయ్య కోసం వ్యూహం పన్నినట్లు తెలిసింది.

# ఎందుకీ విభేదాలు?



## కరీంనగర్ బీజేపీ నేతలపై అమిత్‌షా ఫైర్

- పార్టీ అంతర్గత విభేదాలపై సీరియస్
- వారం రోజుల్లో నివేదిక ఇవ్వాల్సిందిగా మురళీధర్‌రావు ఆదేశం
- జిల్లాలో చర్చనీయాంశంగా మారిన బీజేపీ వర్గ పోరు

కరీంనగర్, ఫిబ్రవరి 7, (మనం ప్రతినిధి): కరీంనగర్ జిల్లా బీజేపి నేతలపై అధిష్టానం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. జిల్లా బీజేపీ నాయకులు చిల్లరమల్లర రాజకీయాలతో పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పార్టీ పరువును దిగజార్చే విధంగా ఎవరు వ్యవహరించినా ఊరుకునేది లేదని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. అయినా జిల్లా నాయకత్వాన్ని సమన్వయం చేయలేకపోవడమేంటని రాష్ట్రంలోని పార్టీ కీలక నేతలకు అమిత్ షా మొట్టికాయలు వేసినట్లు తెలిసింది. జిల్లాలో పార్టీ అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డికి, బండి సంజయ్‌కి మధ్య ఏ మాత్రం పొసగడం లేదు. ప్రస్తుతం ఇద్దరి మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. గత ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్‌కు గట్టి పోటీ ఇచ్చిన బండి సంజయ్ స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన విషయం విదితమే. ఈసారి కూడా టికెట్ గ్యారెంటీ అని ఆయన భావిస్తున్న తరుణంలో.. పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి వైఖరిపై ఆయన అసంతృప్తితో రగిలిపోతున్నారు. తన నియోజకవర్గంలో తనను సంప్రదించకుండా శ్రీనివాసరెడ్డి నచ్చిన వారికి పార్టీ పదవుల్లో నియమిస్తున్నారని సంజయ్ బహిరంగ ఆరోపణలు కూడా చేశారు. శ్రీనివాస్‌రెడ్డి తన వర్గాన్ని అణగదొక్కాలని చూస్తున్నాడని రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్‌కు ఫిర్యాదు కూడా చేశారు. అనంతరం రాజకీయాలనుంచి తాను తప్పుకుంటున్నట్లు మీడియా ముందు ప్రకటించడంతో జిల్లా బీజేపీలో నెలకొన్న విభేదాలు బట్టబయలయ్యాయి. అయితే బుజ్జగింపుల తర్వాత తాను బీజేపీ పార్టీకి దూరంగా ఉండడం లేదని, మోదీ నాయకత్వంలో పనిచేస్తానని కార్యకర్తల ద్వారా సంజయ్ ప్రకటించారు. అయితే శ్రీనివాస్‌రెడ్డిపై కేంద్ర కమిటీకి కూడా సంజయ్ ఫిర్యాదు చేయడంతో వీరి వివాదం అధిష్టానం దృష్టికి వెళ్లింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న బీజేపీ అధిష్టానం జిల్లా బీజేపి నాయకుల తీరుపై వారం రోజుల్లో నివేదిక ఇవ్వాల్సిందిగా పార్టీ జాతీయ కార్యదర్శి మురళీదర్ రావును పార్టీ ఆదేశించింది. త్వరలో జిల్లా సీనియర్ నాయకులతో మురళీధర్ రావు భేటీ కానున్నారు. పంతాలకు పోతే పార్టీ నుంచి బయటకు పంపిస్తామని కూడా అధిష్టానం జిల్లా నేతలకు ఇప్పటికే హెచ్చరికలు పంపినట్లు సమాచారం. తెలంగాణలో రాజకీయంగా బలమైన శక్తిగా ఎదగాలని చూస్తున్న బీజేపీ దిద్దుబాటు చర్యలకు పూనుకుంది.



## అద్భుతంగా 'ప్రపంచ ఐటీ కాంగ్రెస్'

- ఏర్పాట్లపై మంత్రి కేటీఆర్ సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (మనం న్యూస్): హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు 'ప్రపంచ ఐటీ కాంగ్రెస్' సదస్సు జరగబోతుంది. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్.. నాస్కామ్ బృందంతో కలిసి బుధవారం క్యాంప్ ఆఫీసులో సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సదస్సును నగరంలో నిర్వహించడాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తుందని కేటీఆర్ అన్నారు. సదస్సు కోసం ఏర్పాట్లను ఘనంగా నిర్వహిస్తుందని, సదస్సుకు హాజరయ్యే ప్రముఖులందరిని దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. నాస్కామ్ నాయకత్వ బృందం ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సదస్సు ఏర్పాట్లపై తగు సూచనలిచ్చింది. ఈ సదస్సుకు శ్రీలంక ప్రధాని విక్రమసింఘే, కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, కెనడా, చైనా, అర్మెనియా, నైజీరియా, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్తాన్, శ్రీలంక తదితర దేశాల నుంచి మంత్రులు సహా, దాదాపు 80 దేశాల నుంచి 2500 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ సదస్సు నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై జరిగిన సమావేశంలో మంత్రి కేటీఆర్‌తో పాటు నాస్కామ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, సైయెంట్ లిమిటెడ్ ఫౌండర్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ బీవీఆర్ మోహన్ రెడ్డి, టెక్ మహీంద్ర సీఈవో గుర్నాని తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




టీఎస్-ఐపాస్‌ను విజయవంతం చేసి లక్ష్యసాధనలో కీలకపాత్ర పోషించిన టీఎస్‌పీసీబీ సభ్యకార్యదర్శి పి. సత్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న మంత్రి జగదీశ్వర్ రెడ్డి, తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య ప్రతినిధులు

## హామీలు నెరవేర్చరా?

- నిధులు కేటాయించరా? • లోక్‌సభలో ఎంపీ జితేందర్‌రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 7: ఆయుష్మాన్ భారత్ పాలసీ భారాన్ని కేంద్రమే భరించాలని టీఆర్ఎస్ ఎంపీ జితేందర్‌రెడ్డి అన్నారు. లోక్‌సభలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. విభజన చట్టంలో తెలంగాణకు అనేక హామీలు ఇచ్చారన్నారు. ఇంతవరకు ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. తెలంగాణలో ఎయిమ్స్ ఏర్పాటుపై ఇంత వరకు స్పందన కరువైందన్నారు. చిన్న రాష్ట్రమే అయినా అభివృద్ధిలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. కేసీఆర్ సమర్థ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధిపథంలో పయనిస్తుందని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని వెల్లడించారు. రైతులకు మద్దతు ధర అంశంలో బడ్జెట్‌లో స్పష్టత లేదన్నారు. ప్రజారోగ్యానికి కేటాయింపులు తగ్గించారన్నారు. ఆయుష్మాన్ భారత్ ప్రకటనలో స్పష్టత లేదన్నారు. ఆయుష్మాన్ భారత్ కోసం కేవలం రూ. 2 వేల కోట్లు మాత్రమే కేటాయించారని.. ఆరోగ్యబీమా భారాన్ని కేంద్రమే భరించాలని ఎంపీ పేర్కొన్నారు.

## సమాధానాలు చెప్పలేకే అసెంబ్లీ ప్రోరోగ్

- ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి
- రావాల్సిన నిధుల గురించి అడిగేవారేరి



హైదరాబాద్, ఫిబ్రవరి 7 (మనం ప్రతినిధి): ప్రజా సమస్యలపై సమాధానం చెప్పలేకనే టీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీని ప్రోరోగ్ చేస్తున్నట్లు ప్రకటించందని ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాసమస్యలపై చర్చ కోసం ఎన్నిరోజులైనా అసెంబ్లీ నిర్వహిస్తామని చెప్పిన కేసీఆర్, రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ హత్యలకు సమాధానం చెప్పలేకే ప్రోరోగ్ చేశారన్నారు. విభజన చట్టంలో హక్కుల సాధనలో టీఆర్ఎస్ ఎంపీలు విఫలమయ్యారన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులపై పార్లమెంట్‌లో అడిగేవారు కరువయ్యారన్నారు. పీవీ. నరసింహారావు విషయంలో కాంగ్రెస్ వైఖరిని తప్పుపట్టడం, టీడీపీ ఆవిర్భావం, ఎన్టీఆర్ గురించి ప్రస్తావిస్తూ ప్రధాని మోదీ పార్లమెంట్‌లో చేసిన ప్రసంగం అసందర్భం అన్నారు. రాష్ట్ర విభజన హామీల గురించి ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రభుత్వాన్ని నిలదీస్తుంటే టీఆర్ఎస్ సభ్యులు బెల్లం కొట్టే రాయిలా ఉన్నారన్నారు.

### గొడవలు పెట్టేందుకు యత్నం: రేవంత్‌రెడ్డి



విభజన చట్టంలోని అంశాలపై శాశ్వత పరిష్కారం చూపకుండా తెలుగు రాష్ట్రాల మధ్య గొడవ పెట్టే విధంగా బీజేపీ వ్యవహరిస్తుందని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద బుధవారం ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో ప్రధాని మోదీ కాంగ్రెస్‌పై చవకబారు విమర్శలు చేశారన్నారు. పీవీ నరసింహారావు, అంజయ్య, నీలం సంజీవరెడ్డి విషయంలో కాంగ్రెస్ వారికి పెద్దపీట వేసిందన్నారు. వాజ్‌పేయి, అద్వానీ వంటి నేతల పట్ల బీజేపీ నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. సభా మర్యాదలకు మోదీ తిలోదకాలు ఇచ్చారన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందన్నారు. విభజన చట్టంలోని అంశాల గురించి మాట్లాడడంలో టీఆర్ఎస్ విఫలమయ్యిందన్నారు.

## ప్రధానివి అవగాహన లేని వ్యాఖ్యలు

- ఎన్నికలప్పుడే బీజేపీకి రామమందిరం గుర్తుకొస్తుంది
- హక్కుల సాధనలో టీఆర్ఎస్ విఫలం
- కాంగ్రెస్ నేత వీ హన్మంతరావు



హైదరాబాద్, ఫిబ్రవరి 7(మనం ప్రతినిధి): పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం అంజయ్యను కాంగ్రెస్ అవమానించిందని అనడం ప్రధాని మోదీ అవగాహన లేని తనానికి నిదర్శనమని కాంగ్రెస్ సీనియర్ నేత వీ.హన్మంతరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన బీజేపీ మద్దతుతోనే జరిగిందన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. జైలుకు పోయివచ్చిన యడ్యూరప్పను పక్కన పెట్టుకుని సిద్ధరామయ్య ప్రభుత్వం 10 శాతం కమీషన్ ప్రభుత్వమని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రధానిగా ఉండి ఎవ్వరూ తిరుగనన్ని దేశాలు మోదీ తిరిగారని విమర్శించారు. బీజేపీ హయాంలోనే పెట్రోల్ , గ్యాస్ ధరలు రెట్టింపయ్యాయన్నారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారన్నారు. కర్ణాటకలో గెలవడానికే బోఫోర్స్ కుంభకోణాన్ని ముందుకు తీసుకవచ్చారని ఎద్దేవా చేశారు. ఎన్నికలొచ్చినప్పుడే బీజేపీకి రామమందిరం గుర్తుకొస్తుందని విమర్శించారు. బీజేపీ సీనియర్ నేతలైన అద్వాని, వాజ్‌పేయిను తొక్కి పెట్టిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. విభజన చట్టంలోని హక్కులను సాధించుకోవడంలో టీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమయ్యిందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై టీఆర్ఎస్ నేతలు మాట్లాడడం లేదన్నారు. హక్కుల సాధన విషయంలో కేసీఆర్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతుందని ఆరోపించారు.

### స్టడీ సర్కిల్‌లో సమస్యలు పరిష్కరించండి

సివిల్స్ సర్వీసెస్ పరీక్షకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన స్టడీసర్కిల్స్‌లో సరైన వసతులు లేవని కాంగ్రెస్ నేత వీ.హన్మంతరావు అన్నారు. స్టడీ స్టర్కిల్ విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు లేవని, విద్యార్థినుల విభాగానికి కాపలాగా మహిళా వార్డెన్లు లేరని, పూర్తిస్థాయి సిబ్బంది లేరని వీహెచ్ పేర్కొన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుద్ధ ప్రసాద్ జోషిని బుధవారం సచివాలయంలో కలిసి ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. స్టడీ సర్కిల్ గానూ రూ.15 కోట్లు మంజూరు చేయగా రూ. 11 కోట్లు ఖర్చు అయినట్టు చూపారని, మిగతా రూ.7 కోట్లుకు సంబంధించిన వివరాలు లేవన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా నిధులు దుర్వినియోగం విషయం తెలిసిందన్నారు. ఈ విషయంపై కమిషనర్ కర్ణాకర్‌ను వివరణ కోరగా ఆయన ఆర్టీఐ లెక్కలు తప్పని దాటవేస్తున్నట్టు తెలిపారు.

## తెలుగు రాష్ట్రాలపై మోదీ కక్ష

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ



హైదరాబాద్, ఫిబ్రవరి 7: విభజన హామీలను అమలు చేయకుండా తెలుగు రాష్ట్రాలపై మోదీ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. విభజన చట్టం పార్లమెంటు తలుపులు మూసి ఆమోదించారని ప్రధాని మాట్లాడటం పార్లమెంటును అవమానపర్చడమేనని ఆయన అన్నారు. ప్రధాని తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా విభజన హామీలను అమలు చేయాలన్నారు. టీడీపీ నేత గాలి ముద్దుకృష్ణమనాయుడు మృతి పట్ల చాడ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి సీపీఐ తరపున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు చాడ ఒక ప్రకటనలో తెలిపారు.

# భాగ్యనగరంలో మరో సదస్సు

- 14 నుంచి హైటెక్స్‌లో 'మైనింగ్ టుడే'
- హాజరుకానున్న విదేశీ ప్రతినిధులు
- ముఖ్యఅతిథులుగా తోమర్, గవర్నర్ నరసింహన్, మంత్రి కేటీఆర్



మైనింగ్ ఉద్యోగుల డైరీని ఆవిష్కరించిన మంత్రి

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (మనం ప్రతినిధి): జీఈఎస్ సదస్సు నిర్వహణతో అంతర్జాతీయ ఖ్యాతి పొందిన భాగ్యనగరం మరో ప్రముఖ సదస్సుకు వేదికకానుంది. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు మైనింగ్-2018 సదస్సు జరగనుంది. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, ఆసియా, ఆఫ్రికా దేశాల నుంచి మైనింగ్ కంపెనీల ప్రతినిధులు సదస్సుకు హాజరుకానున్నారు. కార్యక్రమ ప్రారంభోత్సవానికి కేంద్రమంత్రి నరేంద్రసింగ్ తోమర్, గవర్నర్ నరసింహన్ హాజరు కానున్నారు. సదస్సులో తెలంగాణలో మైనింగ్ అనుబంధ రంగాల్లో పెట్టుబడులపై ప్రత్యేక చర్చ జరగనుంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేయాల్సిందిగా కోరుతూ గవర్నర్ నరసింహన్‌ను కలిసి మంత్రి కేటీఆర్ ఆహ్వాన పత్రం అందజేశారు. అనంతరం జరిగిన ఓ కార్యక్రమంలో మైనింగ్‌శాఖ అధికారుల డైరీని మంత్రి కేటీఆర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఈ అంతర్జాతీయ కాన్ఫరెన్స్, ఎగ్జిబిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వ మద్దతుతో మైనింగ్ ఇంజనీర్స్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా (ఎంఈఏఐ), ఫిక్కి కలిసి నిర్వహిస్తున్నాయన్నారు. టెక్నాలజీ, ఎక్విప్‌మెంట్, మేషినరీ, పాలసీ మరియు ఓవర్ సీస్ (టెంపో) థీమ్ తో ఈ సమావేశం జరుగుతున్నదని చెప్పారు. దేశ ఆర్థిక ప్రగతిని బలోపేతం చేసేందుకు మైనింగ్ ఒక కీలకమైన అంశమని, విద్యుత్, సిమెంట్, ఏరోస్పేస్, డిఫెన్స్, చమురు, గ్యాస్ వంటి రంగాలను ప్రభావితం చేసే పలు అంశాలను ఈ సదస్సులో చర్చించనున్నారు. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో ఖనిజాల అన్వేషణలో వస్తున్న మార్పులు, సాంకేతిక పరిజాన మార్పులపైన ప్రధానంగా ఈ సమావేశంలో చర్చ జరగనున్నది. మైనింగ్ సాంకేతిక పరిజాన అంశంలో గనుల గుర్తింపులో రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ల వినియోగం, గనులకు రేటింగ్ ఇవ్వడం, గనుల పర్యవేక్షణ వంటి అధునాతన సాంకేతిక పరిజానాలపైన వివిధ దేశాల నుంచి వచ్చే నిపుణులు చర్చిస్తారు. దీంతోపాటు మైనింగ్ పాలసీలు, వాతావరణం, మైనింగ్ రంగంలోని అవకాశాలు, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ వంటి అంశాలపైన ఈ సదస్సులో చర్చించడంతోపాటు అయా అంశాలకు సంబంధించిన నూతన ఉత్పత్తులను ఆవిష్కరించనున్నారు. ముఖ్యంగా ఇసుక ప్రొక్యూర్ మెంట్ విధానాల అధ్యయనంలో భాగంగా బీచ్ సాండ్స్, రివర్ సాండ్స్, క్రష్డ్ స్టోన్ సాండ్(రాతి ఇసుక) వంటి అంశాలను ప్రత్యేకంగా చర్చిస్తారు.

### త్వరితగతి ఎస్సార్డీపీ: కేటీఆర్



రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన వ్యూహాత్మక రహదారి అభివృద్ధి ప్రాజెక్టు (ఎస్సార్డీపీ) పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి కేటీఆర్ ఆదేశించారు. బుధవారం ట్రాన్స్ కో, జలమండలి, సీపీడీసీఎల్, జీహెచ్ఎంసీ అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు ఎస్సార్డీపీలో భాగంగా నగరంలోని కామినేని హాస్పిటల్, ఎల్బీ నగర్, బయోడైవర్సిటి పార్కు, చింతల కుంట, దుర్గం చెరువు వంటి ప్రాంతాల్లో చేపట్టిన పనులపైన ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. ప్రధానంగా విద్యుత్, వాటర్ వర్క్స్ లైన్ల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు.

# 'ఉల్పర'తో ముంపుండదు


- ఒక్క ఎకరా మునగదు.. వదంతులు నమ్మొద్దు
- అచ్చంపేట ప్రజా ప్రతినిధులతో మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, ఫిబ్రవరి 7 : డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా తలపెట్టిన ఉల్పర రిజర్వాయర్ తో ముంపు ఉండదని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈ రిజర్వాయర్ ద్వారా అచ్చంపేట మండలంలో లక్ష ఎకరాలకు నీరు అందుతుందని తెలిపారు. అతితక్కువ ముంపుతో, రైతాంగానికి ఎక్కువ ప్రయోజనం కలిగే విధంగా సీఎం కేసీఆర్ ప్రాజెక్టులను రీడిజైను చేశారని స్పష్టం చేశారు. బుధవారం జలసౌధలో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట అసెంబ్లీ నియోజకవర్గంలోని సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉల్పర రిజర్వాయర్ నిర్మాణం వల్ల ముంపునకు గురవుతామనే భయాందోళనలు అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ రిజర్వాయర్ సామర్థ్యం పై జరుగుతున్న ఊహగానాలను నమ్మవద్దని ఆయన కోరారు. 3 టీఎంసీలు లేదా ఒక టీఎంసీ కెపాసిటీతో ఈ రిజర్వాయర్‌ను కడుతున్నారనే ప్రచారాన్ని మంత్రి ఖండించారు. కేవలం .25 టీఎంసీ కెపిసిటీతో రిజర్వాయర్ నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ రిజర్వాయర్ పరిధిలో దాసరాజుపల్లి గ్రామం ముంపునకు గురవుతుందనే ప్రచారాన్ని నమ్మొద్దన్నారు. ఈ గ్రామంలో ఒక్క ఇల్లు కూడా ముంపునకు గురి కాదన్నారు. భూ నిర్వాసితులకు మార్కెట్ రేటు ప్రకారం తగిన పరిహారం చెల్లిస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. డిండి చీఫ్ ఇంజనీర్ సునీల్, రెవెన్యూ అధికారులతో కలిసి స్వయంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిస్థితులను అంచనా వేస్తారని మంత్రి తెలిపారు. ఉల్పర రిజర్వాయర్ కింద రెండు పంటలకు నీళ్లందుతాయని, మత్స్యకారులకు శాశ్వత ఉపాధి లభించనున్నదని చెప్పారు. ప్రస్తుతం పంటలు వేసుకొని ఉన్నందున దిగుబడి వచ్చేవరకు కాలువల తవ్వకం జరగదని కూడా మంత్రి భరోసా ఇచ్చారు. ఆమ్రాబాద్, పదర మండలాలకు సాగునీరు అందించాలని అచ్చంపేట శాసన సభ్యుడు బాలరాజు మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఈఎన్సీ మురళీధర్ రావు, సీఈఎస్ సునిల్, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

# వచ్చేనెలలో మత్స్య ఎగ్జిబిషన్

- దేశంలోనే తొలిసారి హైదరాబాద్‌లో: తలసాని
- ఆక్వాక్స్- ఇండియా 2018 లాంఛనంగా ప్రారంభం




హైదరాబాద్, ఫిబ్రవరి 7(మనం ప్రతినిధి): ఆక్వారంగంలో వినియోగించే సాంకేతిక పరిజ్ఞానంపై మత్స్యకారులకు అవగాహన కల్పించేందుకు మార్చి 15-18 మధ్య అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. అంతరాజతీయంగా అభివృద్ధి పర్చిన సాంకేతికవిధానాలు, కొత్త జాతులను ఉత్పత్తి చేసే విధానాలు, యంత్ర సామాగ్రి, ఉత్తమ మార్కెటింగ్ పద్ధతులు, నాణ్యతపై వినియోగదారులకు అవగాహన కల్పించడం, మానవ వనరుల నైపుణ్య అభివృద్ధికి కృషి వంటి అంశాలపై మత్స్యకారులంద రికీ అవగాహన కల్పించడానికే ఈ ఆక్వాక్స్- ఇండియా 2018 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వెల్లడించారు. బుధవారం సచివాలయంలో ఆక్వా ఎక్స్ ఇండియా-2018ను ఆయన ప్రారంభి మాట్లాడుతూ... దక్షిణాసియాలోనే మొట్టమొదటి సారిగా ఈ కార్యక్రమాన్ని తెలంగాణలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సొసైటీ ఫర్ ఇండియన్ ఫిషరీస్ ఆక్వాకల్చర్ సంస్థ సహకారంతో తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో సుమారు 25 దేశాల కంపెనీల ప్రతినిధులు, మన దేశంలోని అన్ని రాష్ట్రాల చేపల పెంపకం దారులు, ప్రజలు హాజరు కానున్నారని తెలిపారు. దేశ వ్యాప్తంగా 14.5 మిలియన్ల ప్రజలు మత్స్యరంగంపై ఆధారపడి జీవిస్తున్నారని, సుమారు 10.8 మిలియన్ టన్నుల చేపలను, రొయ్యలను ఉత్పత్తి చేస్తున్నారని వివరించారు. చేపలు, రొయ్యలు మనిషి ఆరోగ్యానికి చాలా అవసరమని వైద్యులు, నిపుణులు చెబుతున్నార న్నారు. సీఎం కేసీఆర్ ఆలోచనలతో చేపపిల్లల్ని భారీ ఎత్తున పెంచడం వలన మత్స్యరంగంలో మన రాష్ట్రానికి ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చిందన్నారు. గతేడాది 22 కోట్లు, ఈ ఏడాది 52 కోట్ల చేప పిల్లల్ని పంపిణీ చేయడంతో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. సమీకృత మత్స్యాభివృద్ధి పథకం ద్వారా సుమారు 1000 కోట్లతో ఖర్చుతో మత్స్య విత్తన అభివృద్ధి, సంపద అభివృద్ధి, చేపల వేట పరికరాలు, మార్కెటింగ్ సదుపాయాలు, మౌళిక సదుపాయాల అభివృద్ధి, శిక్షణ, క్షేత్ర సందర్శన వంటి కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందన్నారు.

ఈ సందర్భంగా పశుసంవర్ధక, మత్స్య శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానీయా మాట్లాడుతూ... మన రాష్ట్రంలో వాటర్ సోర్స్ ఎక్కువగా ఉన్నందున చేపల పెంపకానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సారి 1.50 లక్షల రొయ్యలని ప్రయోగాత్మకంగా పెంచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ కమిషనర్ శ్రీమతి సువర్ణ, సొసైటీ ఫర్ ఇండియన్ ఫిషరీస్ ఆక్వా కల్చర్ ప్రెసిడెంట్ రామచంద్రరాజు, సీఈఓ వేణు దంతులూరి, డైరెక్టర్ సమీర్ పాత్ర తదితరులున్నారు.

## సుపరిపాలనే బీజేపీ లక్ష్యం

- పార్టీ జాతీయ కార్యదర్శి మురళీధర్ రావు
- బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేయలేదు
- మేడారం హోదాపై టీఆర్ఎస్‌కు చిత్తశుద్ధి లేదు



హైదరాబాద్, ఫిబ్రవరి 7 (మనం న్యూస్): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ఏమాత్రం అన్యాయం చేయలేదని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి మురళీధర్ రావు అన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం కేంద్ర బడ్జెట్‌పై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అవినీతి, నల్లధనాన్ని అరికడితేనే దేశం అభివృద్ధి చెందుతుందని, ఈ దృష్టితోనే ప్రతి ఏటా బడ్జెట్ రూపొందిస్తున్నామన్నారు. జాతీయ రహదారుల కేటాయింపుల్లో దేశంలోనే అత్యధికంగా తెలంగాణకు కేటాయించామని, రాష్ట్రం అడిగిన దానికంటే ఎక్కువ నిధులు ఇచ్చామని అన్నారు. ఇరిగేషన్, రైల్వే శాఖలకు తగినన్ని నిధులిచ్చామన్నారు. మరిన్ని నిధులు రాలేదనంటే అది తెలంగాణ ప్రభుత్వ అసమర్థతే అన్నారు. మేడారం జాతరను జాతీయ పండగగా గుర్తించాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేసిందని, కానీ జాతరకు కేవలం కొన్ని రోజుల ముందు తీర్మానం చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. మేడారం జాతర విషయంలో తెలంగాణ ప్రభుత్వ బాధ్యతారాహిత్యం అడుగడుగునా కనిపిస్తోందన్నారు. జీఎస్టీ కౌన్సిల్ సమావేశాల్లో నోరు విప్పని తెలంగాణ ఆర్థికమంత్రి ఇప్పుడు జీఎస్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, వారి ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మోదీ పాపులారిటీపై మాట్లాడే అర్హత టీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. నోట్ల రద్దు, జీఎస్టీలతో పన్నులు చెల్లించే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని, ఆయుష్మాన్ భారత్ ఒక గొప్ప పథకమని, దీన్ని వ్యతిరేకించే పార్టీలు దుమ్ము కొట్టుకుపోతాయన్నారు. టీఆర్ఎస్, కాంగ్రెస్‌లో పెద్దపెద్ద కళాశాలల్లో చదువుకున్న ఆర్థికవేత్తలు ఉన్నారు కానీ హృదయమున్న ఆర్థికవేత్తలు లేరని విమర్శించారు. వ్యవసాయం లేనిదే భారత్ లేదని, వ్యవసాయానికి అండగా ఉండే ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. ఇది ఎన్నికల కోసం తీసుకొచ్చిన బడ్జెట్ కాదని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ వ్యవసాయం, వైద్యం, విద్య రంగాలకు బడ్జెట్‌లో పెద్దపీట వేశారన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేసిన బడ్జెట్‌పై కొందరు అనవసరంగా విమర్శలు చేస్తున్నారన్నారు. స్వామినాథన్ సిఫార్సుల మేరకు వ్యవసాయానికి నిధులు కేటాయించమన్నారు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
గురువారం, ఫిబ్రవరి 8

# బలహీన బంధం!

భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ (ఎన్‌డీఏ)లో కొనసాగాలా వద్దా అనే మీమాంసలో ఉన్నారు తెలుగు దేశం పార్టీ (టీడీపీ) జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు నాయుడు. బడ్జెట్‌లో కేంద్రం ఆంధ్రప్రదేశ్ పట్ల వ్యవహరించిన తీరుతో టీడీపీలో అసంతృప్తి, అసమ్మతి, అసహనం రగిలిపోతున్నాయి. గత శుక్ర, శనివారాల్లో టీడీపీ జరిపిన ఆంతరంగిక సమావేశాలు ఎన్డీఏతో టీడీపీ పొత్తు ఇక ఎక్కువ కాలం కొనసాగుతుందా అన్న అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్‌డీఏ అధికారంలో ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ పట్ల కేంద్రం వ్యవహరించిన తీరు పట్ల చంద్రబాబు నాయుడు బహిరంగంగానే తన అసంతృప్తినీ, అసహనాన్నీ వ్యక్తం చేశారు. 2014లో ఎన్నికల ప్రచార సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వాగ్దానాలు చేసిన వారిలో ఉన్నారు.

నిజానికి పార్లమెంట్‌లో రాష్ట్ర విభజనపై చర్చ జరిగినప్పుడు అప్పట్లో రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రస్తుత ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడుతో పాటు రాష్ట్ర ప్రయోజనాలను వెనకేసుకొస్తూ గట్టిగా పోరాడారు. అయినప్పటికీ బడ్జెట్‌లో ఏపీని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం చూస్తే ఇక ఎన్‌డీఏ ప్రభుత్వంలో రాష్ట్రానికి న్యాయం జరిగే అవకాశం లేదనే అభిప్రాయం బలంగా ఏర్పడుతోంది. ఒక్క ఆంధ్రప్రదేశ్ గురించే కాదు, తెలంగాణ రాష్ట్ర ప్రస్తావన కూడా బడ్జెట్‌లో ఎక్కడా కనిపించకపోవడం తెలుగు రాష్ట్రాల ప్రజలను, రాజకీయ పక్షాలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో కాలు పెట్టాలనుకుంటున్న బీజేపీకి కూడా ఇది తీరని విఘాతం కావచ్చు.

బడ్జెట్ రూపకల్పనకు ముందు వివిధ రాష్ట్రాలతో కేంద్ర ఆర్థిక మంత్రి జరిపే చర్చల్లో చంద్రబాబు ఆర్థిక మంత్రికి రాష్ట్రావసరాల జాబితాను అందజేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి కూలంకషంగా వివరించారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు, రెవెన్యూ లోటు భర్తీ, విశాఖపట్నంలో రైల్వే జోన్ ఏర్పాటు, కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం, కొత్త రాజధాని అమరావతి నిర్మాణానికి సహాయం, ప్రత్యేక హోదాకు బదులుగా ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీల గురించి ఆయన ఇతర కేంద్ర మంత్రులకు కూడా మరీ మరీ చెప్పారు. అయినప్పటికీ బడ్జెట్‌లో ఆ చర్చల్ని పట్టించుకున్న పాపాన పోలేదు. ఇది తమ నాయకుడిని చిన్నచూపు చూడడం తప్ప మరేమీ కాదని, మోదీ కన్నా ముందే జాతీయ రాజకీయాల్లో కేంద్ర బిందువైన తమ నాయకుని స్థాయిని కించపరుస్తున్నారని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి. కేంద్ర బడ్జెట్‌లో ఈ విధమైన వివక్ష చూపించడం అనేక రాజకీయ దుష్పరిమాణాలకు దారి తీస్తుందని కూడా టీడీపీ నాయకత్వం అభిప్రాయపడుతుంది.

ముఖ్యమంత్రి జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే అవకాశం ఉందనే అనుమానంతో మోదీ ముఖ్యమంత్రికి పగ్గాలు వేసే ఆలోచన చేస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకులు కొందరు భావిస్తున్నారు. ఇటీవలి ఎన్నికల ఫలితాలను బట్టి మోదీ ప్రభావం క్రమంగా క్షీణిస్తోందని అర్థమవుతోంది. అయితే, కాంగ్రెస్ నాయకత్వం ఈ పరిస్థితిని ఆశించిన స్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోతోంది. దరిమిలా దేశ రాజకీయాల్లో బీజేపీయేతర, కాంగ్రెసేతర కూటమి ఏర్పడడానికి అవకాశం ఏర్పడుతోంది. ఈ కూటమి ఏర్పాటులో చంద్రబాబు ప్రధానపాత్ర పోషించే అవకాశం ఉందనే మోదీ టీడీపీ విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారని చంద్రబాబు సన్నిహిత వర్గాలు భావిస్తున్నాయి. జేడీ (యూ) నాయకుడు నితీశ్ కుమార్ మళ్లీ ఎన్‌డీఏ కూటమిలో చేరడం, జయలలిత మృతి చెందడం, మాయావతి పరిస్థితి ఆశాజనకంగా లేకపోవడం వగైరా పరిణామాల వల్ల చంద్రబాబు, మమతా బెనర్జీ కొత్త కూటమి అగ్రస్థానానికి (ప్రధాని పదవికి కూడా) ముఖ్య పోటీదారులయ్యే అవకాశం ఉంది. పార్టీలో కానీ, పొత్తులో గానీ, బయటగానీ ఇటువంటి పోటీ తలెత్తడం సహజంగానే మోదీకి సుతరామూ నచ్చని విషయం.

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంత వరకూ బీజేపీ ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తోంది. ఒక పక్క టీడీపీతో పొత్తు కొనసాగిస్తూనే మరోపక్క ప్రతిపక్ష నాయకుడు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి చేయి అందుకోవాలని ప్రయత్నిస్తోంది. పొత్తులో తమ బద్ధ శత్రువు టీడీపీ ఉన్నప్పటికీ రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ బీజేపీ అభ్యర్థికి మద్దతునిచ్చిన విషయం విదితమే. అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ బీజేపీ, టీడీపీలు అధికారాన్ని పంచుకుంటున్నప్పటికీ, మొదటి నుంచి టీడీపీ విషయంలో బీజేపీ ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తూనే ఉంది. చంద్రబాబు మంత్రివర్గంలో బీజేపీ మంత్రులు కూడా ఉన్నారన్న మాటే గానీ, రాష్ట్ర బీజేపీ నాయకులు అవకాశం దొరికినప్పుడల్లా టీడీపీ పాలన మీద విమర్శలు సాగిస్తూనే ఉన్నారు. టీడీపీతో తెగతెంపులు చేసుకుంటే జగన్మోహన్ రెడ్డి పార్టీని కలుపుకుపోవడానికి బీజేపీ సిద్ధంగా ఉన్నట్టు కనిపిస్తోంది.

అవకాశం దొరికితే చాలు చంద్రబాబు మీద ధ్వజమెత్తే రాష్ట్ర బీజేపీ నాయకులు జగన్మోహన్ రెడ్డిని గానీ, ఆయన పార్టీని గానీ పల్లెత్తు మాట అనకపోవడం గమనార్హం. ప్రాంతీయ పార్టీల పట్ల బీజేపీ ద్వంద్వ ప్రమాణాలు ఆచరిస్తోందనడానికి అదే ప్రబల నిదర్శనం. బీజేపీ పవన్ కల్యాణ్ పార్టీని కూడా కలుపుకోవాలని ఆశించింది. 2014లో ఆయన బీజేపీ-టీడీపీ పొత్తు తరపున ప్రచారం కూడా చేశారు. తన నాయకత్వంలోని జనసేన పార్టీని తమ పార్టీతో విలీనం చేయాలని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఇటీవల కోరినట్టు పవన్ ఒక సందర్భంలో బయటపెట్టారు. ఈ విషయాన్ని బీజేపీ నాయకులెవరూ ఖండించలేదు కూడా. మొత్తానికి బీజేపీ తన రాజకీయ ఎత్తులు జిత్తులతో ముందుకు వెడుతుండగా చంద్రబాబు మౌనంగా ఉండడమనేది జరగని పని. 2014 ఎన్నికల్లో మోదీతో పొత్తు పెట్టుకోవడం ఓ కీలక పరిణామం. అప్పట్లో టీడీపీ, వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ మధ్య ఓట్ల తేడా రెండు శాతం మాత్రమే. వచ్చే ఏడాది లోక్‌సభ, శాసనసభ ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో బీజేపీతో తెగతెంపులు చేసుకోవాలని చంద్రబాబేమీ భావించడం లేదు. అయితే, ఆంధ్రప్రదేశ్ పట్ల బీజేపీ ప్రభుత్వం కనబరుస్తున్న సవతి తల్లి ప్రేమను, జాతీయ రాజకీయ పరిణామాలను, వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పట్ల బీజేపీ నాయకుల వైఖరిని దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు చివరికి బీజేపీతో తెగతెంపులు చేసుకోక తప్పకపోవచ్చు.


## ఓటు అంటే నోటు కాదు

కవిత





చైతన్యానికి దిక్సూచి ఓటు
నవ్యజగతికి నాంది ఓటు
ప్రజాస్వామ్యానికి ఊపిరి ఓటు
చీకటి బతుకులకు వెలుగు ఓటు
మనిషి ఓటు అయితే
ఓటు మార్పు అయితే
మార్పు చైతన్యమైతే
చైతన్యం ప్రజాస్వామ్యమైతే
ప్రజాస్వామ్యం ప్రగతైతే
ప్రగతి జగతి అయితే
జగతిని కోరని జనం
నోటు కోరితే ఖూనీ అవుతుంది
అందుకే ఓటు అంటే నోటు కాదు

- బైరపాక స్వామి
9951828781




## మంచిమాట



'ఒకరిపై చాడీలు చెప్పేవారితో నీవు ఏకీభవిస్తే నీపై కూడా చెప్పడం ప్రారంభిస్తారు'


అబ్రహం లింకన్

# క్రికెట్‌లో దూకుడుకే ప్రాధాన్యం!



ఆస్ట్రేలియాను ఓడించడం ద్వారా భారత్ అండర్ - 19 క్రికెట్ జట్టు నాలుగోసారి ప్రపంచ కప్‌ను సాధించడం చరిత్ర సృష్టించింది. న్యూజిలాండ్‌లో జరిగిన అండర్ -19 క్రికెట్‌లో మంచి టీమ్‌వర్క్, టీమ్ స్పిరిట్ భారత్ కుర్రాళ్లు కైవశం చేసుకోవడం సీనియర్ ఆటగాళ్లకు స్ఫూర్తిగా నిలిచారు. వారిలో ఉన్న దూకుడు స్వభావమే వారిని విజయతీరానికి చేర్చిందని చెప్పవచ్చు. వారి ఆటతీరులో ఆత్మవిశ్వాసం ప్రస్ఫుటంగా ద్యోతకమైంది. ఆసిస్‌ను 217 పరుగులకు నియంత్రించిన తరువాత 38.5 ఓవర్లలో లక్ష్యాన్ని పూర్తిచేశారు. మంజోత్ కర్ల చేసిన అజేయ సెంచరీ భారత్‌ను విజయం వైపు తీసుకెళ్లింది. సుభ్‌మాన్ గిల్‌కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ దక్కింది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం అతను 372 పరుగులు చేశాడు. కర్లకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది. ఆట మొత్తం భారత్ జట్టు చూపించిన ప్రదర్శన అబ్బురపరిచింది. బౌలర్లు కమలేశ్ నగర్‌కోటి, శివం మావి ఇద్దరూ అత్యంత వేగంగా (145 కెఎంపీహెచ్) బౌలింగ్ చేసి అభిమానులను అలరించారు. అలాగే, స్పిన్నర్ అనుకుల్ రాయ్ అత్యంత అధిక వికెట్లు తీసుకున్న బౌలర్‌గా నిలిచాడు. తాజాగా నిర్వహించిన మర్కీ టోర్నమెంట్‌కు వేలంలో ఐదుగురు క్రికెటర్లు కర్ల, షా, గిల్, కమలేశ్ నగర్‌కోటి, శివం మావిలను స్థానం లభించడం భారత్ ఔత్సాహిక క్రికెటర్లకు మరో ఉత్సాహాన్నిచ్చే సమాచారం. ప్రతిభ ఎక్కడున్నా కృషితో దానంతటదే బయట పడుతుందనడానికి ఇదో ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఈ ఘనత అంతా భారత మాజీ క్రికెటర్, కోచ్ రాహుల్‌ద్రావిడ్‌కు దక్కుతుంది. యువ క్రికెటర్లను ఆయన సరైన దిశలోనే శిక్షణ ఇస్తున్నారనడానికి ఉదాహరణగా భారత్ అండర్ -19 జట్టు ప్రపంచ కప్ దక్కించుకోవడం రుజువు చేస్తోందని క్రికెట్ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. గత అండర్-19 విజేత జట్టులో కూడా చక్కని టీమ్‌వర్క్, ప్రతిభ ఉండడమే భారత్‌కు విజయం సాధించిపెట్టింది. ఇందుకు విరాట్ కొహ్లిని ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

ప్రస్తుత జట్టు చూపించిన దూకుడు వైఖరి సీనియర్ జట్టుకు ఆదర్శనీయంగా నిలుస్తుంది. ఆట మొత్తం దూకుడు, ఆత్మవిశ్వాసం... జట్టుసభ్యుల హావభావాల్లో ప్రస్ఫుటంగా కనిపించాయి. అప్పీళ్లు,




> దూకుడు వైఖరితోనే ఇటీవల అండర్-19 ప్రపంచ కప్ భారత్ గెలుచుకున్నది. దూకుడు స్వభావం సర్వవిధాల వాంఛనీయం కాకపోయినా తరచుగా భారత్‌కు దూకుడు స్వభావమే విజయాలను తెచ్చిపెడుతోంది. ఇలా దూకుడు స్వభావం ఉన్న వాళ్లు భారత్ జట్టులో గతంలోనూ ఉన్నారు. దూకుడు చూపించే పాతతరం క్రికెటర్లలో ఒక్కొక్కరు ఒక్కొక్కరకంగా బయటపడేవారు.ప్రస్తుత సీనియర్ల క్రికెట్ జట్టుకు కెప్టెన్ విరాట్ కోహ్లీది ప్రత్యేకశైలి. ఆయనను రెచ్చగొట్టి లబ్ధిపొందుదామని అంతర్జాతీయ క్రికెటర్లు సైతం తరచూ ప్రయత్నిస్తూంటారు. ఒక్కొక్కసారి విజయం సాధించడం కద్దు. ఆ విధంగా అంతర్జాతీయ క్రీడాకారులు కూడా ఆటలో ఆటను ప్రదర్శిస్తుంటారు.

బ్యాట్స్‌మెన్‌ను గుక్కతిప్పుకోనివ్వకపోడం, ప్రత్యర్థి జట్టును కంగారుపెట్టి, దిక్కుతోచని స్థితిలో పడేయడం జట్టు సభ్యుల్లో ప్రస్ఫుటంగా కనిపించాయి. దృఢమైన టీనేజర్ల జట్టు కలసికట్టుదనం కలిగివుండడం అంత సులభమైన విషయం కాదు. ఇది అసహజమేమీ కాకపోయినా కలసికట్టుగా భారత్‌ను కుర్రాళ్ల జట్టు విజయం దిశగా నడిపించింది. దూకుడుతనంలో రెండు రకాలుంటాయి. అది ఒకవిధంగా జట్టుకు పోత్సాహాన్నిస్తుంది. ప్రతిభను ప్రదర్శించేలా ఉత్సాహాన్నిస్తుంది. అందులో దాగున్న మజాను అనుభవించమంటుంది. మరోవైపు దూకుడు వ్యతిరేక స్వభావాన్ని కలిగించి ప్రతికూల ఫలితాన్ని ఇస్తుంది. ప్రస్తుతం అండర్ -19 జట్టు మొదటి స్వభావాన్ని అనుసరించి, విజయాన్ని అందుకోగలిగింది. భారత్ జట్టు చూపించిన దూకుడు వల్ల ప్రత్యర్థి జట్టులో భయం, జంకును సృష్టించగలిగిందని చెప్పుకోవచ్చు. ఫీల్డ్‌ను అంపైర్లు, రిఫరీలు అదుపు చేస్తారు. ఫీల్డ్‌లో చెడుప్రవర్తనను నిరోధించేందుకు క్రికెట్‌కు కొన్ని నిబంధనలుంటాయి. అక్కడ 'కోడ్ ఆఫ్ కాండక్ట్' ఉంటుంది. అది లైన్ అతిక్రమించకుండా చూస్తుంది. అలా ఆ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను అతిక్రమిస్తే పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుంది. ఒక్కొక్కసారి అంపైర్లు, రిఫరీలు కూడా పొరపాటు పడుతుంటారు. ఎంతైనా వాళ్లూ మానవమాత్రులే కదా! భారత్ జట్టులో సీనియర్ల గురించి చెప్పుకోవాలంటే మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ ఆ కాలంలో జట్టుకు కవచంలా నిలిచాడు. వ్యక్తిగతంగా పోరాడేతత్వం ఉన్నవాడు. గంగూలీ వంటి పోరాడేతత్వం గల ఆటగాళ్లు ప్రస్తుతం జట్టులో చాలామంది ఉన్నారు కాబట్టి అలాంటి తత్వం అభివ్యక్తీకరించవలసిన అవసరం ప్రత్యేకంగా కనిపించడం లేదు. ద్రావిడ్, లక్ష్మణ్, సెహ్వాగ్, టెండూల్కర్, కుంబ్లే, శ్రీనాథ్‌లను తీసుకుంటే అంతర్భూతంగా గంగూలీ తత్వం కలిగినవాళ్లే. వారిలో దూకుడు స్వభావమే లేకపోతే వారి చర్యలన్నీ కృత్రిమంగా ఉండేవి. ప్రతిస్పందన వేరేగా ఉండేది.

విరాట్ కొహ్లి విషయానికొస్తే, మొత్తం భారాన్ని తన భుజస్కంధాలపై మోస్తాడు. తరచుగా ఇది ఫీల్డ్‌లో కనిపిస్తుంది. కొహ్లిని రెచ్చగొట్టి భారత్ వ్యూహాన్ని చెదరగొట్టాలని ప్రత్యర్థులు తరచూ ప్రయత్నిస్తుంటారు. అందుకే ఆయనకు జరిమానాలు ఎదురవుతుంటాయి. భారత్ అంశంలో మాత్రమే ఆటలో ఆటకు అంతర్జాతీయ జట్లు ప్రయత్నిస్తుంటాయి. అయితే ప్రతికూల దూకుడు కొహ్లి లోనుకావడం చాలా అరుదు. ఆటలో గెలుపోటములు సహజం. ఒక్కొక్కసారి నిరాశ ఎదురుకావచ్చు. ఒకసారి ఒక బ్యాట్స్‌మన్ ప్రత్యర్థిని ఒకానొక అంశంలో బ్యాట్ చూపిస్తూ బెదిరించడం కనిపించింది. క్రికెట్ అంటే పెద్దమనుషుల ఆట అని అలాంటివారికి మనం వివరించలేము. మన క్రికెటర్ల నుంచి మనం ఎందుకు మంచి స్వభావాన్ని, సున్నితంగా మాట్లాడడం, నిరాడంబరత్వంతో కూడిన స్వీయ ప్రతిభావంతాన్ని ఆశిస్తాం? అవసరమైనప్పుడు దూకుడు చూపించాలని కోరుకుంటాం. భయపడడం, కోల్పోవడం కంటే దూకుడుతో ఆడి గెలవడమే మంచిది.

- సురేశ్ మీనన్
క్రీడా విశ్లేషకుడు

మన లేఖలు

## బెల్లంపల్లి మెడికల్ కాలేజికి నిధులివ్వాలి

దేశంలోని ప్రతి 3 పార్లమెంటు నియోజకవర్గాలకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తూ ప్రజలకు వైద్య విద్య ద్వారా వైద్య సదుపాయం కల్పిస్తామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించడం పట్ల కేంద్రాన్ని అభినందిస్తూ, తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బెల్లంపల్లిలో 2001లో మెడికల్ కళాశాల భవనం రూ.7 కోట్ల ప్రభుత్వ సొమ్ముతో నిర్మించి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తుంది. పెద్దపల్లి, ఆదిలాబాద్, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాలకు కేవలం 70 కిలోమీటర్ల దూరంలో గల బెల్లంపల్లిలో ప్రభు త్వ వైద్య కళాశాలగా రూపుదిద్దితే ఉత్తర తెలంగాణలోని జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి, ఆసిఫాబాద్, కరీంనగర్, రాయ పట్నం ప్రజలకు ఎంతో లాభంగా ఉంటుంది. ఈ విషయమై బెల్లంపల్లి ఎంఎల్ఏ చిన్నయ్య శాసనసభలో ప్రశ్న అడి గిన వైనంపై రాష్ట్ర సర్కార్ బెల్లంపల్లిలో వైద్య కళా శాల నెలకొల్పేలా చర్యలు చేపట్టాలని సీఎంను కేసీఆర్‌ను కోరుతున్నాం.

- కోలిపాక శ్రీనివాస్
9133135710

## సిట్టింగ్ స్క్వాడ్లుగా రెవెన్యూ అధికారులు వద్దు

రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో నిర్వహించే పదవ తరగతి పరీక్షలకు సిట్టింగ్ స్క్వాడ్లుగా రెవెన్యూ అధికారులకు బాధ్యతలను అప్పగించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించినట్టు సమాచారం. అయితే విద్యార్థికే పదవ తరగతి పరీక్ష అత్యంత ము ఖ్యమైనది. ఏదైనా ఎక్కువ మొత్తంలో అవినీతి జరుగుతున్న శాఖ ఏదైనా ఉంది అంటే అందరూ రెవెన్యూనే ముందంజలో ఉంటదని అంటారు. సిట్టింగ్ స్క్వాడ్లుగా (పరీక్ష కేంద్రాన్ని) పర్యవేక్షించే బాధ్యతలు రెవెన్యూ అధికారులకు ఇస్తే నమ్మడం ఎలా? ఎక్కడ మాస్ కాపియింగ్‌కు అస్కారం లేకుండా చూడగలరా! పదవ తరగతి పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలి, చూసిరాతకు అస్కారం ఇచ్చి విద్యార్థుల జీవితాలను ఇబ్బం దుల్లో పెట్టొద్దు. చూసిరాసే విద్యార్థికీ భవిష్యత్తులో అన్ని ఇ బ్బందులే ఎదుర్కోవాల్సి వస్తుంది. పది ఫెయిల్ అయితే ఏ దైనా పనిలో అయినా నిమగ్నమై పైకి రావొచ్చు. కానీ మాస్ కాపీయింగ్ ద్వారా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగలేడు. విద్యాశాఖపై రెవెన్యూ అధికారుల పై చెయేంటి? వి ద్యాశాఖలో సిట్టింగ్ స్క్వాడ్లుగా చేసే అధికారులు సమర్థులు లేరా! పది పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలి, చూసిరాతలను ప్రోత్సహించే అధికారులపై వేటు వేయాలి.

- గుండమల్ల సతీష్‌కుమార్
సంస్థాన్ నారాయణపురం

## విశ్వవిద్యాలయల్లో ఆన్‌లైన్ సేవలు మేలు

తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయ సేవలను వెంటనే ఆన్ లైన్ చేయాలి. విశ్వవిద్యాలయ నిధుల సంఘం అన్ని విశ్వవిద్యాలయ సేవలు, పరీక్షల ఫీజు చెల్లింపులు, లావాదేవీలు నగదు రూపంలో కాకుండా ఆన్‌లైన్ ద్వారానే జరగాలని నోటీసు కూడా జారీచేస్తే తెలంగాణలోని కొన్ని విశ్వవిద్యాలయాలు మాత్రం ఇప్పటికీ అమలు చేయటంలో మీనమేషాలు లెక్కిస్తున్నాయి. డిజిటలైజేషన్‌లో భాగంగా విశ్వవిద్యాలయ అన్ని సేవలు ఆన్‌లైన్ చేస్తే పారదర్శకత పెరగటంతో పాటు విద్యార్థులులకు ఫీజు చెల్లింపులు ఆన్ లైన్, డెబిట్ కార్డు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా చేయటం వల్ల విశ్వవిద్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరిగే బాధ ఉండదు. ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలు దూరవిద్యా విధానంలో అన్ని కాల సేవలు ఆన్‌లైన్ ద్వారా విజయవంతంగా నిర్వహిస్తుంటే మన రెగ్యులర్ యూనివర్సిటీలు మాత్రం అమలు చేయటంలో ఇంకా జాప్యం చేస్తున్నాయి. దీనివల్ల ప్రజలు, విద్యార్థులు అనేక ఇక్కట్లు పడుతున్నారు. కాబట్టి వెంటనే అన్ని విశ్వవిద్యాలయాలు, విశ్వవిద్యాలయ అన్ని సేవలు ఆన్‌లైన్ ద్వారా జరిగేలా చర్యలు తీసుకోవాలి. అనుభవం, నైపుణ్యం కలిగిన సిబ్బంది నియమించి విద్యార్థులకు సులువుగా సర్టిఫికెట్స్ తీసుకొనేలా కృషి చేయాలి. ఇలా చేయటం ద్వారా విశ్వవిద్యాలయాల్లో పారదర్శకత పెరుగుతుంది.

- కందగట్ల శ్రవణ్ కుమార్
జె.ఆర్.ఎఫ్ పరిశోధకులు సంఘం ప్రధాన కార్యదర్శి, కె.యు

# ఆ టీచర్‌కు రాజకీయాలే ఊపిరి

నివాళి



విద్యార్థిగా రాణించారు. ఉపాధ్యాయునిగా గుర్తింపు పొందారు. రాజకీయాలలో అవిశ్రాంత పోరాటం జరిపారు. ఎన్నికల రంగంలో కాలుమోపింది మొదలు తుదిశ్వాస విడిచే వరకు రాజకీయాల్లోనే జీవించారు. నియోజక వర్గాలు మారారు. పార్టీలు మారారు. ఎనిమిదిసార్లు శాసన సభ్యునిగా పోటీచేశారు. ఆరుసార్లు గెలుపొందారు. మూడుసార్లు మంత్రివర్గాల్లో స్థానం సంపాదించుకొన్నారు. అంతటి సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన గాలి ముద్దు కృష్ణమ నాయుడు 2018 ఫిబ్రవరి 6వ తేదీ అర్ధరాత్రి (తెల్లవారితే 7వ తేదీ) కన్నుమూశారు.

1947 జూన్ 9న ముద్దు కృష్ణమనాయుడు చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలంలోని వెంకట్రామాపురంలో జన్మించారు. తల్లి రాజమ్మ, తండ్రి రామానాయుడు. ప్రాథమిక విద్యను జన్మస్థలంలో పూర్తిచేసి ఉన్నత విద్య తిరుపతి, హైదరాబాద్‌ల్లో చేశారు. బిఎస్‌సి, యంఎ లాంటివే కాక న్యాయవాద డిగ్రీ కూడా అందుకొన్నారు. అధ్యాపక వృత్తిని చేపట్టారు. గుంటూరు జిల్లా పెదనందిపాడులోని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో అధ్యాపకునిగా చేరి వేలాది మందిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దటానికి అవిరళ కృషిచేశారు. ఆ వృత్తిలో కొనసాగుతున్న దశలోనే తెలుగు వెండితెర వేలుపు నందమూరి తారక రామారావు 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించారు. చిత్తశుద్ధి ధ్యేయంగా, లక్ష్యశుద్ధి లక్ష్యంగా ముందుకు సాగేవారిని సమీకరించే ప్రయత్నం చేస్తున్న రామారావు దృష్టికి ముద్దుకృష్ణమ వెళ్ళారు. పార్టీలోకి ఆహ్వానించారు. దాంతో ఉద్యోగానికి స్వస్తిపలికి రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1983 అసెంబ్లీ ఎన్నికల్లో స్వంతజిల్లాలోని పుత్తూరు నియోజకవర్గం నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ముద్దు కృష్ణమనాయుడితో పోటీపడిన కాంగ్రెస్ అభ్యర్థిపై 32,305 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1983 నాటి మంత్రివర్గ పదవీకాలం ముగియక ముందే ఎన్టీఆర్ వెన్నుపోటు కారణంగా పదవిని కోల్పోయారు. నెలరోజుల వ్యవధిలో మళ్ళీ ముఖ్యమంత్రిగా నియమితులైన రామారావు రెండో మంత్రివర్గంలో కృష్ణమ నాయుడుకు మంత్రిపదవి దక్కింది. విద్యాశాఖ ఆయనకు లభించింది. 1984 సెప్టెంబరు 16 నుంచి 1985 మార్చి 9 వరకు విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1985లోనే శాసనసభకు ఎన్నికలు అనివార్యమయ్యాయి. మళ్ళీ పుత్తూరు నుంచే కాంగ్రెస్ అభ్యర్థి యం.ప్రసాద్‌ను 17,201 ఓట్ల తేడాతో ఓడించారు. 1985 మార్చి 9న ఏర్పాటైన నంద మూరి తారకరామారావు మంత్రివర్గంలో ముద్దు కృష్ణమ నాయుడు మళ్ళీ విద్యాశాఖనే చేపట్టి 1988 ఫిబ్రవరి 12 వరకు కొనసాగారు. 1989లో తిరిగి ఎన్నికలు జరిగినప్పుడు కూడా పుత్తూరు నుంచే పోటీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి బి.రామకృష్ణారెడ్డి కూడా 5,492 ఓట్ల తేడాతో ఓడించారు. 1994లోనూ పుత్తూరు నుంచే పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి రెడ్డి వారి రాజశేఖర్‌రెడ్డిని 10,633 ఓట్ల తేడాతో ఓడించారు. 1994 డిసెంబరు 12న ఏర్పాటైన రామారావు అయిదవ మంత్రి వర్గంలో కూడా ఉన్నత విద్యాశాఖను చేపట్టి 1995 ఆగస్టు 31 వరకు కొనసాగారు.

తెలుగుదేశంలో తిరుగుబాటు బావుటా ఎగరటం, రామారావు పదవీచ్యుతుడు కావటం చకచకా జరిగిపోయాయి. తనకు రాజకీయ భిక్షపెట్టిన ఎన్టీఆర్ వెంటే 1999లో తెలుగుదేశం అభ్యర్థిగా పుత్తూరు నుంచి పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి రెడ్డివారి రాజశేఖర్ రెడ్డి చేతుల్లో 6,765 ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. తెలుగుదేశంలో ప్రాధాన్యత తగ్గడంతో ఆ పార్టీలో ఇమిడలేక బయటకు వచ్చి, కాంగ్రెస్‌లో చేరారు. 2004 ఎన్నికల్లో పుత్తూరు నుంచే కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి తెలుగుదేశం అభ్యర్థి కె.శంకర రెడ్డిని ఓడించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలుపొందినా, అక్కడి వాతావరణాన్ని జీర్ణించుకోలేక బయటకు వచ్చి తెలుగుదేశంలో చేరారు. 2009 నాటికి పుత్తూరు నియోజక వర్గం రద్దయింది. దానిలో చాలా భాగం నగరి నియోజకవర్గంలో కలిసింది. 2009లో నగరి నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి మాజీమంత్రి రెడ్డివారి చెంగారెడ్డిని 2009లో 1,633 ఓట్ల తేడాతో ఓడించారు.

2014లో కూడా నగరి నుంచే టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి వైసీపీ అభ్యర్థి ఆర్‌కె రోజా చేతుల్లో 858 స్వల్ప తేడాతో పరాజయం చవిచూశారు. ప్రారంభం నుంచి పార్టీ ఆశయాలకు కట్టుబడి ప్రత్యర్థులను తన వాదనా పటిమతో మట్టికరిపించే ముద్దు కృష్ణమ నాయుడుకి పదవి లేకుండా కొనసాగటం తెలుగు దేశం పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడికి రుచించలేదు. శాసనమండలి సభ్యునిగా ఆయన్ని ఎంపికచేసి ముద్దు కృష్ణమ నాయుడుకు ఎంఎల్‌సిగా అవకాశం కల్పించారు. రాజకీయాలే 1983 నుంచి ఊపిరిగా కొనసాగిన ముద్దుకృష్ణమ నాయుడు మంగళవారం అర్ధరాత్రి మరణించారు.

దాసరి ఆళ్వార స్వామి

మనం
కుటుంబం
గురువారం, 8 ఫిబ్రవరి 2018
www.manamnews.com



# నవ్వుల నిధి




ఆమె నోరు తెరిస్తే పడి పడి నవ్వాలి.. పొట్టచెక్కలయ్యేలా నవ్వించే ఈమె పేరు నిధి గోయల్. స్టాండప్ కమెడియన్‌గా దూసుకుపోతున్న నిధి ఇప్పుడు స్టార్‌గా ఎదిగారు. కానీ ఆమెకు కళ్లు కనిపించవంటే ఎవ్వరూ నమ్మరు. ఎప్పుడూ హాయిగా నవ్వుతూ, సరదాగా మాట్లాడుతూ అందరినీ నవ్వించే నిధి ఎక్కడుంటే అక్కడ సందడే సందడి చేస్తుంది. ఓవైపు జెండర్ జస్టిస్, ఇంకో వైపు రైట్స్ ఫర్ డిజేబుల్ కోసం పోరాడుతూనే 'లాఫ్టర్ సెలబ్రిటీ'గా అందరినీ ఆకట్టుకుంటోంది. మనదేశంలో ఇప్పుడిప్పుడే స్టాండప్ కమెడియన్లకు మంచి ఆదరణ లభిస్తుండగా, ఎంతో మంది అమ్మాయిలు ఇప్పుడు ఈ రంగంలో తమ సత్తా చాటుతున్నారు. రెండేళ్ల క్రితం ప్రొఫెషనల్ స్టాండప్ కమెడియన్‌గా కెరీర్‌ను స్వీకరించిన నిధి ' ఫస్ట్ బ్లైండ్ కమెడియన్' గా తన ముద్రను వేసి తన సెటైర్లతో కడుపుబ్బ నవ్విస్తోంది. 'నేను చేసే షోలన్నీ నా స్వానుభవాలే, నేను విన్నది, తెలుసుకున్నది తమాషాగా చెబుతూ ఓవైపు నవ్విస్తూనే మరోవైపు ఆలోచింపచేసేలా చేయడమే నా ప్రయత్నం వెనుకున్న ప్రధాన లక్ష్యం' అని చెప్పే నిధి, ఎంతో మంది దివ్యాంగులను నిత్యం కలుస్తూ, వారిలో ఉన్న ఆత్మన్యూనతను పోగొట్టి, వారిలో ఆత్మవిశ్వాసం నింపే ప్రయత్నాన్ని మనస్ఫూర్తిగా చేస్తోంది. లాఫ్టర్ ఛాలెంజ్‌ను, లైఫ్ ఛాలెంజ్‌ను రెంటినీ తీసుకోగల సత్తా తనకుందని, చూపులేకపోతే జీవితం లేదా? అని ప్రశ్నించే నిధి అభినవ భారత యువత ఆత్మ విశ్వాసానికి ప్రతీకగా ఎదుగుతూ, అభిమానులను సంపాదించుకుంటోంది.

నిరుపమ రావు, పరిచయం అక్కర్లేని ఈమె రిటైర్‌మెంట్ తర్వాత ఏం చేస్తున్నారని చాలా మంది ఆసక్తిగా ఎదురు చూస్తున్న సమయంలో, తనలోని సరికొత్త నిరుపమను ప్రపంచానికి పరిచయం చేసిన ఇండియన్ ఫారిన్ సర్వీస్ అధికారిణి నిరుపమా రావ్. కఠినమైన నిర్ణయాలు తీసుకునే, మృదుస్వభావిగా పేరుగాంచిన నిరుపమ ఇండో-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపై తనదైన ముద్ర వేశారు.



# నిరుపమ రాగాలు




అమెరికాలో భారత రాయబారిగా సేవలందించిన ఈమె, వివాదాలకు అతీతంగా తన రాయబార వృత్తిని విజయవంతంగా నిర్వహించారు. గిటార్ వాయించడం, పాటలు పాడటమంటే చిన్నప్పటినుంచీ ఈమెకు అత్యంత ఇష్టమైన వ్యాపకంగా ఉండేది. ఐఎఫ్ఎస్ ఆఫీసర్‌గా రిటైర్ అయ్యాక ఇక తన టైం అంతా మ్యూజిక్ కోసం కేటాయించి, తనలోని సంగీత తృష్ణను తీర్చుకుంటున్నారు.

**ఆల్బం కూడా**

తానే సొంతంగా పాటలు రాసి, స్వరపరచి పాడిన పాటలను ఏకంగా ఓ మ్యూజిక్ ఆల్బంగా కూడా రిలీజ్ చేసిన మొట్టమొదటి రాయబారిగా నిరుపమ చరిత్ర సృష్టించారు. బెంగళూరు, చెన్నై, లక్నో, ఢిల్లీలలో సంగీత కచేరీలను కూడా ఇచ్చిన ఈమె, ప్రముఖ శ్రీలంక పియానో ప్లేయర్ సౌందరితో కలసి కచేరీలు చేయడం హైలైట్. నిరుపమ కచేరీలకు పలువురు మంత్రులు, బ్యూరోక్రాట్లు ప్రత్యేకంగా వచ్చి, ఆమెను అభినందిస్తుంటారు. ముస్సోరీలో ఐఎఫ్ఎస్ ఆఫీసర్స్ ట్రైనింగ్‌కు కూడా తన గిటార్‌ను తీసుకెళ్లినట్టు ఈమె వివరించారు. చిన్నప్పటినుంచీ సంగీతంపై ఉన్న మక్కువతో వాటిని నేర్చుకోవడంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచినట్టు నిరుపమ వెల్లడించారు.



తాను రాత్రికి రాత్రి సింగర్ కాలేదనే నిరుపమ తన బిజీ షెడ్యూల్‌లో విరామం దొరికినప్పుడల్లా మ్యూజిక్‌తోనే రీచార్జ్ అయ్యేదాన్నంటారు. దేశాలను అనుసంధానం చేసేది సంస్కృతి, సంప్రదాయాలు, కళలేనని గట్టిగా విశ్వసించే నిరుపమ, సంగీతాన్ని ఎంతగానే ఆరాధించే శ్రీలంక వాసులను చూసి చాలా స్ఫూర్తి పొందినట్టు, దేశాలమధ్య సంగీతం మంచి వారధిగా నిలుస్తుందని చెబుతారు.

## బ్యూరోక్రాట్ల మ్యూజిక్ బ్యాండ్

మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎస్‌వై ఖురేషీ కీబోర్డు, గిటార్ వాయిస్తే, జాతీయ భద్రతా సలహాదారు శివ శంకర్ మీనన్ గిటార్ వాయించడం, పాటలు పాడటం, మాజీ హోం శాఖ కార్యదర్శి మధుకర్ గుప్తా వంటివారు ఈ బ్యాండ్‌ను సమన్వయం చేస్తూంటే వీరిలో నిరుపమా రావ్ కూడా సభ్యురాలిగా ఉంటూ బ్యూరోక్రాట్ల మ్యూజిక్ బ్యాండ్ చెలరేగిపోయేదని వీరంతా తరచూ గుర్తు చేసుకుంటారు.

# సూపర్ మోడల్ కెన్స్

ఈశాన్య ప్రాంతం వారంటే ఎన్నో అవమానాలకు గురయ్యే పరిస్థితుల్లో ఈ అమ్మాయి సూపర్ మోడల్‌గా ఎదిగింది. పైపెచ్చు కెమెరా అంటే చచ్చేంత సిగ్గున్న ఈమె కెమెరాతోనే తన కెరీర్‌ను ముడివేసుకునే స్థితికి ఎదగడం వెనుక చాలా ఆసక్తికరమైన విషయాలు దాగున్నాయి.



కెథోలెనో కెన్స్ అంటే మనదేశానికే బ్రాండ్ అంబాసిడర్ అనే స్టేటస్ సంపాదించిన ఈమె నాగాల్యాండ్‌కు చెందిన అమ్మాయి. ప్రస్తుతం ఇండియన్ ఫ్యాషన్ ఇండస్ట్రీని శాసిస్తూ, ప్రతిష్ఠాత్మకమైన ఇంటర్నేషనల్ బ్రాండ్లుగా పేరుగాంచిన కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారారు. 2014లో అనుకోకుండా కింగ్ ఫిషర్ సూపర్ మోడల్ హంట్ కంటపడటంతో ఫ్యాషన్ ఇండస్ట్రీలో కాలుమోపారు కెన్స్. 'యంగ్ అచీవర్స్ అవార్డ్ 2017 'ను సొంతం చేసుకుని నార్త్ ఈస్ట్ యువతకు రోల్ మోడల్‌గా నిలిచారు. తాను ఓ సింపుల్ నాగా గర్ల్ అని చెప్పుకునే కెన్స్, కేవలం హాబీగా ఫ్యాషన్ ఇండస్ట్రీలోకి వచ్చినట్టు, కానీ అవకాశాలను సరైన సమయంలో అందిపుచ్చుకోవడంతోనే సూపర్ మోడల్‌గా ఎదిగే అరుదైన అవకాశం లభించిందని వివరిస్తారు. ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్ అయిన తన భర్త రోకోవర్ విహిన్యూ సహకారంతో తాను కెరీర్‌లో వచ్చిన ప్రతి అవకాశాన్ని ఆసక్తిగా స్వీకరించినట్టు సంతోషంగా చెబుతారు.



ఫిన్‌ల్యాండ్ సమీపంలో సుందరమైన బుల్లి ద్వీపం ఒకటుంది. ఇంత చిన్న ద్వీపం గురించి ప్రత్యేకంగా ఎందుకు ప్రస్తావించడం అనుకుంటున్నారా? ఇక్కడికి పురుషులను రానివ్వరు, కేవలం మహిళలకు మాత్రమే ఈ ద్వీపంలోకి ప్రవేశముంటుంది. అందుకే దీన్ని 'సూపర్ షి ఐల్యాండ్' అంటారు. వుమెన్ ఓన్లీ ఐల్యాండ్ అయినప్పటికీ ఇక్కడ భద్రతకు వచ్చిన ఢోకా ఏమీ ఉండదు. మహిళా పర్యాటకులు హాయిగా ఇక్కడ వెకేషన్‌ను ఎంజాయ్ చేసి, బోలెడన్ని మధురానుభూతులను మూటగట్టుకుని హ్యాపీగా తిరిగి వెళ్లవచ్చు.



# పురుషులకు నో ఎంట్రీ



క్రిస్టినా రత్‌కు వచ్చిన ఐడియాతో దీన్ని స్పెషల్ టూరిస్ట్ డెస్టినేషన్‌గా మార్చి, మహిళలను ఆకట్టుకునేందుకు ఈ దీవులను మరింత సుందరంగా మార్చారు. 'మీపై మీరు ఫోకస్ పెట్టండి, ఈ లోకంపై కాదు' అన్న ఉద్దేశమే దీన్ని ఎక్స్‌క్లూజివ్ ఐల్యాండ్ ఫర్ వుమెన్‌గా మలచడం వెనకున్న కారణమని క్రిస్టినా వివరిస్తారు. ఎప్పుడూ బరువు, బాధ్యత, కట్టుబాట్లు, రూల్స్, రెగ్యులేషన్స్, కల్చర్, ట్రెడిషన్ వగైరా వగైరా మహిళా స్వేచ్ఛకు కళ్లాలు వేస్తాయని, అందుకే ఇలాంటి వింత ప్రపంచం గురించిన ఆలోచన తనకు వచ్చిందని ఆమె చెబుతారు. ఇక అన్ని వయసుల అమ్మాయిలు, మహిళలు ఇక్కడికి గ్రూపులుగా వచ్చి కొన్ని రోజుల పాటు తమను తాము మరచిపోయి, ప్రకృతిలో మమేకమవుతుంటారు. ఒంటరిగా వచ్చే మహిళా ప్రయాణికులకు తక్కువేం లేదు. ఇక్కడ ఉన్న లగ్జరీ హోటెల్‌లోని సౌకర్యాలు హైలైట్‌గా ఉంటాయి. కావాలంటే సొంతంగా వంట చేసుకోవచ్చు, లేదంటే షెఫల హోస్టింగ్‌తో బోలెడు రుచులు ఎంజాయ్ చేయవచ్చు. బోటింగ్, గేమ్స్, బీచ్‌తోపాటు అన్ని సదుపాయాలున్న సూపర్ షి ఐల్యాండ్‌లో మరో ప్రపంచాన్ని చూడవచ్చు. ప్రశాంతంగా ఉండే ఇక్కడి వాతావరణం మనసుకు స్వాంతన ఇస్తుంది. ఈ ఐల్యాండ్ స్పెషాలిటీని మరింత వెలుగులోకి తెచ్చేందుకు ఇప్పుడు పలు ట్రావెల్ బ్రాండ్లు క్రిస్టినాతో చర్చలు జరుపుతున్నారు. ఏదేమైనా ఇలాంటి ఓ వింత ద్వీపం ఉందనే విషయం ఇప్పుడిప్పుడే లోకానికి వెల్లడవుతోంది.

# మే 23,24న ఐసెట్

(మొదటిపేజీ తరువాయి)

విద్యామండలి చైర్మన్ టి.పాపిరెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే ఏడుసార్లు ఐసెట్ పరీక్షను సమర్థంగా నిర్వహించిన కాకతీయ విశ్వవిద్యాలయమే ఈసారి కూడా పరీక్షను నిర్వహించనుంది. కాకతీయ విశ్వవిద్యాలయం ఐసెట్ సెమినార్ హాల్‌లో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆర్.సాయన్న అధ్యక్షతన బుధవారం విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పాపిరెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఐసెట్ పరీక్ష ఆఫ్‌లైన్‌లో నిర్వహించేవారమని, ఈ ఏడాది ఐసెట్ పరీక్షను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించనున్నామని తెలిపారు. ఈ నెల 22వ తేదీన ఐసెట్ నోటిఫికేషన్ జారీ అవుతుందని, జూన్ 6వ తేదీన ఫలితాలు ప్రకటిస్తామని చెప్పారు. తెలుగు రాష్ట్రాలలో మొత్తం 16 రీజనల్ సెంటర్లను కేటాయించినట్లు ఆయన వెల్లడించారు. వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆర్.సాయన్న మాట్లాడుతూ.. కాకతీయ యూనివర్సిటీ ఐసెట్ పరీక్షను ఇప్పటికే ఏడుసార్లు పకడ్బందీగా నిర్వహించిందని, ఈసారి కూడా అంతే సమర్థవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఐసెట్-2018 కన్వీనర్ ప్రొఫెసర్ సుబ్రమణ్యశర్మ మాట్లాడుతూ.. రెండున్నర గంటలపాటు నిర్వహించే ఐసెట్ పరీక్ష మూడు సెషన్లలో ఉంటుందని చెప్పారు. మే 23వ తేదీన ఉదయం 10గంటల నుంచి 12.30గంటలకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30నుంచి 5గంటల వరకు రెండవ సెషన్‌లో పరీక్ష జరుగుతుందని అన్నారు. మే 24వ తేదీన ఉదయం 10నుంచి 12.30గంటల వరకు మూడవ సెషన్ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఐసెట్ పరీక్ష ఫీజును జనరల్ అభ్యర్థులకు రూ.650గా, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.450గా నిర్ణయించినట్లు తెలిపారు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్, ప్రొఫెసర్ వెంకటరమణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఐసెట్ పరీక్షను ఈసారి ఉర్దూ మీడియంలో నిర్వహించడానికి కూడా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు.



# కాంగ్రెస్.. ఓ లోఫర్ పార్టీ

(మొదటిపేజీ తరువాయి)

చేస్తామని సవాల్ విసిరితే, నాడు ఎవరు ముందుకు రాలేదని కేటీఆర్ గుర్తుచేశారు. పాలేరు ఉప ఎన్నికలో కూడా తన సవాల్‌ను ఎవరూ స్వీకరించలేదని చెప్పారు. బుధవారం ప్రగతి భవన్‌లో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై మంత్రి తీవ్రంగా స్పందించారు.

**రాహుల్.. ఓ పెద్ద పప్పు..**

''సొంత నియోజకవర్గంలో మున్సిపాల్టీని గెలిపించుకోలేని అసమర్థుడు రాహుల్‌గాంధీ. మీ నాయకుడు పెద్ద పప్పు అని దేశమంతా తెలుసు. గూగుల్‌లో వెతికినా అదే వస్తుంది. రాహుల్ బచ్చా. నాకు పెళ్లయి 15 ఏళ్లయింది. రాహుల్‌కు ఇంకా పెళ్లే కాలేదు'' అని ఎద్దేవా చేశారు.

సీఎం పీఠం సొంత మనుషులను చంపుకున్నారు..

''పదవుల కోసం నరహంతకులుగా మారిన వాళ్లు కాంగ్రెస్ నాయకులు. సీఎం పదవి కోసం సొంత మనుషులను చంపిన వ్యక్తులు వారు. 1991లో చేసిన నరమేధాన్ని మర్చిపోయి నల్లగొండ హత్య గురించి మాట్లాడుతున్నారు. లోకల్‌లో జరిగిన హత్యను అదేదో రాష్ట్ర సమస్యగా మాట్లాడుతున్నారు. కోమటిరెడ్డి తమ తలపు తట్టి వెళ్లిపోయాడు. తెలంగాణలో ఇంత మంది యువకులు చనిపోయింది ఎవరివల్లనో తెలియదా? కాంగ్రెస్ పార్టీ పెద్ద లోఫర్ పార్టీ. ఆ పార్టీతో దేశానికి పెద్దగా ఒరిగిందేమీ లేదు. పనిపాట లేకనే హరీశ్‌రావ్‌కు, తనకు మధ్య సఖ్యత లేదని పనికి మాలిన మాటలు మాట్లాడుతున్నారు. వీళ్ళు వాళ్ళు టచ్ లో ఉన్నారు అని చెప్పడానికి నేనేం ఉత్తమ్‌ని కాదు కేసీఆర్ తో పోల్చుకునే సినిమా ఉత్తమ్‌కు లేదు.'' అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక జరిగిన ఎన్నికల్లో ప్రజలకు కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బ కొట్టారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దుష్పరిపాలన ఫలితం నల్లగొండకు ఫ్లోరోసిస్ సమస్య అని అన్నారు. రైతుకు పెట్టుబడి ఇవ్వడం మొదలు పెట్టకా మా బలం ఇంకా పెరుగుతుందన్నారు. దాని దెబ్బ ఎలా ఉంటుందో ఉత్తమ్‌కు అప్పుడు తెలిసొస్తుందని అన్నారు.

**బీజేపీ మిత్రపక్షాలనూ మెప్పించట్లేదు..**

''బీజేపీ కనీసం మిత్ర పక్షాలను కూడా మెప్పించలేకపోయింది. ఇక ప్రజలనేం మెప్పిస్తుంది. కేంద్ర బడ్జెట్ ఎవరినీ మెప్పించలేకపోయింది. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు బాహుబలి చిత్రానికి వచ్చిన కలెక్షన్ మొత్తాన్ని కూడా కేటాయించలేదు. కేంద్రం నుండి మంత్రులు, అధికారులు రాష్ట్రానికి వస్తున్నారు. పొగుడుతున్నారు. కానీ ఏమీ ఇవ్వడం లేదు. హక్కుగా రావాల్సిన దానికంటే ఒక్క పైసా కూడా ఎక్కువ ఇవ్వడం లేదు. ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వలేదు. ప్రభుత్వంలో ఉన్నవాళ్లు(టీడీపీ) కొట్లాడితేనే ఇవ్వడం లేదు. ఇక మాకేం ఇస్తారు. కేటీఆర్ హితవు పలికారు. అన్ని ప్రజలకే వివరిస్తామన్నారు. ఇష్టం ఉన్నా లేకున్నా మోదీనే 2019 వరకు ప్రధాని కదా అని గుర్తుచేశారు. తెలంగాణ నుండి ఉన్న ఒకే ఒక్క మంత్రి దత్తాత్రేయను కూడా తీసేసారు. కిషన్ రెడ్డి.. అంబర్‌పేట, లక్ష్మణ్.. ముషీరాబాద్ దాటి బయటకు రారు. అమిత్ షా రాష్ట్రానికి వచ్చి ఏం చేస్తాడో వారే తెలపాలి. ఈ దేశంలో జాతీయ పార్టీలు అనేవే లేవు. దక్షిణాదిలో ఉనికిలేని బీజేపీ పార్టీ జాతీయ పార్టీ ఎలా అవుతుంది'' అని కేటీఆర్ ప్రశ్నించారు.

**జీహెచ్‌ఎంసీ అభివృద్ధి ఒక్క రాత్రిలో జరిగేది కాదు..**

జీహెచ్‌ఎంసీ అభివృద్ధి ఒక్క రాత్రిలో జరిగేది కాదని కేటీఆర్ పేర్కొన్నారు. అది నిత్య ప్రక్రియ అని, నగరం చాలా గొప్పగా అభివృద్ధి జరగబోతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, సిట్టింగ్‌ల మీద ఆరోపణలు రావడం సాధారమని పేర్కొన్నారు. చంద్రబాబు 14 సార్లు దావోస్ సదస్సులో పాల్గొన్నారన్నారు. తాను మాత్రం తొలిసారి పాల్గొన్నానని చెప్పారు.

# సీపీ(ఐ)ఎం కార్యదర్శిగా తమ్మినేని

(మొదటిపేజీ తరువాయి)

రోజు కొత్త కార్యవర్గం ఎన్నికైంది. మహాసభలో పలు అంశాలపై తీర్మానాలను ఆమోదించారు. బహుజన సామాజిక తెలంగాణ సాధనే లక్ష్యంగా ఉద్యమ కార్యచరణకు ఈ మహాసభ పిలుపునిచ్చింది. అవినీతికి పాల్పడితే సహించే ప్రసక్తే లేదని సీఎం కేసీఆర్ బీరాలు పలికారని.. నేడు రాష్ట్రంలో అవినీతి జరగని రోజే లేదని జూలకంటి రంగారెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో జరిగిన అనేక కుంభకోణాల్లో పాలక పార్టీ నాయకుల పాత్ర ఉందని ఆయన ఆరోపించారు. బుధవారం మహాసభల ముగింపు సందర్భంగా ఆయన ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్ రావు ఎలుపునిచ్చారు. దోషులను తప్పించడానికే భూచట్టానికి సవరణ చేస్తూ శాసన సభలో బిల్లు ఆమోదించారన్నారు. ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలనుకుంటే రాష్ట్రంలో జరిగిన భూకుంభకోణాలన్నింటిపై సీబీఐతో విచారణ జరిపించి భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మహాసభ తరపున జూలకంటి, పోతినేని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిరంకుశ చర్యలను నిరసించండి నిర్బంధాలతో ప్రజాతంత్ర హక్కులను అణిచివేయాలని చూస్తే ప్రజాస్వామ్యవాదులతో కలిసి సీపీ(ఐ)ఎం పోరాటం చేస్తుందని మహాసభ స్పష్టం చేసిందన్నారు.

# మౌనంలో మర్మం..

(మొదటిపేజీ తరువాయి)

సమాధానానికే 99 శాతం మార్కులు పడేలా ఉన్నాయి.

**అక్కడెందుకలా... ఇక్కడెందుకిలా!**

లోక్‌సభతోపాటు అసెంబ్లీలకూ వచ్చే ఏడాది ఎన్నికలు తథ్యం... అయితే, ఈ ఏడాది డిసెంబర్‌లోనే ముహూర్తం ముంచుకొచ్చే సూచనలు కనిపిస్తున్న నేపథ్యంలో బీజేపీకి ఇదే చివరి పూర్తిస్థాయి బడ్జెట్. నాలుగేళ్లుగా రాష్ట్ర విభజన చట్టంలోని హామీల అమలు అంతంతమాత్రంగా ఉన్నందున మిగిలిన ఏడాదిలో అమలయ్యే అవకాశాలు మృగ్యం. అయినప్పటికీ హామీల అమలుకు ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ మిత్రపక్షమైన టీడీపీ గట్టిగా పట్టుబడుతోంది. ఆ మేరకు పార్లమెంట్ ఉభయసభల్లోనూ ఆ పార్టీ ఎంపీలు గట్టిగా గళమెత్తారు. అయితే, ఏపీకి జరిగిన స్థాయిలోనే తెలంగాణకూ అన్యాయం జరిగినా ఇక్కడి పాలకపక్షం స్పందనలో తేడా స్పష్టంగా కనిపిస్తోంది. లోక్‌సభలో ఆ పార్టీ ఎంపీలు కేంద్రానికి నొప్పి తగలకుండా సలహాలిస్తున్న రీతిలో మాట్లాడారు తప్ప గట్టిగా నిలదీయలేదు. చివరకు కేంద్రం విస్మరించిన వాటిని కూడా ప్రస్తావించలేదు... కనీస స్థాయి నిరసన కూడా లేదు.. పైగా కాంగ్రెస్‌పై విమర్శ... ఏకంగా ఆ పార్టీ అధ్యక్షుడిని 'అసమర్థుడు'గా ముద్రవేసే స్థాయికి వెళ్లింది. ఎందుకిలా? అన్న ప్రశ్న ప్రజల మనసుల్లోనేగాక అన్ని రాజకీయ పార్టీల్లోనూ మెదలుతోంది.

**డిమాండ్లేవీ వినిపించలేదు**

కాళేశ్వరంను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని టీఆర్ఎస్ కోరడం లేదు... నిధులివ్వాలని మాత్రమే అడుగుతోంది. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయకూ సొమ్ములు కోరింది. బడ్జెట్‌లో వీటి ప్రస్తావనే లేదు. విభజన చట్టం హామీల సంగతి సరేసరి. అటు ఏపీలోనూ, ఇటు తెలంగాణలోనూ ఎయిమ్స్ ప్రస్తావనేలేదు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కోచ్ ఫ్యాక్టరీ ఊసే లేదు. అయినా టీఆర్ఎస్ ఎందుకు స్పందించడంలేదో ప్రజానీకానికి అర్థం కావడంలేదు. అయితే, బలమైన రాజకీయ ప్రయోజనాలే ఈ మౌనముద్రకు కారణమని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. టీఆర్ఎస్ కేంద్రంలో భాగస్వామి కాగలదన్న అంచనాలు రెండేళ్లుగా వినిపిస్తున్నాయి. కానీ, ఏపీలో టీడీపీ మిత్రపక్షంగా ఉండటంతోపాటు ఇతర రాజకీయ కారణాలవల్ల అది సాధ్యం కాలేదు. అయితే, రాజకీయంగా వ్యతిరేకత ఉన్నట్లు కనిపించడం కోసం అడపాదడపా పరస్పర విమర్శలు చేసుకుంటున్నాయి. మరోవైపు హైదరాబాద్ వచ్చే కేంద్రమంత్రి ప్రతి ఒక్కరూ టీఆర్ఎస్ సర్కారును పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. ఈ రెండు పార్టీల రాజకీయ సాన్నిహిత్యానికి ఇవే నిదర్శనాలని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆ మేరకు వచ్చే ఎన్నికల తర్వాత మోదీ మంత్రి వర్గంలో చేరి, అధిక ప్రయోజనాలు పొందవచ్చని టీఆర్ఎస్ భావిస్తోంది. ఇటీవల ఎంపీ కవిత కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. కేంద్రంలో టీడీపీ మంత్రులు ఉన్నందునే ఏపీకి ఎక్కువ నిధులు, సంస్థలను తీసుకువెళ్లగలిగారని అభిప్రాయపడ్డారు.

**ఒక్క సీటైనా గిట్టని.. ఒంటరి పోటీ ఒట్టిదే**

తెలంగాణలో ఒంటరిగానే పోటీ చేస్తామని బీజేపీ ప్రకటించినా, ఒక్క ఎంపీ స్థానమైనా దక్కుతుందన్న నమ్మకం వారిలోనే పెద్దగా లేదు. దక్షిణాదిలో కేరళ, తమిళనాడు, కర్ణాటకలపై బీజేపీకి భ్రమలేవీ లేవు. అందుకే ఎలాగైనా తెలంగాణ, ఏపీలలో సాధ్యమైనన్ని సీట్లు పొందాలని అమిత్ షా లక్ష్యం నిర్దేశించుకున్నారు. టీఆర్ఎస్‌తో పొత్తుతో అసెంబ్లీలో కేసీఆర్‌కు, లోక్‌సభలో తమకు మేలు కలుగుతుందని అంచనా వేస్తున్నారు. లోక్‌సభలో కనీసం 8 సీట్లవరకు కోరాలని బీజేపీ అగ్రనాయకత్వం భావిస్తోంది. అసెంబ్లీలో కేసీఆర్ ఎన్ని సీట్లిచ్చినా అంగీకరించే యోచనలో ఉందని సమాచారం. ఇతర ప్రాంతాల్లో తగ్గే సీట్లను ఈ విధంగా భర్తీ చేసుకోవచ్చన్నది ప్రణాళిక. మళ్లీ కేంద్రంలో బీజేపీనే అధికారంలోకి వస్తుందన్న అంచనాతోనే టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ పొత్తువైపు మొగ్గుతున్నారని భావిస్తున్నారు.

**అందుకే వెంకయ్యను పక్కకు పంపారా?**

వెంకయ్య నాయుడు కేంద్రంలో ఉంటే ఏపీలో టీడీపీతో పొత్తు తప్పదన్న భావనతోనే ఆయనను ఉప రాష్ట్రపతిని చేసి, తెలివిగా పక్కకు తప్పించారని భావిస్తున్నారు. కానీ, టీడీపీతో పొత్తువల్ల లోక్‌సభలో తమకు పెద్దగా ఫలితం దక్కదన్నది బీజేపీ భావన. అలాగే చంద్రబాబు నాయుడు ఎక్కువ సీట్లు ఇచ్చే అవకాశంలేదని అమిత్ షాకు బాగా తెలుసు. కాబట్టే పొమ్మనకుండా పొగపెడుతున్నట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. లేకపోతే ఎన్నికలు సమీపిస్తున్న వేళ బడ్జెట్‌లో మిత్రపక్షానికి ఇంత అన్యాయం ఎందుకు చేస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. ఇదంతా స్పష్టమైపోవడం వల్లనే లోక్‌సభలో బుధవారం ఆ పార్టీ ఎంపీలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గల్లా జయదేవ్ ఓ అడుగు ముందుకేసి ''మీరు మమ్మల్ని కాదని వైసీపీతో వెళ్లాలని భావిస్తున్నారేమో! అంతకంటే తెలివితక్కువ ఎత్తుగడ మరొకటి లేద''ని కుండబద్దలు కొట్టారు. ఇక బీజేపీతో పొత్తు వైసీపీ అధినేత జగన్‌కు జగన్‌కు అత్యంత కీలకం. కేసుల నుంచి ఎలాగైనా బయటపడడంతో పాటు ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోవాలన్నది ఆయన కల. దాన్ని నెరవేరుస్తామన్న హామీతో 50 శాతానికి పైగా పార్లమెంట్ సీట్లు తీసుకోవచ్చని బీజేపీ భావిస్తోంది. ఆ మేరకు రెండు రాష్ట్రాలలో ఇదే ఫార్ములాతో వెళ్లాలని బీజేపీ దాదాపు నిర్ణయానికి వచ్చిందని చెబుతున్నారు. ఈ రాజకీయ ఎత్తుగడలు, పొత్తులు ఎలాంటి మలుపులు తిరుగుతాయో వేచి చూడాల్సిందే!



# ముద్దుకృష్ణమ కన్నుమూత

**నేడు చిత్తూరు జిల్లాలో అంత్యక్రియలు**

**చంద్రబాబు, ప్రముఖుల సంతాపం**



అమరావతి, ఫిబ్రవరి 7 (మనం ప్రతి నిధి): టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు (71) కన్నుమూశారు. డెంగ్యూ జ్వరంతో హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందారు. ముద్దుకృష్ణమ భౌతికకాయాన్ని ఆయన స్వగ్రామం చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం వెంకట్రామపురానికి తరలించారు. గురువారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరగనున్నాయి. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. లెక్చరర్‌గా కెరీర్ ప్రారంభించిన ముద్దుకృష్ణమ నాయుడు ఎన్టీఆర్ పిలుపుతో 1983లో రాజకీయాల్లోకి వచ్చారు. చిత్తూరు జిల్లా పుత్తూరు నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో కీలక శాఖలు నిర్వహించారు. 2009లో నగరి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన.. 2014 ఎన్నికల్లో ఓడిపోయారు. ఆ తర్వాత ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ముద్దుకృష్ణమ మృతిపట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతికి సంతాపం ప్రకటించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

టీడీపీ ప్రస్థానంలో ముద్దుకృష్ణమది ముఖ్య భూమిక అని చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. టీడీపీ క్రియాశీల రాజకీయాల్లో ఎంతో చురుగ్గా ఉంటూ పార్టీకి, ప్రజలకు ఆయన అందించిన సేవలు మరచిపోలేనివని కొనియాడారు.

# అవునా... కాదా!

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అయితే, పవన్ మాటల్లో ఆద్యంతం గందరగోళం ప్రస్ఫుటమైంది. ప్రత్యేక హోదా సాధించేందుకు అన్ని పక్షాలు, మేధావులతో జేఏసీ ఏర్పాటు చేయడమే తమ ప్రాధాన్యమని తొలుత ప్రకటించారు. ఈ విషయం ప్రకటించడానికే విలేకరులతో భేటీ అయినట్లు చెప్పారు. కానీ, కొంతసేపు మాట్లాడిన తర్వాత విలేకరుల ప్రశ్నలకు జవాబిస్తూ పరస్పర విరుద్ధ సమాధానాలిచ్చారు. హోదా సాధనకు జనసేన గొంతు సరిపోవడం లేదని, తమది ఇంకా చిన్న పార్టీయేనని చెప్పారు. కానీ, ఈ సందర్భంగా ఎదురైన మరో ప్రశ్నకు- ''సమస్యలపై పోరాటానికి ప్రజల మద్దతుంటే చాలు'' అన్నారు. సమస్యలపై నిలదీయడమే తప్ప పోరాడటం లేదేమని ప్రశ్నిస్తే- తమ ఇబ్బందులు తమకున్నాయని, సమస్యలు లేవనెత్తగలగడమే సంతోషించాల్సిన విషయంగా భావిస్తున్నామని బదులిచ్చారు. జేఏసీలోకి చిరంజీవిని ఆహ్వానిస్తారా? అన్న ప్రశ్నకు- అసలు తాము జేఏసీ ఏర్పాటు చేయడం లేదని, తన అన్న చిరంజీవికి దీంతో సంబంధమే లేదని చెబుతూ ముక్తాయించారు. అంతకుముందు... ఏపీకి న్యాయం కోసం పోరాడటంపై మాట్లాడుతూ- ''మేము సభల్లో కూర్చుని చట్టాలు చేస్తాం.. మీరు పాటించండి'' అంటే జనాలు ఒప్పుకోరని స్పష్టం చేశారు. రోజులు మారాయని, న్యాయం జరగకపోతే యువకులు తిరగబడతారని, హింసాత్మక పరిస్థితులు తప్పవని హెచ్చరించారు.

**టీడీపీ-బీజేపీలపై నమ్మకం సడలుతోంది**

రాజకీయాలు, పరిపాలనలో అనుభవంగల నాయకులన్న కారణంతోనే గత ఎన్నికల్లో చంద్రబాబు, మోదీకి మద్దతిచ్చానని పవన్ అన్నారు. వారు ఏపీకి న్యాయం చేస్తారని ఇంతకాలం సహనంతో వేచి చూశానన్నారు. నాలుగేళ్లు గడిచినా వారిచ్చిన ఒక్క హామీ కూడా అమలు కాకపోవడంతో వారిపై నమ్మకం సడలుతోందని చెప్పారు. ముఖ్యంగా టీడీపీ ప్రభుత్వంపై విశ్వాసం సన్నగిల్లుతున్నదని పేర్కొన్నారు. కేంద్రం ప్యాకేజీ ప్రకటించినప్పుడు చంద్రబాబు కూడా అంగీకరించారని గుర్తుచేశారు. అటుపైన ప్యాకేజీ బాగుందని ఓసారి, బాగోలేదని మరోసారి ప్రకటిస్తూ జనాన్ని గందరగోళంలో పడేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అవినీతిపై నివేదికలు రావడం బాధ కలిగిస్తోందన్నారు. ఏపీకి సరిపోయేంత నిధులు మంజూరు చేశామని బీజేపీ, నిధులు రాలేదని టీడీపీ నేతలు ప్రకటిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. నిధుల ఖర్చు వివరాలను వెల్లడించాలని కోరితే ఏపీ ప్రభుత్వం సరిగా స్పందించడం లేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ అధికారులు కూడా ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు.



ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే 2014 ఎన్నికల్లో జనసేన పోటీ చేస్తే బాగుండేదన్న భావన కలుగుతోందన్నారు. తద్వారా కనీసం లోక్‌సభలో కేంద్రాన్ని ప్రశ్నించే అవకాశమైనా దక్కి ఉండేదని నిస్పృహ ప్రకటించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్లకార్డుల ప్రదర్శన, నినాదాలతో న్యాయం జరగదని, తెలంగాణ ఉద్యమ సందర్భంగా లోక్‌సభను స్తంభింపజేసిన రీతిలో ఉద్యమించాలని అభిప్రాయపడ్డారు. కాగా, బంద్ చేయడమంటే మనల్ని మనం బాధపెట్టుకోవడమేనన్న పవన్, వామపక్షాలు పిలుపునిచ్చిన గురువారం నాటి ఏపీ బంద్‌కు జనసేన మద్దతు తెలుపుతోందని ప్రకటించడం గమనార్హం.



# ప్రసంగ జ్వాల!

(మొదటిపేజీ తరువాయి)

ప్రజాస్వామ్య ప్రవక్తగా 12వ శతాబ్దంనాటి బసవణ్ణ పేరు ప్రస్తావన... తెలుగు ఆత్మగౌరవ పునరుద్ధరణోద్యమ నిర్మాతగా టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ నామస్మరణ... ఆంధ్రప్రదేశ్ దిగ్గజాలకు వెన్నుపోటు పేరిట నీలం సంజీవరెడ్డి ఉదంతం ఉటంకింపు... తదితరాలన్నీ చూస్తే ఇదేమీ యాదృచ్ఛిక ప్రసంగం కాదని, కచ్చితంగా తాజా పరిణామాల నేపథ్యంలో ప్రధాని ముఖతా



జాలువారినదేనని స్పష్టమవుతోంది. ఒక సందర్భంలో ప్రచార సభల అలవాటు మేరకు ''సోదరీ సోదరులారా!'' అన్న ప్రధాని రెప్పపాటులో సర్దుకుని 'అధ్యక్ష మహోదయా' అని మాట మార్చడం గమనార్హం. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు సమాధానంగా మోదీ చేసిన ఈ ప్రసంగంలోని ప్రధానాంశాలు...

**అడ్డగోలుగా ఆంధ్రప్రదేశ్ విభజన**

ఆంధ్రప్రదేశ్‌ను కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం పార్లమెంటు తలుపులు మూసి అడ్డగోలుగా విభజించిందని దుయ్యబట్టారు. వాజ్‌పేయి హయాంలో మూడు కొత్త రాష్ట్రాలు ఏర్పడినా ప్రభుత్వ దూరదృష్టివల్ల మాతృ రాష్ట్రాల్లో ఎలాంటి ఇబ్బందులూ రాలేదన్నారు. కాంగ్రెస్ చరిత్రలో దేశ విభజనతో విష బీజాలు నాటారని, 70 ఏళ్ల తర్వాత కూడా ఆ పాప ఫలాలను 125 కోట్ల మంది భారతీయులు అనుభవించాల్సి వస్తోందని విమర్శించారు. దేశాన్ని ముక్కలు చేసిన తీరులోనే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, పార్లమెంటు తలుపులు మూసేసి, సభలో ప్రశాంతత లేకుండానే ప్రజల మనోభావాలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్‌ను చీల్చేశారని దుయ్యబట్టారు. అందువల్లే ఆ దుష్పరిణామాలను నాలుగేళ్లుగా చక్కదిద్దలేని దుస్థితి ఏర్పడిందన్నారు.

**నాడు ఇందిర, రాజీవ్ అవమానించినందుకే...**




కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి హోదాలో ఆనాడు హైదరాబాద్ వెళ్లిన రాజీవ్ గాంధీ విమానాశ్రయంలోనే దళిత ముఖ్యమంత్రిని బహిరంగంగా అవమానించారని గుర్తుచేశారు. అంతకుముందు ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నపుడు రాష్ట్రపతి పదవికి సొంత పార్టీ అభ్యర్థి నీలం సంజీవరెడ్డికి వెన్నుపోటు పొడిచిన సంగతి గుర్తు తెచ్చుకోవాలన్నారు. ఇటువంటి అవమానాగ్ని నుంచే తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందని, ఆ పార్టీ వ్యవస్థాప కుడు ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవ పునరుద్ధరణకు నడుంబిగించారని పేర్కొన్నారు. దేశంలో 90 పర్యాయాలకన్నా ఎక్కువగా ఆర్టికల్ 356ను దుర్వినియోగం చేసింది కాంగ్రెస్ పార్టీయేనని ఎద్దేవా చేశారు. మన్మోహన్ సింగ్ ప్రధాని ఉన్నపుడు మీ ప్రభుత్వం ఉండగానే.. కేబినెట్ నిర్ణయాలను మీడియా సమక్షంలో రాహుల్ చించిపారేశారని, అటువంటి పార్టీ తమకు ప్రజాస్వామ్యంపై పాఠాలు చెప్పడమేమిటని నిలదీశారు. ఈ మేరకు లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ప్రసంగాన్ని ప్రస్తావిస్తూ పలు వ్యాఖ్యలు చేశారు.

**ఏడు దశాబ్దాలు దాటినా ఏడుపే మిగిలింది**

స్వాతంత్ర్యం సిద్ధించి 70 సంవత్సరాల తర్వాత కూడా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని ప్రధాని మోదీ అన్నారు. ఈ ఏడు దశాబ్దాల్లో దాదాపు 60 ఏళ్లు సాగిన కాంగ్రెస్ పాలన కాలం మొత్తం ఏకైక కుటుంబం పాట మాత్రమే పాడుతూ వచ్చిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు కాస్తంత బాధ్యతాయుతంగా పని చేసినా దేశ ప్రజల సమర్థత చేయూతతో దేశం ఎంతో ముందుకెళ్లేదని పేర్కొన్నారు. బ్యాంకులలో నిరర్థక ఆస్తులు పెంచిన పాపం కాంగ్రెస్‌దేనని ఆరోపించారు. భారతదేశం 1947 ఆగస్టు 15న మాత్రమే ఏర్పడిందని కాంగ్రెస్ నేతలు భావించడం దేశానికి దౌర్భాగ్యమని మండిపడ్డారు. బుద్ధుడి కాలంలో కూడా దేశంలో ప్రజాస్వామ్యం ఉండేదని, అది కాంగ్రెస్ తెచ్చిపెట్టింది కాదని వ్యాఖ్యానించారు. కర్ణాటకలో జగద్గురు బసవేశ్వరుడు 12వ శతాబ్దంలోనే 'అనుభవ మంటపం' పేరిట గ్రామంలో నిర్ణయాలన్నీ అక్కడే తీసుకునేవారని ఉటంకించారు. మహిళా సాధికారతకు ఆ సభలలో పెద్దపీట వేశారని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల తతంగం సందర్భంగా పార్టీ నాయకుడొకరు అసలు ఎన్నికలు ఎందుకని ప్రశ్నించినట్లు పేర్కొన్నారు. పైగా జహంగీర్ తర్వాత షాజహాన్, అతడి అనంతరం ఔరంగజేబు రాజ్యాధినేతలైనప్పుడు ఎన్నికలేమైనా జరిగాయా? అని మీడియా సమక్షంలోనే మాట్లాడారని గుర్తుచేశారు.

**పటేల్‌ను కాదని నెహ్రూను గద్దెనెక్కించారు**

దేశానికి తొలి ప్రధాని కాగల అన్ని అర్హతలూ ఉన్న సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ను కాదని నెహ్రూను గద్దెనెక్కించారని ప్రధాని మోదీ విమర్శించారు. ఆనాడు 12 కాంగ్రెస్ కమిటీలు పటేల్‌ను ఎన్నుకోగా మూడు కమిటీలు ఎవరికీ ఓటివ్వలేదని గుర్తుచేశారు. ఆ మేరకు ప్రజాదరణ పొందిన పటేల్‌ను పక్కకు నెట్టి, నెహ్రూను ముందుకు తేవడం ఎలాంటి ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. నాడు పటేల్ ప్రధాని అయి ఉంటే నేడు కశ్మీర్ వివాదం ఇంతలా రగులుకునేదే కాదని, పాక్ ఆక్రమిత కశ్మీర్ అన్న పేరే వినిపించేది కాదని స్పష్టం చేశారు. ఈ విమర్శలను విని తట్టుకోగల ధైర్యం కూడా ప్రతిపక్షానికి ఉండాలంటూ సవాలు విసిరారు.



**మాది పని సంస్కృతి.. సాధ్యమైతేనే చేపడతాం**

బీజేపీ అధికారంలోకి వచ్చాక పని సంస్కృతిని ప్రవేశపెట్టామని, పూర్తిచేయగల పనులను మాత్రమే తమ ప్రభుత్వం చేపడుతుందని చెప్పారు. దేశానికి నష్టం కలిగించేది ఎలాంటిదైనా, దానివల్ల పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నా దాన్ని వదిలేస్తామన్నారు. ప్రజాస్వామ్యంలో పార్టీలు వస్తాయి.. పోతాయిగానీ, దేశమే శాశ్వతమన్నదే తమ నినాదమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూపీఏ హయాంలో చేపట్టిన పనులు, వాటి ప్రగతి వేగంపై భారీ జాబితాను చదివి వినిపించారు.

**రాజ్యసభలో ఇతరత్రా అంశాల ప్రస్తావన**

ధన్యవాద తీర్మానంపై చర్చకు జవాబిస్తూ రాజ్యసభలోనూ ప్రధాని మోదీ దాదాపు ఇదే ప్రసంగం చేశారు. అయితే, ఎగువసభలో కొన్ని కొత్త అంశాలను ప్రస్తావించారు. 'కాంగ్రెస్ ముక్త భారతం' నినాదం ఇచ్చింది సాక్షాత్తూ మహాత్మాగాంధీయేనని, తాము కాదని చెప్పారు. ఇప్పుడిక దేశానికి గాంధీజీ కావాలి తప్ప కాంగ్రెస్ కాదని పేర్కొన్నారు. దావోస్‌కు ఇటీవలే తాను వెళ్లానని, అంతకుముందు కాంగ్రెస్ నేతలు కూడా వెళ్లారని, కాకపోతే- ''ఎవరినో రక్షించడానికి ఓ లేఖతో వెళ్లడమే ఇందులో తేడా'' అంటూ బోఫోర్స్ కుంభకోణాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. తాను నవ భారతం గురించి స్వప్నిస్తుంటే- కాంగ్రెస్ ఎమర్జన్సీనాటి భారతం కోసం పలవరిస్తున్నదని ఎద్దేవా చేశారు. ఇక 'పేర్ల మార్పిడి' ప్రభుత్వమని కాంగ్రెస్ అభివర్ణించడంపై స్పందిస్తూ- తమది 'లక్ష్య ఛేదన' సర్కారుగా నొక్కిచెప్పారు. దేశంలో ఏకకాల ఎన్నికల అవసరాన్ని కూడా ప్రధాని ప్రస్తావించారు. ఈ విషయంలో రాజకీయ విభేదాలకు అతీతంగా అన్ని పార్టీలూ ఏకాభిప్రాయానికి రావాలని పిలుపునిచ్చారు. ఇక 'ముమ్మారు తలాక్', ఓబీసీ బిల్లులకు ఆమోదంపై కలసిరావాలని విపక్షాలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సూచనలు, సలహాలను ప్రభుత్వం సదా ఆహ్వానిస్తుందని చెప్పారు. దేశం కోసం, ప్రజల బాగుకోసం ప్రభుత్వం పనిచేస్తుండటమే ఇందుకు కారణమని ప్రధాని పేర్కొన్నారు.

# భారతీయ ముస్లిములను 'పాకిస్థానీ' అంటే శిక్ష

## ఆ మేరకు కఠిన చట్టం తేవాలి: అసదుద్దీన్ ఒవైసీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: భారతీయ ముస్లిములను పాకిస్థానీలంటూ పిలిచిన వారికి మూడేళ్ల జైలుశిక్ష విధించేలా చట్టం తీసుకురావాలని మజ్లిస్ అధినేత, హైదరాబాద్ లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. బుధవారం లోకసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చ సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లో కాస్‌గంజ్‌లో జరిగిన అల్లర్లను ఒవైసీ ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే.. తన డిమాండ్‌ను బీజేపీ ప్రభుత్వం పట్టించుకుంటుందని, ఈ మేరకు చట్టం తెస్తుందని తాను భావించట్లేదని పేర్కొన్నారు. కాస్‌గంజ్‌లోని ముస్లింలను పాకిస్థానీలుగా భావిస్తున్నారా? అందుకే గణతంత్ర దినోత్సవం రోజు నిర్వహించిన ర్యాలీలో పాక్ వ్యతిరేక నినాదాలు చేశారా? అని అసదుద్దీన్ ప్రశ్నించారు. పాకిస్థాన్ జాతిపిత



మహ్మద్ అలీ జిన్నా ద్విజాతి సిద్ధాంతాన్ని భారత్‌లోని ముస్లిములు కూడా వ్యతిరేకించారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ట్రిపుల్ తలాక్ బిల్లు ముస్లిం మహిళలకు తీవ్ర వ్యతిరేకమని అన్నారు. ముస్లిం పురుషులను జైల్లో పెట్టేందుకే ఈ బిల్లు తీసుకొచ్చారన్నారు.

# వందేమాతరం ఆలపించనివారికి జైలు

- జాతీయ పతాకం, పాక్ పతాకాన్ని ఎగరేసినా విధించాలి
- కొత్త చట్టం తేవాల్సిందే: ఎంపీ వినయ్ కతియార్
- లేదంటే పాక్ లేదా బంగ్లాదేశ్ వెళ్లిపోవాలని వ్యాఖ్య



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: భారతీయ ముస్లిములను పాకిస్థానీలంటూ పిలిచిన వారికి మూడేళ్ల జైలుశిక్ష విధించేలా చట్టం తీసుకురావాలని ఎంపీ అసదుద్దీన్ చేసిన డిమాండ్‌పై బీజేపీ ఎంపీ వినయ్‌కతియార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వందేమాతరం, మన జాతీయ పతాకాన్ని గౌరవించని ముస్లిములు పాకిస్థాన్ లేదా బంగ్లాదేశ్ వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. అలాగే.. వందేమాతరం ఆలపించని వారికి, జాతీయ పతాకాన్ని గౌరవించనివారికి, పాకిస్థాన్ పతాకాన్ని ఎగరేసినవారికి కఠిన శిక్ష విధించేలా చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ముస్లిములే దేశాన్ని మతం ప్రాతిపదికన విభజించారని ఆరోపించారు. "ఈ దేశంలో ముస్లింలు నివసించొద్దు. వారి జనాభా మేరకు వారికి ఓ దేశాన్ని విభజించారు. అలాంటప్పుడు వారు భారత్‌లో ఎందుకు నివసించాలి. వారికి ప్రత్యేక దేశం ఉందిగా. వారు తప్పనిసరిగా పాకిస్థాన్ లేదా బంగ్లాదేశ్ వెళ్లిపోవాల్సిందే'' అని కతియార్ పేర్కొన్నారు.



## పృథ్వీ-2 క్షిపణి మళ్లీ విజయవంతం

బాలాసోర్, ఫిబ్రవరి 7: అణు సామర్థ్యం కలిగిన స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి పృథ్వీ-2ను భారత్ బుధవారం విజయవంతంగా ప్రయోగించింది. 350 కిలోమీటర్ల లక్ష్యాన్ని ఛేదించగల ఈ స్వదేశీ క్షిపణిని ఒడిశా తీరంలోని చాందీపూర్‌లోగల ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ ప్రయోగించింది. ఉదయం 11.35 గంటలకు మొబైల్ లాంచర్ పైనుంచి ప్రయోగించగా విజయవంతంగా బంగాళాఖాతంలో నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేదించిందని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. పృథ్వీ-2నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవడంలో ఏ మాత్రం తడబాటు లేకుండా కొనసాగింది. క్షిపణి ప్రయోగం ఆరంభం నుంచి లక్ష్యాన్ని చేరే వరకు దాని మార్గాన్ని అధునాతన రాడార్లు, ఎలక్ట్రో ఆప్టిక్ పరికరాలు, యుద్ధ నౌకల సాయంతో గమనించారు. 4.6 టన్నుల బరువు, 8 మీటర్ల పొడవైన ఈ క్షిపణి 500 నుంచి వెయ్యి కిలోల అణ్వస్త్రాలను మోసుకెళ్లగలదు. ఇది 350 కిలోమీటర్ల లక్ష్యాలను ఛేదించగలదు. భారత ఆర్మీకి చెందిన స్ట్రాటజిక్ ఫోర్సెస్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా దీన్ని బుధవారం పరీక్షించారు. ఈ సందర్భంగా క్షిపణి ప్రయోగ సంసిద్ధతను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ మిస్సైల్ అభివృద్ధిలో భాగంగా పృథ్వీ క్షిపణులను తొలిసారి డీఆర్డీవో 1988లో రూపొందించింది. అనంతరం 1996లో పృథ్వీ-2క్షిపణిని చాందీపూర్ టెస్ట్ రేంజ్ నుంచి పరీక్షించింది. 2003లో పూర్తి స్థాయి పరీక్షలు విజయవంతం కావడంతో భారత సైన్యానికి అప్పగించింది. అనంతరం పలుమార్లు దీన్ని ప్రయోగ సంసిద్ధతపై పరీక్షలు జరిగాయి. 2017 జూన్ 2న చివరిసారిగా పరీక్షించారు. కాగా, మంగళవారం అగ్ని-1 క్షిపణిని విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే.





# అంతరిక్షంలోకి కారు!

## 'ఫాల్కన్ హెవీ' ప్రయోగం దిగ్విజయం.. కక్ష్యలోకి కారును మోసుకెళ్లిన రాకెట్

- తిరిగి నేలపైకి చేరిన రెండు బూస్టర్లు
- ప్రపంచంలోనే అతిపెద్ద ప్రయోగం
- 27 ఇంజన్లతో నింగికెగసిన రాకెట్

కేప్ కెనవెరాల్, ఫిబ్రవరి 7: ప్రపంచంలోనే అతిపెద్ద అంతరిక్ష ప్రయోగం విజయవంతమైంది. 27 ఇంజన్లు.. 3 బూస్టర్లు.. 2 దశలు.. ఒక కారు.. 1420 టన్నుల పేలోడ్‌తో 23 అంతస్తుల 'ఫాల్కన్ హెవీ' రాకెట్ అంతరిక్షంలోకి దూసుకెళ్లింది. అధునాతన స్పేస్ డ్రోన్లతో టెస్లా కారును రోదసిలోకి పంపింది. అంగారక గ్రహానికి సమీపంలోని కక్ష్యను చేరుకునే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రయోగం తొలి దశ విజయం సాధించింది. ఫ్లోరిడాలోని కేప్ కెనవెరాల్‌లోగల కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి దూసుకెళ్లిన స్పేస్ ఎక్స్ శక్తిమంతమైన ఫాల్కన్ హెవీ రాకెట్ తన తొలి ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. రాకెట్‌కు అనుసంధానంగా ప్రయోగించిన మూడు పునర్వినియోగ బూస్టర్లలో రెండు తిరిగి భూమికి చేరుకున్నాయి. మరొకటి గతి తప్పి సముద్రంలో పడిపోయింది. కాగా, రెండు బూస్టర్లు మాత్రమే భూమికి చేరినప్పటికీ ప్రయోగ లక్ష్యాన్ని ఛేదించామని స్పేస్ ఎక్స్ అధినేత ఎలన్ మస్క్ ప్రకటించారు. దీంతో స్పేస్ ఎక్స్ ఉద్యోగుల ఆనందం అంబరాన్ని తాకింది. మంగళవారం ఫ్లోరిడా స్థానిక కాలమానం ప్రకారం 3.45 గంటలకు ఈ ప్రయోగం జరిగింది. ఈ ప్రయోగానికి సంబంధించిన వీడియోలను ఎలన్ తన ట్విటర్ ఖాతాలో పెట్టారు. కాగా, ఫాల్కన్ నింగికెగిసేటప్పుడు స్పేస్ సెంటర్లోని గోడలు.. ఏదో భూకంపం వచ్చినట్టుగా ఊగిపోయాయి. ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోయింది. ఇది చాలు.. ఫాల్కన్ ప్రయోగం ఎంత శక్తిమంతమైనదో చెప్పేందుకు. 40 ఏళ్ల క్రితం చంద్రుడిపై అపోలో ప్రయోగాల కోసం సాటర్న్ 5 రాకెట్లను నాసా ప్రయోగించిన ప్రాంతం నుంచే ఇప్పుడు స్పేస్ ఎక్స్ ఆ ప్రయోగాన్ని చేపట్టింది. అయితే, ఈ ప్రయోగంలో భాగంగా అంత భారీ బరువున్న రాకెట్‌ను లిఫ్ట్ ఆఫ్ చేయడంతోనే స్పేస్ ఎక్స్ తొలి విజయాన్ని దక్కించుకుంది. ఈ ప్రయోగంలో కీలక ఘట్టమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ప్రయోగ విజయంతో మార్స్‌పై దృష్టి పెడతామని ఎలన్ మస్క్ తెలిపారు.






**ఫాల్కన్ ప్రత్యేకతలు**

- ఎత్తు: 70 మీటర్లు
- వెడల్పు: 12.2 మీటర్లు
- బరువు: 14,20,788 కిలోలు
- ఇంజన్లు: 27
- దశలు: 2
- బూస్టర్లు: 3

**పేలోడ్ విశేషాలు**

- అధమ భూ కక్ష్య: 63,800 కిలోలు
- అంగారక కక్ష్య: 16,800 కిలోలు





## రోడ్డు ప్రమాదంలో మోదీ భార్యకు గాయాలు

**బంధువు మృతి.. రాజస్థాన్‌లో దుర్ఘటన**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ప్రధాని నరేంద్ర మోదీ భార్య జశోదాబెన్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా, ఆమె బంధువు మరణించారు. బుధవారం రాజస్థాన్‌లోని చిత్తోర్‌గఢ్ సమీపంలో జశోదా బెన్ ప్రయాణిస్తున్న కారు, ముందు వెళ్తున్న ట్రక్కును ఢీకొంది. కారులో ఆమెతో పాటు మరో నలుగురు ఉన్నారు. ప్రమాదంలో ఐదుగురూ గాయపడినట్టు పోలీసులు తెలిపారు. జశోదాబెన్‌కు స్వల్ప గాయాలు అయ్యాయని, ఆమె బంధువు బసంత్ భాయ్ మోదీ (67) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్టు చెప్పారు. కోటాలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె పాల్గొని చిత్తోర్‌గఢ్‌కు వెళ్తుండగా పర్సోలి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదం జరిగినట్టు వెల్లడించారు. ముందు వెళ్తున్న ట్రక్కు డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేకులు వేయడంతో కారు అందులోకి దూసుకెళ్లినట్టు పోలీసులు తెలిపారు.

## వారికి చట్టంలో శిక్ష లేదు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: 'భారత్ మాతాకి జై' అని నినదించాలని బలవంతం చేసిన వ్యక్తులపై తీసుకునే చట్టపరమైన చర్యలకు సంబంధించి తమ వద్ద ఎలాంటి రికార్డులు లేవని న్యాయ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రతి పౌరుడు భారత్ మాతాకి జై అని నినదించాలని చట్టం ఎమైనా ఉందా, ఈ విషయంలో బలవంతం చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చా అనే అంశంపై మహ్మద్ ఇర్ఫాన్ ఖాద్రీ అనే వ్యక్తి సమాచార హక్కు చట్టం ద్వారా న్యాయశాఖను ఆశ్రయించాడు. ఆర్టీఐ చట్టం 2005లోని సెక్షన్2(ఎఫ్), సెక్షన్ 2 క్లాస్ 1 ప్రకారం అప్పీలుదారుడు కోరినది సమాచారం కాదని ప్రధాన సమాచార కమిషనర్ ఆర్‌కే.మాథుర్ చెప్పారు. ఈ విషయంలో మరింత జోక్యం అవసరం లేదని మాథుర్ పేర్కొన్నారు.


# ఉద్యోగాలు కావాలి.. ప్రసంగాలొద్దు

- అడిగినవాటికి సమాధానమివ్వండి
- రాఫెల్‌పై ఎందుకు స్పందించలేదు?
- ప్రధాని ప్రసంగమంతా రాజకీయకోణంలోనే: రాహుల్
- మోదీ ప్రసంగంలో కొత్తదనమేదీ లేదు: సోనియా





న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్రమోదీ తీవ్రంగా విరుచుకుపడిన నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ కూడా అదే స్థాయిలో స్పందించారు. ప్రజలు ఉద్యోగాలు కోరుకుంటున్నారని, అంతేకానీ ప్రసంగాలు కావాలనుకోవడంలేదని పేర్కొన్నారు. అడిగినవాటికి సమాధానం ఇవ్వకుండా ఎందుకు దాటవేస్తున్నారని నిలదీశారు. ప్రధాని మోదీ తన ప్రసంగంలో రాఫెల్ ఒప్పందం గురించి ఎందుకు ప్రస్తావించలేదన్నారు. నిరుద్యోగం, రైతు సమస్యల గురించి, సరిహద్దుల్లో సైనికుల వీరమరణం గురించి ప్రధాని తన ప్రసంగంలో ఎందుకు ప్రస్తావించలేదని రాహుల్ ప్రశ్నించారు. మోదీ గంటసేపు మాట్లాడారు, కానీ రాఫెల్ డీల్ గురించి ఏమీ ప్రస్తావించలేదన్నారు. ప్రతిపక్షాలను నిందించడం కాదని, ఆయన అన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని రాహుల్ అన్నారు. మోదీ ప్రసంగం కేవలం రాజకీయ కోణంలో సాగిందన్నారు. ప్రధాని మోదీ తన ప్రసంగంలో కొత్తగా చెప్పింది ఏమీ లేదన్నారు. సోనియాగాంధీ కూడా అదే స్థాయిలో విమర్శలు చేశారు. తమ పార్టీపై తీవ్ర విమర్శలు చేసిన ప్రధాని మోదీ తన ప్రసంగంలో ఉద్యోగాల గురించి ఒక్క విషయమూ చెప్పలేదని అన్నారు. ప్రధాని ప్రసంగంలో కొత్తదనమేమీ లేదని, అన్ని పాత విషయాలనే మోదీ ప్రస్తావించారని గుర్తుచేశారు. తమ భవిష్యత్తు గురించి తెలుసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారని, కానీ మోదీ ప్రసంగంతో ఆ అవకాశం లేకుండా పోయిందని సోనియా అభిప్రాయపడ్డారు. ఉద్యోగాల సృష్టికోసం ప్రభుత్వం ఏం చేస్తుందో తెలుసుకోవాలనుకుంటున్నామని పేర్కొన్నారు.



## మైనింగ్ కంపెనీల లీజు రద్దు

- గోవాలోని 88 వాటిపై సుప్రీం కొరడా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: నిబంధనలు ఉల్లంఘించిన మైనింగ్ కంపెనీలపై సుప్రీం కోర్టు కొరడా ఝుళిపించింది. గోవాలో 88 కంపెనీలకు ఇచ్చిన ఉక్కు గనుల మైనింగ్ లీజును రద్దు చేసింది. 2015లో ఆయా కంపెనీలకు ఇచ్చిన లీజు రెండో రెన్యువల్‌ను రద్దు చేస్తూ జస్టిస్ మదన్ బి లోకూర్, దీపక్ గుప్తాలతో కూడి సుప్రీం ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కంపెనీలకు కొత్తగా పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర, గోవా ప్రభుత్వాలకు సూచించింది. గతంలో ఇచ్చిన లీజులకు రెండో రెన్యువల్ చెల్లదని, కొత్తగా అనుమతులు మంజూరు చేయాలని పేర్కొంది. కాగా ప్రస్తుత కంపెనీలకు వచ్చే మార్చి 15 వరకు సడలింపు ఇస్తూ, మైనింగ్ పనులు చేసుకోవచ్చని అనుమతి ఇచ్చింది. ఆ మరుసటి రోజు అనగా మార్చి 16 నుంచి అన్ని మైనింగ్ కార్యకలాపాలను ఆపివేయాలని ఆదేశించింది. కొత్తగా ప్రభుత్వ, పర్యావరణ అనుమతులు పొందేవరకూ మైనింగ్ చేయరాదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

## పాక్‌తో యుద్ధం చేయాల్సిందే

- కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకునేందుకు ఆ దేశంతో యుద్ధం చేయాలని కేంద్ర మంత్రి, దళిత నేత రామ్‌దాస్ అథవాలే అన్నారు. స్నేహపూర్వక వాతావరణం కోసం మనం ఎన్నిసార్లు ప్రయత్నిస్తున్నప్పటికీ, పాక్ తరచూ కాల్పుల విరమణను ఉల్లంఘిస్తుందని, ఆ దేశానికి గుణపాఠం చెప్పాలంటే యుద్ధం చేయాల్సిందేనని సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి రామ్‌దాస్ అథవాలే అన్నారు. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు చెబుతూ అతావాలే ఈ వ్యాఖ్యలు చేశారు. తన వ్యాఖ్యలను సమర్థించుకునేందుకు మాజీ ప్రధాని వాజపేయి పేరును ప్రస్తావించారు. పులిలాంటి భారతదేశం ముందు పాకిస్థాన్ చాలా చిన్నదని, వాజపేయి గారిని స్ఫూర్తిగా తీసుకోవాలని, స్నేహం కోసం మనం ఇచ్చే అవకాశాలను తిరస్కరిస్తే దాడి చేసి మనం ఎంటో పాకిస్థాన్‌కు చూపిం చాలని అథవాలే అన్నారు. ఈదాడిలో పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో పాటు ఆ దేశ ఆధీనంలో ఉన్న కొన్ని ప్రాంతాలు కూడా భారత్ ఆధీనంలోకి రావాలన్నారు.



# తైవాన్‌లో భూప్రళయం


## భూకంప తీవ్రతకు భవనాలు నేలమట్టం
## ఆరుగురు మృతి.. 88మంది గల్లంతు

హువాలీన్: తైవాన్‌లో భూకంపం బీభత్సం సృష్టించింది. మంగళవారం అర్ధరాత్రి 11.50నిమిషాల సమయంలో తైవాన్‌లోని హువాలీన్ నగరంలో భూమి తీవ్రంగా కంపించింది. పలు అంతస్తులు భారీ కుదుపులకు లోనయ్యాయి. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 6.1గా నమోదైంది. ఈ ప్రకృతి విలయం ధాటికి ఆరుగురు మరణించారు. ఓ హోటల్ పూర్తిగా ధ్వంసమైంది. హోటల్ కుప్పకూలడంతో శిథిలాల కింద 30మంది దాకా చిక్కుకున్నట్లు తెలిసింది. వారిని రక్షించేందుకు రెస్క్యూ టీం శతవిధాల ప్రయత్నిస్తోంది. 88మంది దాకా గల్లంతయ్యారు. దాదాపు 256మంది గాయాలపాలైనట్లు తెలిసింది. గాయపడిన వారిలో తొమ్మిది మంది జపాన్ దేశస్తులు, ఆరుగురు చైనీయులు ఉన్నట్లు తెలిసింది. నగరంలోని నాలుగు అంతస్తులు ఏ క్షణం కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రమాదకర స్థితిలో ఉన్న అంతస్తుల్లోని ప్రజలను కిందికి దించేందుకు రెస్క్యూ టీం రంగంలోకి దిగింది. కొన్ని చోట్ల రోడ్లు బీటలు పడ్డాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రవాణా స్థంభించిపోయింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. నగరంలోని కొన్ని ప్రాంతాల ప్రజలకు నీరు కూడా సరఫరా చేయలేని దయనీయ పరిస్థితి ఉందని అక్కడి అధికారులు వెల్లడించారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తైవాన్ దేశ అధ్యక్షురాలు సాయ్ ఇంగ్ వన్ ప్రకటించారు. ఇదిలా ఉంటే, ఏ క్షణం ఏం జరుగుతుందోనన్న భయంతో జనం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.



## వెనక్కి తగ్గిన మాల్దీవ్స్ సుప్రీం

- రాజకీయ ఖైదీలు జైల్లో ఉండాల్సిందే
- గత ఆదేశాలు వెనక్కి తీసుకున్న కోర్టు



మాలె, ఫిబ్రవరి 7: మాల్దీవ్స్‌లో నెలకొన్న రాజకీయ సంక్షోభం మరో మలుపు తీసుకుంది. అసమ్మతి నేతలను జైలు నుంచి విడుదల చేయాలంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలను మాల్దీవ్స్ సుప్రీంకోర్టు వెనక్కి తీసుకుంది. వారంతా జైల్లో ఉండాల్సిందేనని ముగ్గురు సభ్యులతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. దాంతో దేశంలో నెలకొన్న సంక్షోభం కొద్దిమేరకు సమసినట్లేనని విశ్లేషకులు అంటున్నారు. సుప్రీంకోర్టులో ప్రధాని న్యాయమూర్తి సహా ఐదుగురు జడ్జిలు ఉండగా.. వారిలో సీజే, మరో జడ్జిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. మిగతా ముగ్గురితో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలను అధ్యక్షుడు అబ్దుల్లా యామీన్ స్వాగతించారు. అయితే.. సమస్య పరిష్కారం దిశగా దేశంలో ముందస్తు ఎన్నికలు నిర్వహించే యోచన ఉందని ప్రకటించారు.

## సోదరుడి కళ్ల ముందే యువతిపై అత్యాచారం



ముజఫర్‌నగర్, ఫిబ్రవరి 7: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో దారుణం జరిగింది. ఓ యువతిని ఆమె సోదరుడి కళ్ల ముందే ఓ యువకుడు అత్యాచారం చేశాడు. బాధితురాలి ఫిర్యాదుతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొత్వాలి పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముండే ఓ యువతి మందులు కొనడానికి సోదరుడితో కలిసి బయటకు వెళ్లింది. ఇంటి నుంచి వెళుతున్న వారిని మోనూ అనే యువకుడు బైక్‌పై వెంబడించాడు. అటుగానే వెళుతున్నానని, మెడికల్ షాప్ వరకూ తీసుకెళతానని చెప్పడంతో యువతి, ఆమె సోదరుడు బైక్ ఎక్కారు. వారిద్దరినీ ఓ నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి మోనూ ఆ యువతిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. యువతి సోదరుడు మానసిక సమస్యతో బాధపడుతుండటంతో సోదరిని కాపాడకుండా చూస్తూ ఉండిపోయాడు. ఈ విషయాన్ని ఎవరితోనైనా చెబితే ఇద్దరినీ చంపేస్తానని మోనూ బెదిరించాడు. అయితే యువతి ధైర్యం చేసి తనకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మోనూపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



• ఎన్టీఆర్

# మరో డిఫరెంట్ గెటప్‌తో...

'టెంపర్'లో సిక్స్ ప్యాక్‌తో కనిపించిన ఎన్టీఆర్.. 'జై లవ కుశ' చిత్రంలో మూడు విభిన్న పాత్రలు చేసి ఆకట్టుకున్నారు. ఇప్పుడు త్రివిక్రమ్ దర్శకత్వంలో ఎన్టీఆర్ నటిస్తున్న విషయం తెలిసిందే. మంచి కుటుంబ కథా చిత్రంగా రూపొందే ఈ సినిమా షూటింగ్‌ను మార్చి నెలలో ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ చిత్రంలో మరో కొత్త లుక్ కనిపించనున్నారు ఎన్టీఆర్. దీని కోసం ప్రముఖ హాలీవుడ్ మేకప్ ఆర్టిస్ట్ వాన్స్ హార్ట్‌వెల్‌ను రప్పిస్తున్నారు. మరి ఈ సినిమాలో తమ అభిమాన హీరో ఎలాంటి గెటప్‌తో కనిపిస్తారా.. అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్ ఎవరన్నది ఇంకా కన్‌ఫర్మ్ చెయ్యాల్సి ఉంది. ఇప్పటివరకు పూజా హెగ్డే, అను ఇమ్మానుయేల్, శ్రద్ధా కపూర్ పేర్లు వినిపించాయి. మరి హీరోయిన్‌గా ఎవరిని ఎంపిక చేస్తారనేది తెలియాల్సి ఉంది.





సాయి ధరమ్‌తేజ్ హీరోగా సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై. లిమిటెడ్ పతాకంపై నిర్మించిన చిత్రం 'ఇంటిలిజెంట్'. వి.వి.వినాయక్ దర్శకుడు. సి.కల్యాణ్ నిర్మాత. లావణ్య త్రిపాఠి హీరోయిన్. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం ఫిబ్రవరి 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు వి.వి.వినాయక్‌తో జరిపిన ఇంటర్వ్యూ..

# ఇంటిలిజెంట్ పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్

## - వి.వి.వినాయక్



**'ఇంటిలిజెంట్' ఫస్ట్ కాపీ చూసిన తర్వాత ఎలా అనిపించింది?**

యూనిట్‌లోని ప్రతి ఒక్కరం చాలా హ్యాపీగా ఫీల్ అయ్యాం. ఖచ్చితంగా సూపర్‌హిట్ కొడతామన్న నమ్మకం కలిగింది. మంచి కామెడీ, యాక్షన్, బ్యూటిఫుల్ సాంగ్స్ వున్న పక్కా కమర్షియల్ మూవీ ఇది. సెన్సార్ పూర్తయిన తర్వాత సభ్యులంతా సినిమా చాలా బాగుందని ప్రశంసించారు.

**మ్యూజిక్‌కి ఎలాంటి రెస్పాన్స్ వస్తోంది?**

'నాయక్' తర్వాత మళ్ళీ తమన్‌తో కలిసి వర్క్ చేశాను. 'నాయక్' ఆడియోతో పాటు సినిమా కూడా చాలా పెద్ద హిట్ అయ్యింది. 'ఇంటిలిజెంట్'కి తమన్ ఎక్స్‌ట్రార్డినరీ మ్యూజిక్ ఇచ్చాడు. నాలుగు సాంగ్స్ సూపర్‌హిట్ అయ్యాయి. రీ-రికార్డింగ్ కూడా చాలా అద్భుతంగా చేశాడు.

**నిర్మాత సి.కల్యాణ్ మేకింగ్ ఎలా వుంది?**

నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా వున్నప్పటి నుండి నాకు కల్యాణ్‌గారు తెలుసు. ఇద్దరం ఫ్రెండ్స్‌లాగా వుంటాం. జనరల్‌గా నేను అందర్నీ బాగా చూసుకుంటాను. అలాంటి నన్ను కల్యాణ్‌గారు ఒక గాజు బొమ్మలాగా చూసుకున్నారు. ఎప్పుడు షూటింగ్ జరిగినా ఎలాంటి అవాంతరాలు లేకుండా అన్నీ సమకూర్చి అన్‌కాంప్రమైజ్డ్‌గా ఎంతో ఖర్చు పెట్టి చాలా రిచ్‌గా ఈ చిత్రాన్ని నిర్మించారు. సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో 'ఇంటిలిజెంట్' సినిమా పెద్ద హిట్ చిత్రంగా నిలుస్తుందని కాన్ఫిడెంట్‌గా చెప్పగలను. ప్రొడక్షన్ సైడ్ ఎలాంటి ప్రాబ్లెమ్స్ లేకుండా సి.వి.రావు, పత్స నాగరాజా ఎంతగానో సపోర్ట్ చేశారు.

**తేజు క్యారెక్టర్ ఎలా వుంటుంది?**

సరదాగా లైఫ్‌ని ఎంజాయ్ చేస్తూ వుండే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా తేజ్ తన స్టైల్‌లో బాగా చేశాడు. కామెడీ, యాక్షన్ సీన్స్‌లలో అద్భుతంగా చేశాడు. పర్టిక్యులర్‌గా కొన్ని షాట్స్‌లో అచ్చం చిరంజీవిగారిలా కన్పించాడు. సాయి అంతకు ముందు చేసిన చిత్రాల్లో కంటే ఈ చిత్రంలో పాటలు చాలా బాగుంటాయి. డ్యాన్స్‌లు ఇరగదీశాడు. శేఖర్, జానీ మాస్టర్స్ డాన్స్ చాలా ఎక్స్‌లెంట్‌గా కంపోజ్ చేశారు. అందులోని బెస్ట్ మూవ్‌మెంట్స్‌ని సెలెక్ట్ చేసుకుని చేశాం.

**ఈ సినిమా మెయిన్ కథాంశం ఏమిటి?**

విశ్వాసానికి మారుపేరుగా నిలుస్తూ... తనకి సాయం చేసిన ఒక గాడ్‌ఫాదర్ లాంటి వ్యక్తికి అన్యాయం జరిగితే అతని కోసం హీరో ఎలా రియాక్ట్ అయ్యాడు? విలన్ మీద ఎలా పోరాడాడు? అనేది మెయిన్ కథాంశం. ఒక చిన్న మైండ్‌గేమ్‌ని హీరో 'ఇంటిలిజెంట్' గా ఎలా డీల్ చేశాడు అనేది చాలా ఇంట్రెస్టింగ్‌గా వుంటుంది.

**'చమక్ చమక్' సాంగ్‌ని రీమిక్స్ చేయాలన్న థాట్ ఎవరిది?**

అన్నయ్య సినిమాల్లోని నాకు చాలా ఇష్టమైన పాట అది. 'చమక్ చమక్' పాట పెట్టాలని అందరం అనుకున్నాం. కల్యాణ్‌గారు ఇళయరాజాగారిని అప్రోచ్ అయ్యి ఈ పాట రీమిక్స్ గురించి అడగ్గానే ఆయన ఓకే చేశారు. ఈ పాటని రోమన్‌లో అద్భుతమైన లొకేషన్స్‌లో చిత్రీకరించాం. ఒరిజినల్ పాటకి ఏమాత్రం తీసిపోని విధంగా వుంటుంది.

**లావణ్య త్రిపాఠి గురించి?**

ఫస్ట్‌టైమ్ ఫుల్ కమర్షియల్ మూవీలో లావణ్య త్రిపాఠి నటించింది. ఈ సినిమాతో లావణ్య పెద్ద కమర్షియల్ హీరోయిన్ అవుతుంది. సంధ్య క్యారెక్టర్‌లో లావణ్య ఫెంటాస్టిక్‌గా పెర్‌ఫార్మ్ చేసింది. డ్యాన్స్‌లు కూడా బాగా చేసింది.



**'అదుర్స్2' ఎప్పుడు?**

రెండు మూడు కథలు అనుకున్నాం. కానీ మేం శాటిస్‌ఫై అయ్యేంతగా అన్పించలేదు. అదుర్స్ సినిమాని మించి 'అదుర్స్2' తియ్యాలని మంచి కథ కోసం వెయిట్ చేస్తున్నాను. తప్పకుండా 'అదుర్స్2' చేస్తాను.

**మహేష్‌తో సినిమా ఎప్పుడు?**

మా కాంబినేషన్‌లో తప్పకుండా సినిమా వుంటుంది. మంచి కథ కోసం వెయిట్ చేస్తున్నాం.

**ప్రొడక్షన్‌హౌస్ స్టార్ట్ చేసే ఉద్దేశం వుందా?**

నాకు కొన్ని ఐడియాలు వున్నాయి. కొత్త దర్శకులను ప్రోత్సహిస్తూ మంచి కాన్సెప్ట్ బేస్డ్ మూవీస్ తీయాలని ప్లాన్ చేస్తున్నాను. రెండు సంవత్సరాల తర్వాత ప్రొడక్షన్ స్టార్ట్ చేస్తాను.

**మీ నెక్స్‌ట్ ప్రాజెక్ట్ ఏంటి?**

ఇంకా ఏమీ కమిట్ అవ్వలేదు. ప్రస్తుతానికి 'ఇంటిలిజెంట్' మీదే నా ఫోకస్ అంతా వుంది. రెండు నెలలు గ్యాప్ తీసుకుని నెక్స్‌ట్ చేయబోయే సినిమా గురించి ఆలోచిస్తాను.



• శ్రియ

# నాకు పెళ్ళా..! తూచ్

హీరోయిన్స్‌కు నటన పరంగా సీనియారిటీ వచ్చే కొద్ది వారు చేస్తున్న, చేయబోతున్న సినిమాల కంటే వారి పెళ్లి విషయమై వచ్చే వార్తలే ఎక్కువగా ఉంటాయి. దీనిపై సదరు హీరోయిన్స్ స్పందించింది.. అలాందేమీ లేదని ఖండిస్తుంటారు. ఇక అసలు విషయంలోకి వెళితే..ఇటీవల డెహ్రాడూన్ బ్యూటీ శ్రియ పెళ్లికి సిద్ధమైందని.. రష్యాకు చెందిన ఓ వ్యక్తిని త్వరలో పెళ్లి చేసుకోబోతుందని ఇటీవల వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా స్పందించింది శ్రియ. పెళ్లి తనది కాదని స్పష్టం చేసింది. తన స్నేహితురాలి పెళ్లి కోసం షాపింగ్ చేశానని క్లారిటీ ఇచ్చింది. ఇప్పట్లో పెళ్లి చేసుకునే ఆలోచన లేదని కూడా తెలిపింది. ఇక ఇదే విషయంపై స్పందించిన శ్రియ తల్లి నీర్జ.. రానున్న నెలరోజుల్లో రెండు ఫంక్షన్‌లకు హాజరుకానుందని.. వాటి కోసం షాపింగ్ చేయడం వల్లనే ఈ రూమర్లు పుట్టుకొచ్చాయని తెలిపారు. ఇదిలా ఉంటే తెలుగు, తమిళ్‌లో వరుస సినిమాలతో శ్రియ మళ్లీ బిజీ అయిన విషయం తెలిసిందే.



# 'కిక్' సీక్వెల్‌లో సల్మాన్

'కిక్' చిత్రం హీరో రవితేజకు మంచి పేరు తెచ్చిపెట్టడమే కాకుండా కలెక్షన్లపరంగా కూడా సంచలనం సృష్టించింది. ఈ చిత్రాన్ని హిందీలోనూ 'కిక్' టైటిల్‌తోనే రూపొందించారు. రవితేజ పాత్రను సల్మాన్‌ఖాన్ పోషించారు. జాక్వెలిన్ ఫెర్నాండజ్ హీరోయిన్‌గా నటించింది. బాలీవుడ్‌లో కూడా ఈ చిత్రం విజయం సాధించింది. ఇప్పుడు దీనికి సీక్వెల్‌గా 'కిక్ 2' రాబోతోంది. సాజిద్ నదియాద్‌వాలా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సల్మాన్ సరసన ఎవరు నటిస్తారనే విషయం ప్రకటించాల్సి ఉంది. సాధారణంగా సల్మాన్ ఖాన్ చిత్రాలు రంజాన్, క్రిస్మస్ పండగల సందర్భంగా విడుదలవుతాయి. ఇప్పుడు 'కిక్ 2' చిత్రాన్ని 2019 క్రిస్మస్‌కి విడుదల చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం సల్మాన్ 'భారత్' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఆలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో 25 ఏళ్ళ యువకుడిగా సల్మాన్ కనిపిస్తారు. 2019 రంజాన్‌కు ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



# నందితతో నితిన్ కల్యాణం

నితిన్ హీరోగా 'శతమానం భవతి' ఫేం సతీష్ వేగేశ్న దర్శకత్వంలో దిల్‌రాజు ఓ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. 'శ్రీనివాస కల్యాణం' పేరుతో రూపొందే ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ ప్రస్తుతం జరుగుతోంది. త్వరలోనే ఈ సినిమా సెట్స్ పైకి వెళ్లేందుకు సిద్ధమవుతోంది. తాజా సమాచారం మేరకు ఈ చిత్రంలో హీరోయిన్‌గా నందిత శ్వేతను ఓకే చేశారు. 'ఎక్కడికి పోతావు చిన్నవాడా' చిత్రంలో తన నటనతో అందర్నీ ఆకట్టుకున్న నందిత 'శ్రీనివాస కల్యాణం' చిత్రంలో నితిన్‌తో జత కడుతోంది. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ప్రస్తుతం కృష్ణచైతన్య దర్శకత్వంలో పవన్‌కల్యాణ్, త్రివిక్రమ్ నిర్మిస్తున్న చిత్రంలో నటిస్తున్నారు నితిన్.

# వదిన పాత్రలో...

అనువాద చిత్రం 'జర్నీ' ద్వారా ప్రేక్షకులకు పరిచయమైన హీరోయిన్ అనన్య. ఈ మలయాళీ అమ్మడు నచ్చిన వ్యక్తిని పెళ్లి చేసుకుంది. అయితే సినిమాలకు మాత్రం దూరం కాలేదు. అడపా దడపా సినిమాల్లో నటిస్తూనే ఉంది. తెలుగులో 'అఆ' సినిమాలో నితిన్ చెల్లెలు పాత్రలో దర్శనమిచ్చింది. మళ్లీ చానాళ్ల తర్వాత తెలుగులో మరో సినిమా చేయబోతుంది అనన్య. రామ్‌చరణ్, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో రామ్‌చరణ్ వదిన పాత్రలో అనన్య కనపడనుంది. రామ్ చరణ్‌కు ప్రశాంత్, నవీన్‌చంద్రలు అన్నయ్యలుగా నటిస్తుంటే ప్రశాంత్ జోడిగా స్నేహ, నవీన్‌చంద్ర జోడిగా అనన్య నటిస్తున్నారు. ఈ సినిమాను డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్నారు. తనదైన మాస్ ఎలిమెంట్స్‌ను యాడ్ చేసి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సినిమాను బోయపాటి తెరకెక్కిస్తున్నారు.



• అనన్య

# బాహుబలితో పూజా హెగ్డే

'ఒక లైలా కోసం' సినిమాతో హీరోయిన్‌గా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన అమ్మడు పూజా హెగ్డే. తర్వాత 'ముకుంద', 'డీజే దువ్వాడ జగన్నాథమ్' సినిమాల్లో నటించింది. డీజే తర్వాత వెంటనే సినిమాలు రాలేదు. కాస్త సమయం పట్టినా ఇప్పుడు మాత్రం పూజా హెగ్డే స్టార్ హీరోల సరసన వరస పెట్టి అవకాశాలను దక్కించుకుంటుంది. వివరాల్లోకెళ్తే.. మహేష్, వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో రూపొందబోయే చిత్రంతో పాటు ఎన్టీఆర్, త్రివిక్రమ్ సినిమాలో కూడా పూజా హెగ్డేనే హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ రెండు క్రేజీ ప్రాజెక్టులతో పాటు ప్రభాస్ హీరోగా 'జిల్' ఫేమ్ రాధాకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కబోయే సినిమాలో కూడా పూజా హెగ్డేను హీరోయిన్‌గా తీసుకోవాలని యూనిట్ సభ్యులు భావిస్తున్నారట. అందుకు సంబంధించి పూజా హెగ్డేతో సంప్రదింపులు జరుగుతున్నాయి. త్వరలోనే దీనిపై పూజాహెగ్డే సైడ్ నుండి ఓ క్లారిటీ రానుంది మరి.



# మరో విభిన్న పాత్రలో...

విజయ్ సేతుపతి విభిన్న చిత్రాలకు, విభిన్న పాత్రలకు పెట్టింది పేరు. ఈ హీరో తాజాగా 'సూపర్ డీలక్స్' అనే చిత్రంలో నటిస్తున్నారు. 'అరణ్యకాండం' చిత్రంతో దర్శకుడుగా మంచి పేరు తెచ్చుకున్న కుమారరాజా ఎంతో వైవిధ్యంగా 'సూపర్ డీలక్స్'ను తెరకెక్కిస్తున్నారు. ఫహద్ ఫాజిల్, సమంత, మిష్కిన్, రమ్యకృష్ణ, గాయత్రి, భగవతి పెరుమాల్ ఈ చిత్రంలో మిగతా పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు స్క్రీన్‌ప్లేను కుమారరాజాతో కలిసి నలన్ కుమారస్వామి, మిష్కిన్, నీలన్ శేఖర్ సమకూర్చారు. యువన్ శంకర్‌రాజా సంగీతం అందిస్తుండగా, పి.ఎస్.వినోద్, నిరవ్ షా ఛాయాగ్రహణ బాధ్యతలు తీసుకున్నారు. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి హిజ్రాగా నటిస్తున్నారు. గత కొన్నిరోజులుగా చెన్నైలో ఈ చిత్రం షూటింగ్ జరుగుతోంది. విజయ్‌కి హిజ్రా మేకప్ వేస్తున్న స్టిల్స్ సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి. ఇప్పటికే కొన్ని విభిన్న పాత్రలు పోషించి అందర్నీ ఆకట్టుకున్న విజయ్ 'సూపర్ డీలక్స్' చిత్రంతో మరోసారి ప్రేక్షకుల్ని అలరించనున్నారు.



• విజయ్ సేతుపతి




# మెడికల్ హబ్‌గా అమరావతి

- మెడికల్ టూరిజంగా అభివృద్ధి: బాబు
- అమృత విశ్వ విద్యాపీఠానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన

గుంటూరు, ఫిబ్రవరి 7 (మనం ప్రతినిధి): నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి రాబోయే కాలంలో మెడికల్ హబ్‌గా మారడంతో పాటు మెడికల్ టూరిజంగా ఎంతగానో అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. బుధవారం రాజధాని పరిధిలోని మంగళగిరి మండలం కురగల్లు వద్ద నిర్మించనున్న అమృత విశ్వ విద్యాపీఠానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. స్వలాభ పేక్ష లేకుండా మంచి విలువలతో కూడిన సమాజాన్ని తయారు చేయడానికి, అమృత విశ్వ విద్యాపీఠాన్ని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. 1987 నుంచి అమ్మ అమృతానందమయ ట్రస్ట్ దేశ విదేశాల్లో పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు అండగా ఉన్నారన్నారు. సేవా దృక్పథంతో విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయడం వల్ల ఈప్రాంతంలోని వారిని మంచి పౌరులుగా తయారు చేయడానికి అవకాశముంటుందన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యా సంస్థలను త్వరితగతిన పూర్తి చేయాలని అమృతానందమయ ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కామినేని శ్రీనివాస్, గంటా శ్రీనివాసరావు, పి.నారాయణ, నక్కా ఆనందబాబు, కలెక్టర్ కోన శశిధర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ షేక్.జానీమూన్, సీసీఎల్ ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్, సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.




# నిరసన హోరు

- మూడో రోజూ ఎంపీల ఆందోళన
- పార్లమెంట్‌లోను, బయట కూడా
- రాష్ట్రానికి న్యాయం చేయాలని డిమాండ్
- మోదీ ప్రసంగ సమయంలోనూ నినాదాలు
- టీడీపీ, వైసీపీ ఎంపీల పోటాపోటీ ప్రదర్శనలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ పార్లమెంట్‌లో వరసగా మూడో రోజూ రాష్ట్ర ఎంపీలు నిరసన గళం వినిపించారు. ఎంపీల నిరసనలతో ఉభయ సభలు దద్దరిల్లాయి. బుధవారం పార్లమెంట్‌లోనూ, వెలుపల ఆందోళన చేపట్టారు. విభజన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు ఎదుట, గాంధీ విగ్రహం ఎదుట టీడీపీ ఎంపీలు ధర్నా నిర్వహించారు. ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. గాంధీ విగ్రహం వద్ద వైసీపీ ఎంపీలు విడిగా ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా కావాలని వైసీపీ.. విభజన హామీలను అమలు చేయాలని టీడీపీ పార్లమెంటు సభ్యులు పోటాపోటీగా ఆందోళనలు నిర్వహించారు. రాజ్యసభలోనూ ఎంపీల ఆందోళన కొనసాగించారు. లోక్‌సభ ప్రారంభం కాగానే ఎంపీలు ప్లకార్డులు చేతబూని ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. టీడీపీ, వైసీపీ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. వెనక్కు వెళ్లాల్సిందిగా స్పీకర్ సుమిత్రా మహాజన్ కోరినా శాంతించలేదు. దీంతో సభా కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడింది. సుమిత్రా మహాజన్ ఎంపీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపిల్లల్లా ప్రవర్తిస్తున్నారని చురకలు వేశారు. ఇలా అయితే ఇంట్లో పిల్లల్ని కూడా క్రమశిక్షణలో పెట్టుకోలేరంటూ వ్యాఖ్యానించారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. కాగా ఎంపీలు ఆందోళన చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. ఎంపీల నినాదాల మధ్యే ప్రధాని ప్రసంగం కొనసాగించారు. కాసేపటి తర్వాత టీడీపీ సభ్యులు శాంతించగా, కాంగ్రెస్ ఎంపీలు నిరసన కొనసాగించారు. వైసీపీ ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేశారు.



### రాజ్‌నాథ్‌తో వైసీపీ ఎంపీల భేటీ

కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో వైసీపీ ఎంపీలు సమావేశమయ్యారు. ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టం హామీలను అమలు చేయాలని కోరారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మిథున్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డి, వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

### రాజ్యసభ నుంచి బయటకు వెళ్లిన కేవీపీ



కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రారావు మనస్తాపానికి గురై రాజ్యసభ నుంచి బయటకు వెళ్లిపోయారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందంటూ కేవీపీ ప్లకార్డు పట్టుకుని వెల్‌లోకి వెళ్లారు. వెనక్కు వెళ్లాల్సిందిగా రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు సూచించగా ఆయన వినలేదు. కేవీపీ ప్రవర్తనను తాము సమర్థించబోమని విపక్ష నేత ఆజాద్ అన్నారు. దీంతో కేవీపీకి కాంగ్రెస్ సభ్యుల మద్దతు లభించలేదు. వెల్‌లో నుంచి వెనక్కు వెళ్లాలని, లేదా రాజ్యసభ నుంచి బయటకు వెళ్లాల్సి ఉంటుందని వెంకయ్య నాయుడు హెచ్చరించారు. దీంతో కేవీపీ రాజ్యసభ నుంచి బయటకు వచ్చేశారు.

# జోరుగా రాజధాని రోడ్లు

- డిసెంబరుకల్లా మౌలిక వసతులు పూర్తి
- వచ్చే నెలలో అసెంబ్లీ నమూనాలు
- వేగంగా క్వార్టర్స్ పనులు: నారాయణ



అమరావతి, ఫిబ్రవరి 7 (మనం ప్రతినిధి): రాజధాని ప్రాంతంలో రహదారులకు సంబంధించిన పనులు వేగంగా సాగుతున్నాయని మంత్రి నారాయణ తెలిపారు. ఈ ఏడాది డిజెంబరు కల్లా అమరావతిలో అన్ని మౌలిక వసతులను పూర్తి చేస్తామని చెప్పారు. రోడ్లు, డ్రైనేజీ, కేబుల్ వైర్ల ఏర్పాటు, ఇతర సౌకర్యాల కల్పనకు సంబంధించిన పనులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. బుధవారం రాజధాని ప్రాంతంలో జరుగుతున్న రోడ్ల పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం వెలగపూడిలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుల నుంచి భూములు తీసుకున్న సమయంలోనూ మూడేళ్లలోపు రాజధానిలో మౌలిక వసతులు పూర్తి చేస్తామని సీఎం స్పష్టం చేశారన్నారు. సింగపూర్ ప్రభుత్వం ఇచ్చిన మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా రాజధానిలో 320 కిలోమీటర్లలో రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 34 రోడ్ల పనులను వేగంగా చేస్తున్నామని చెప్పారు. 24 రోడ్లకు సంబంధించి పనులు సాగుతున్నాయని, మిగతా పదింటికి టెండర్ల ప్రక్రియ వచ్చే నెల మొదటి వారంలో పూర్తి చేస్తామని ప్రకటించారు. రాజధానికి 29 గ్రామాల్లోనూ మౌలిక వసతులు పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఇక నుంచి ప్రతి వారం మూడుసార్లు రోడ్ల పనులను ప్రత్యక్షంగా పరిశీలించాలని అధికారులకు ఆదేశలిచ్చారు. అలాగే ప్రతి వారం ఒకసారి తానే స్వయంగా రోడ్లను పరిశీలిస్తానని చెప్పారు. కాగా, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, ఎన్‌జీవోల కోసం రాజధానిలో నిర్మిస్తున్న 3840 క్వార్టర్ల నిర్మాణం వేగంగా జరుగుతున్నట్లు మంత్రి నారాయణ చెప్పారు. ఈ క్వార్టర్స్‌ను ఏడాది చివరికల్లా అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. అలాగే అసెంబ్లీ, హైకోర్టు భవనాలకు సంబంధించిన పూర్తి నమూనాలను నార్మన్ పోస్టర్స్ సంస్థ వచ్చే నెలలో ఇవ్వనుందన్నాని ఆయన వెల్లడించారు.

# ప్రభుత్వాస్పత్రిపై నమ్మకం పెరగాలి

- వైద్యానికి ప్రజలు ధైర్యంగా రావాలి
- కార్పొరేట్‌కు దీటుగా సేవలు: కామినేని
- జీజీహెచ్‌లో నూతన భవనానికి రూ.65 కోట్లు
- 30 కోట్లు విరాళమిచ్చిన పూర్వ విద్యార్థులు



గుంటూరు, ఫిబ్రవరి7 (మనం ప్రతినిధి): ప్రజల్లో ప్రభుత్వాస్పత్రిపై నమ్మకం పెరగాలని, వారు వైద్యం కోసం ధైర్యంగా ఇక్కడికే రావాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు. కార్పొరేట్‌కు దీటుగా సర్కారు ఆస్పత్రుల్లో సేవలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. అందుకు తన మోకీలు శస్త్రచికిత్సే నిదర్శనమని, తాను గుంటూరు జీజీహెచ్‌లో ఆపరేషన్ చేయించుకున్నానని, ఆ తర్వాత కొన్నాళ్లకు తిరుమలకు కాలినడకన వెళ్లానని వివరించారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు జీజీహెచ్ అభివృద్ధికి తమ వంతు సాయం అందిస్తామని ముందుకొచ్చారని చెప్పారు. ఇందులో భాగంగా వారు ఆర్థిక సాయం అందించడానికి సంబంధించి బుధవారం ప్రభుత్వంతో ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం అనంతరం కామినేని మీడియాతో మాట్లాడారు. జీజీహెచ్‌లో నూతన మాతా శిశు వైద్యశాల భవనానికి ఆర్థిక సాయం అందించేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ భవన నిర్మాణానికి మొత్తం రూ.65 కోట్ల ఖర్చు అవుతుందని, ఇందులో రూ.30 కోట్ల పూర్వ విద్యార్థులు అందించనున్నట్లు కామినేని పేర్కొన్నారు. గతంలో ఆడిటోరియానికి, పొదిలి ప్రసాద్ మిలీనియం బ్లాక్ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించారని గుర్తు చేశారు. దేశంలో మరెక్కడా ఈ తరహా సాంప్రదాయం లేదని, తొలిసారిగా గుంటూరు వైద్య కళాశాల పూర్వవిద్యార్థులే దీనికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఆస్పత్రిలో మొత్తం సుమారుగా 640 పడకలు ఏర్పాటు చేయబోతున్నామని, ఐదంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నామని చెప్పారు. అలాగే ఆస్పత్రిలో నూతనంగా రోగుల సహాయకుల కోసం భవన నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. త్వరలో రక్షిత మంచినీరు, ఎంఆర్ఐ స్కానింగ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు.

## ఏపీలో వరి వంగడాల పరిశోధన కేంద్రం

- 'ఐఆర్ఆర్ఐ' సూత్రప్రాయ అంగీకారం
- ఫిలిప్పీన్స్‌లో మంత్రి సోమిరెడ్డి ఒప్పందం

అమరావతి, ఫిబ్రవరి 7 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో వరి ఉత్పాదకతను పెంచటంతోపాటు వివిధ రకాల పరిస్థితులను తట్టుకొనే కొత్త వంగడాలను అభివృద్ధికి పరిశోధన కేంద్రం ఏర్పాటు కాబోతోంది. ఫిలిప్పీన్స్‌కు చెందిన అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ (ఐఆర్ఆర్ఐ) రాష్ట్రంలో పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. రాష్ట్రంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో దీన్ని పెట్టేందుకు ఐఆర్ఆర్ఐ డైరెక్టర్ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. ఫిలిప్పీన్స్‌లో పర్యటిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బృందం బుధవారం ఐఆర్ఆర్ఐ సంస్థను సందర్శించింది. ఈ సందర్భంగా ఐఆర్ఆర్ఐ డైరెక్టర్ మాథ్యూ మోరెల్, డిప్యూటీ డైరెక్టర్ జాక్విలైన్‌తో వీరు చర్చించి ఒప్పందం కుదుర్చుకున్నారు. వరి ఉత్పాదకతను పెంపు, వరి ఆధారిత పంటల వ్యవస్థ అభివృద్ధి, వరి కోత అనంతరం వచ్చే నష్టాల తగ్గింపు, చౌడు పొలాల్లో ఉప్పునీటినీ తట్టుకునే వంగడాల వృద్ధి, గ్రీన్ సూపర్ రైస్ అభివృద్ధి తదితర లక్ష్యాలతో ఈ సంస్థ పనిచేస్తుంది. ఇప్పటి వరకు దేశంలోని ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో మాత్రమే ఇది ఉండగా.. దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు కానుంది. మార్చి నెలలో వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులకు ఐఆర్ఆర్ఐ ఆధ్వర్యంలో శిక్షణ కార్యాక్రమాన్ని నిర్వహించనున్నారు.

## 'షూటింగ్'లో ఏపీ పోలీస్ సత్తా

- ఆలిండియా చాంపియన్‌షిప్‌లో 5 పతకాలు
- స్వర్ణం కైవసం చేసుకున్న ఆక్టోపస్ పోలీసు
- అభినందించిన డీజీపీ మాలకొండయ్య

అమరావతి, ఫిబ్రవరి 7(మనం ప్రతినిధి): అఖిల భారత పోలీసు షూటింగ్ చాంపియన్‌షిప్ (స్పోర్ట్స్ ఈవెంట్)లో ఏపీ సత్తా చాటింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జనవరి 29 నుంచి ఫిబ్రవరి 2 వరకు బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో రాష్ట్ర పోలీసులు ఒక బంగారు పతకం, ఒక రజత పతకం, మూడు కాంస్య పతకాలను సాధించారు. వ్యక్తిగత విభాగంలో 50 మీటర్ల షూటింగ్ పోటీలో ఆక్టోపస్ వింగ్‌కు చెందిన ఎం.కృష్ణ బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే 300 మీటర్ల (వ్యక్తిగత) షూటింగ్‌లో ఒక రజత పతకాన్ని, 300 మీటర్ల (బృందం) ఒక కాంస్యాన్ని ఆయన ఖాతాలో వేసుకున్నారు. గ్రేహౌండ్స్‌కు చెందిన పి.వి.రవీంద్ర 300 మీటర్ల బృంద విభాగంలో ఒక కాంస్య పతకాన్ని, ఆక్టోపస్ నుంచి వై.భరత్‌కుమార్ ఒక కాంస్య పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా షూటింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వీరిని రాష్ట్ర డీజీపీ మాలకొండయ్య బుధవారం అభినందించారు. మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో వారికి అభినందనలు తెలిపిన డీజీపీ.. శాఖాపరంగా తగిన ప్రోత్సాహం ఉంటుందని చెప్పారు.


## అది రాజకీయ నిర్ణయం

- విశాఖ రైల్వేజోన్ అంశంపై వాల్తేర్ డీఆర్ఎం ముకుల్

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (మనం న్యూస్ బ్యూరో): విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు రాజకీయ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని వాల్తేర్ డివిజన్ రైల్వే మేనేజర్ ముకుల్ శరణ్ అన్నారు. దీనిపై తాము వ్యాఖ్యానించబోమని చెప్పారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే జోనులో వాల్తేర్ డివిజన్ నుంచి రూ.7 వేలకోట్ల ఆదాయం వస్తోందని చెప్పారు. ఈ జోన్‌పై ఏటా రూ.2500 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. డివిజన్ పరిధిలో మర్రిపాలెం, పెందుర్తి స్టేషన్లను ఆదర్శ రైల్వేస్టేషన్లుగా అభివృద్ధి చేయనున్నట్లు ముకుల్ పేర్కొన్నారు. సిగ్నలింగ్ టెలికమ్యూనికేషన్ కోసం రూ.85 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. డిమాండ్ ఆధారంగానే కొత్త రైళ్ల కేటాయింపు ఉంటుందన్నారు.

# 200 కోట్లు దూరం!

- ఎన్నికలు నిర్వహించకపోవడంతో జీవీఎంసీ నిధులు కోల్పోయే దుస్థితి
- ఆగిన 100 కోట్ల ఆర్థిక సంఘం నిధులు
- 100 కోట్ల అమృత్ నిధులకు అదే స్థితి




విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (మనం న్యూస్ బ్యూరో): టీడీపీ ప్రభుత్వం నిర్వాకం వల్ల విశాఖ నగరం 200 కోట్ల రూపాయల నిధులను కోల్పోయే పరిస్థితి వచ్చింది. మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ)కు ఎన్నికల నిర్వహించకపోవడంతో వంద కోట్ల రూపాయల 14వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. అలాగే మరో వంద కోట్ల రూపాయల 'అమృత్' పథకం నిధులు ఆగిపోయే పరిస్థితి ఏర్పడింది. జీవీఎంసీకి ఎన్నికలు జరిగితే తమ పరపతి ఎక్కడ కోల్పోతామో అన్న భయంతో టీడీపీ శాసనసభ్యులే ఎన్నికల ప్రక్రియను అడ్డుకున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఎన్నికలు నిర్వహిస్తే ప్రతికూల ఫలితాలు వస్తాయని నివేదికలిచ్చి, తమ స్వార్థం కోసం ఆపించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా నగరానికి రావాల్సిన నిధులు ఆగిపోయాయి. జీవీఎంసీ పాలక మండలి గడువు ముగిసి ఆరు సంవత్సరాలైంది. ఎన్నికలు నిర్వహించని కారణంగా వందల కోట్ల రూపాయల కేంద్ర ప్రభుత్వ నిధులు, ఇతర సదుపాయాలు చేజారుతున్నాయి. ఎన్నికైన పాలకవర్గం లేని స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్లపాటు వేచి చూస్తుంది. అప్పటికీ పాలక పక్షం ఏర్పాటు కాకపోతే ఐదో ఏట నుంచి నిధులను నిలిపివేస్తుంది. ఈ నిబంధన కింద 2017-18 సంవత్సరానికి సంబంధించి రూ.100 కోట్ల నిధుల విడుదల ఆగిపోయింది. జీవీఎంసీ ప్రత్యేకాధికారి పాలనను మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఇటీవలే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 2018-19 సంవత్సరానికి కూడా నిధులు నిలిచిపోయే పరిస్థితి వచ్చింది. సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోతే నిధులు మంజూరు చేయడం సాధ్యం కాదని కేంద్రం పదే పదే చెబుతున్నా ఇక్కడి పాలకులు పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి తలెత్తింది. కేంద్ర ప్రభుత్వ పథకం అమృత్ కింద ఏటా వంద కోట్ల రూపాయలను విడుదల చేస్తున్నారు. జీవీఎంసీకి పాలకవర్గం లేని కారణంగా ఈ నిధులను కూడా నిలిపివేయనున్నట్లు ఏ క్షణంలో అయినా సమాచారం రావచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన విషయాల్లో క్రమశిక్షణ పాటిస్తూ స్వచ్ఛ ర్యాంక్‌లలో కూడా ముందున్న జీవీఎంసీ.. కేవలం ఎన్నికలు నిర్వహించని కారణంగా రెండు వందల కోట్ల రూపాయల నిధులను కోల్పోతుండడంతో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఇటీవలే రూ.3000 కోట్ల పైచిలుకు బడ్జెట్‌ను ఆమోదింపజేసిన అధికారులకు కేంద్ర నిధుల నిలిపివేత పెద్ద శాపంగా మారింది. కోర్టుల్లో కేసులున్న కారణంగానే ఎన్నికలు సకాలంలో నిర్వహించ లేకపోయామని కేంద్రానికి విన్నవించడం ద్వారా ఉపశమనం పొందే ప్రయత్నం చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

## ఏసీబీకి చిక్కిన అటవీ అధికారి

- టింబర్ డిపో ఓనర్ నుంచి 20 వేలు లంచం



కాకినాడ, ఫిబ్రవరి 7 (మనం న్యూస్ బ్యూరో): టింబర్ డిపో యజమాని నుంచి రూ.20 వేల లంచం తీసుకుంటూ అటవీ అధికారి ఏసీబీకి చిక్కాడు. కాకినాడలోని ఒంటిమామిడి అటవీ పరిధిలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న గౌతమ్ వర ప్రసాద్ స్థానిక టింబర్ డిపో విషయమై దాని యజమాని పార్థసారధిని లంచం డిమాండ్ చేశాడు. రూ.20 వేలకు బేరం కుదుర్చుకున్నాడు. దీంతో పార్థసారధి ఏసీబీని ఆశ్రయించాడు. బుధవారం గౌతమ్ ఇంటి వద్ద లంచం తీసుకుంటుండగా పక్కా ఆధారాలతో ఏసీబీ అధికారులు అతడిని పట్టుకున్నారు.




## భార్య ఆత్మహత్య.. గుండెపోటుతో భర్త మృతి

- అనాథలైన ముగ్గురు పిల్లలు

పెళ్లకూరు, ఫిబ్రవరి 7 (మనం న్యూస్): కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది భార్య ఆత్మహత్యకు పాల్పడగా.. ఈ వార్త విని భర్త గుండెపోటుతో మరణించాడు. వీరి మరణంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం పెళ్లకూరు మండలం కానూరురాజుపాళెం గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గోవా గోపి (42) భార్య చనిపోవడంతో వాకాడుకు చెందిన అక్క కుమార్తె సురేఖ (25)ను రెండో వివాహం చేసుకున్నాడు. ఆయనకు మొదటి భార్యతో ఇద్దరు పిల్లలు ఉన్నారు. గోపి, సురేఖకు ఓ పాప జన్మించింది. మొదట్లో వీరి కాపురం సవ్యంగా సాగినా కొంతకాలంగా వీరిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నట్టు సమాచారం. మంగళవారం సురేఖ గన్నేరు కాయలు తిని ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెను నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం మరణించింది. ఆ వార్త తెలియగానే గోపి గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

## మత్స్యకారులకు మద్దతు ఉపసంహరించుకో

- లేకుంటే సిక్కోలు పర్యటన అడ్డుకొంటాం
- పవన్‌కు గిరిజన ఐక్య వేదిక హెచ్చరిక




విశాఖపట్నం, ఫిబ్రవరి 7 ( మనం న్యూస్‌బ్యూరో): ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ మత్స్యకారులు చేస్తున్న ఉద్యమానికి జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మద్దతు ఉపసంహరించుకోవాలని గిరిజన ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారంలోపు పవన్ నుంచి ప్రకటన రాకపోతే ఆయన చేపట్టనున్న శ్రీకాకుళం పర్యటను అడ్డుకొంటామని హెచ్చరించింది. విశాఖలోని గిరిజన భవన్‌లో బుధవారం గిరిజన ఐక్యవేదిక జాతీయాధ్యక్షుడు వివేక్ వినాయక్ ఇతర గిరిజన సంఘాల నేతలతో మీడియాతో మాట్లాడారు. మత్స్యకారులకు పవన్ కల్యాణ్ ఇచ్చిన మద్దతును ఉపసంహరించుకొనేందుకు ఈ నెల 10 వరకు గడువు ఇస్తున్నామని, ఆలోగా సానుకూల స్పందన రాకపోతే ఆయనకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వివేక్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 15న అన్ని జిల్లా కేంద్రాల్లో పవన్ దిష్టిబొమ్మలను దగ్ధం చేస్తామని, 19న అన్ని కలెక్టరేట్‌ల ఎదుట నిరసనలు, 21 న మన్యం బంద్‌కు పిలుపునిస్తున్నామని చెప్పారు. ఈ నెల 11న గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర సమావేశంలో భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తామని చెప్పారు.




# దుర్గ గుడి ప్రక్షాళన షురూ

- పూజలు జరిగే ప్రాంతాల్లో మార్పు
- ఆలయ ఈవో పద్మ


విజయవాడ, ఫిబ్రవరి 7 (మనం న్యూస్): విజయవాడ శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ప్రక్షాలనకు చర్యలు తీసుకుంటున్నామని ఈవో పద్మ తెలిపారు. దేవస్థాన కమిటీ, వైదిక కమిటీ సభ్యులతో చర్చించి ఆలయంలో పలు సంస్కరణలు చేపడుతున్నట్లు చెప్పారు. బుధవారం సమావేశమై ఏకాభిప్రాయంతో కొన్ని నిర్ణయాలను తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. దేవస్థానంలో కొన్ని పూజలు జరిగే ప్రాంతాల్లో మార్పులు చేస్తున్నట్లు ప్రకటించారు. వైదిక కమిటీ సలహా మేరకు శాంతి కల్యాణం, అమ్మవారి కుంకుమార్చన మండం, వేదాశ్వీరచనం, అష్టోత్తరం, సహస్రనామ పూజలు, నవగ్రహ హోమం, రుద్ర హోమం వంటివి నిర్వహించే ప్రాంతాల్లో మార్పు చేసేందుకు దేవాదాయ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపుతున్నామని చెప్పారు. అలాగే భక్తులు దేవస్థాన రాజగోపురం మార్గం గుండా అమ్మవారి దర్శనం కల్పించే అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. కాగా, ఆలయంలోని శివాలయంలో జీర్ణోద్ధారణ కార్యక్రమాలు జగురుతున్నందున మహాశివరాత్రి సందర్భంగా ఎటువంటి ప్రత్యేక పూజలు ఉండవని చెప్పారు. బాలాలయంలో సాధారణ పూజలు, 15న రథోత్సవం యథావిధిగా ఉంటాయని వివరించారు.





| పెరిగినవి | % | తగ్గినవి | % |
|---|---|---|---|
| కోల్ ఇండియా | 2.48 | భారతీ ఎయిర్‌టెల్ | -2.03 |
| ఓఎన్‌జీసీ | 2.24 | విప్రో | -1.85 |
| ఏసియన్ పెయింట్స్ | 0.91 | ఎల్ అండ్ టి | -1.58 |
| టాటా మోటార్స్ | 0.81 | యస్ బ్యాంకు | -1.58 |
| డాక్టర్ రెడ్డీస్ | 0.79 | హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు | 1.37 |




| పెరిగినవి | % | తగ్గినవి | % |
|---|---|---|---|
| అంబుజా | -2.74 | హెచ్.పి.సి.ఎల్ | 4.97 |
| భారతీ ఎయిర్‌టెల్ | -2.03 | అరబిందో | 3.23 |
| భారతీ ఇన్‌ఫ్రా | -1.86 | కోల్ ఇండియా | 2.50 |
| వేదాంత | -1.85 | ఓఎన్‌జీసీ | 2.45 |
| విప్రో | -1.80 | టాటా పవర్ | 2.29 |




## టాప్ లూజర్స్

34,082.71 — 7 ఫిబ్రవరి

| పాయింట్లు | | % |
|---|---|---|
| 429.85 | భారతీ ఎయిర్‌టెల్ | -2.03% |
| 289.45 | విప్రో | -1.85% |
| 1332.65 | లార్సెన్ టూబ్రో | -1.58% |
| 333.20 | యస్ బ్యాంకు | -1.58% |
| 1871.40 | హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు | -1.37% |
| 2955.35 | టీసీఎస్ | -1.34% |
| 1313.50 | హెచ్.యు.ఎల్ | -1.11% |
| 558.70 | యాక్సిస్ బ్యాంకు | -0.96% |
| 747.10 | ఎం అండ్ ఎం | -0.96% |
| 8919.90 | మారుతి సుజుకి | -0.72% |

బి.ఎస్.ఇ సెన్సెక్స్ -113.23



# ద్రవ్య లోటుతో రిస్కు

ముంబయి: ద్రవ్య లోటును తగ్గించుకుని, అనుకున్న స్థాయికి అదుపులోకి తీసుకొచ్చేందుకు రూపొందించుకున్న ప్రణాళికలో జాప్యం పట్ల రిజర్వ్ బ్యాంక్ ఆందోళన వ్యక్తం చేసింది. ''గణనీయంగా పక్కదారిపట్టడం, లక్ష్యానికి చేరుకోలేకపోవడం వల్ల, ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడానికి సంబంధించిన లక్ష్యాలు నెరవేర్చడంలో ''సమస్యలు'' తలెత్తుతాయని ఆర్.బి.ఐ హెచ్చరించింది. ద్రవ్యోల్బణం 4 శాతం మించకుండా చూడాలన్న లక్ష్యాన్ని సాధించడానికి తోడ్పడే విధంగా ద్రవ్య లోటుపై వైఖరిని నిర్ణయించుకోవడం ముఖ్యమని పేర్కొంది. ''(ద్రవ్యలోటు లక్ష్యాల) నుంచి గణనీయంగా పక్కకు వైదొలగడం, వాయిదా వేయడం వల్ల మున్ముందు పరిస్థితులను మరింత సమస్యాయుతం చేసే అవకాశం ఉంది'' అని ఆర్.బి.ఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ అన్నారు. ద్రవ్యోల్బణంపై ఉర్జిత్ పటేల్ నేతృత్వంలో నియమించిన కమిటీ ద్రవ్య లోటును 2019 నాటికి 3 శాతానికి తీసుకురావాలని సిఫార్సు చేసింది. మధ్యకాలంలో ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి కూడా ఆర్.బి.ఐ లక్ష్యంగా పెట్టుకుంది. ఆ రకమైన నివేదికను తయారు చేసిన తర్వాత, 2014 నుంచి ద్రవ్య లోటు ''తిరోగమన పథంలో'' ఉందని ఉర్జిత్ అన్నారు. ఆ తర్వాత నుంచి ద్రవ్య విధానం మరింత సరళమైనదిగా తయారైందని కూడా ఆయన అన్నారు. అయితే, ''ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి తగ్గించే లక్ష్యానికి తోడ్పడగల ద్రవ్య విధానం అవసరం'' అని ఆయన వ్యాఖ్యానించారు. ద్రవ్య లోటు నుంచి రిస్కు మూడు వైపుల నుంచి ఉందని ఆయన చెప్పారు. ఒకటి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటు 3.2 శాతం మించకుండా చూసుకోవాల్సి ఉండగా, ప్రభుత్వం అది 3.5 శాతంగా ఉండగలదని చెబుతోంది. రెండు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ద్రవ్య లోటు వ్యత్యాస లక్ష్యం ఇంతకుముందు అనుకున్నట్లుగా 3 శాతంగా కాక, 3.2 శాతంగా ఉన్నా ఫరవాలేదని ప్రభుత్వం తృప్తిపడడం. మూడు. ఇది విస్తృతమైనది. ముఖ్యమైనది. అది ఏమంటే, ''మధ్యకాలిక సర్దుబాటును వాయిదా వేయడం''. దీనివల్ల ద్రవ్య లోటును 3 శాతానికి తీసుకురావడం 2020–21 ఆర్థిక సంవత్సరంలో మాత్రమే సాధ్యం కాగలదని అనిపిస్తోందని ఉర్జిత్ అన్నారు. అంటే, లక్ష్య సాధనలో మూడేళ్ళ జాప్యం చోటుచేసుకుంటున్నట్లు లెక్క.

# యథాతథ స్థితికే ఆర్బీఐ మొగ్గు

## మారని రెపో రేటు 6%

**ఈ ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 5.1 శాతంగా ఉండగలదని, వచ్చే ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో అది తగ్గవచ్చని వెల్లడించింది**



ముంబయి: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్.బి.ఐ) యథాతథ స్థితిని కొనసాగించాలని కీలక వడ్డీ రేటు, రెపో రేటును 6 శాతం వద్దనే ఉంచాలని నిర్ణయించింది. కడచిన పరపతి విధాన సమీక్షా సమావేశాలు రెండింటిలో కూడా కేంద్ర బ్యాంక్ ఇదే విధమైన వైఖరిని అనుసరించింది. అది చివరిసారిగా 2017 ఆగస్టు సమావేశంలో మాత్రమే వడ్డీ రేట్లను కొద్దిగా తగ్గించింది. ఆర్.బి.ఐ ద్రవ్య విధాన కమిటీ ఈ ఆర్థిక సంవత్సరంలో ఆరవ ద్వైమాసిక సమావేశాన్ని మంగళ, బుధవారాలలో నిర్వహించింది. ఈ నిర్ణయాన్ని కమిటీలో ఐదుగురు సమర్థించగా ఒకరు వ్యతిరేకించారు. యథాతథ స్థితి కొనసాగించడానికి డాక్టర్ చేతన్ ఘటే, డాక్టర్ పమీ దువా, డాక్టర్ విరాల్ వి. ఆచార్య, డాక్టర్ ఉర్జిత్ ఆర్. పటేల్, డాక్టర్ రవీంద్ర ధోలాకియా సుముఖత వ్యక్తం చేయగా, డాక్టర్ మైకేల్ పాత్రా మాత్రం 25 బేసిస్ పాయింట్లు పెంచాలని అభిప్రాయపడ్డారు. వడ్డీ రేట్లలో మార్పు ఏదీ ఉండబోదని మార్కెట్‌లో వ్యక్తమైన ఏకాభిప్రాయానికి అనుగుణంగానే ద్రవ్య విధాన కమిటీ (ఎం.పి.సి) నిర్ణయం వెలువడింది.

### తగ్గిన ఆర్థిక వృద్ధి అంచనా

స్థూల విలువ జోడింపు (జి.వి.ఏ) ఇంతకుముందు అంచనా వేసినదానికన్నా కొద్ది తక్కువగా 6.6 శాతం మేరకు ఉండగలదని ఎం.పి.సి తాజాగా అంచనా వేసింది. జి.వి.ఏని స్థూల జాతీయోత్పత్తి గణన యూనిట్‌గా చూస్తారు. ఈ రెండూ ఉత్పత్తిని తెలిపే కొలబద్దలే అయినప్పటికీ వాటి మధ్య కొద్ది తేడా ఉంది. జి.డి.పికి సబ్సిడీలను కలిపి దాని నుంచి ప్రత్యక్ష పన్నులను, అమ్మకాల పన్నులను తీసివేయగా వచ్చేది జి.వి.ఏ. మరో విధంగా చెప్పాలంటే, జి.వి.ఎకి ఉత్పత్తులపై పన్నులు కలిపి దాని నుంచి ఉత్పత్తులపై సబ్సిడీలను తీసివేయగా వచ్చేది జి.డి.పి అవుతుంది. వర్తమాన సంవత్సరాన్ని అలా ఉంచితే, ఆర్థిక వృద్ధిపై అంచనాలను వివిధ అంశాలు ప్రభావితం చేశాయి. మొదటగా, జి.ఎస్.టి అమలు స్థిరీకరణ పొందుతోంది. ఇది ఆర్థిక కార్యకలాపాలకు శుభ సూచకం. రెండు. పెట్టుబడి కార్యకలాపాలలో పునరుద్ధరణకు సంబంధించిన తొలి సంకేతాలు కనిపిస్తున్నాయి. రుణాల స్వీకరణ మెరుగుపడడంలో అది ప్రతిబింబిస్తోంది. ప్రాథమిక క్యాపిటల్ మార్కెట్ నుంచి పెద్దయెత్తున వనరుల సమీకరణ జరగడం, యంత్రాలు, యంత్ర పరికరాల ఉత్పత్తి, దిగుమతులు మెరుగుపడడం కూడా దానికి సంకేతాలు. మూడు. ప్రభుత్వ రంగ బ్యాంకుల పునర్ మూలధనీకరణ ప్రక్రియ మొదలైంది. పెద్ద మొత్తాలలో బకాయిలు పడ్డ కంపెనీలను ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్సీ కోడ్ (ఐ.బి.సి) కింద పరిష్కారానికి పంపుతున్నారు. ఇది రుణ ప్రవాహాలను మెరుగుపరచి, కొత్త పెట్టుబడులకు డిమాండ్ సృష్టిస్తుంది. నాలుగు. అంతర్జాతీయంగా డిమాండ్ మెరుగుపడడం వల్ల ఎగుమతులలో వృద్ధి కూడా మెరుగుపడుతుందని భావిస్తున్నారు. కానీ, పెరిగిన వస్తువుల ధరలు, ముఖ్యంగా ముడి చమురు ధరలు పెరిగితే, సగటు డిమాండ్ కొంత వెనుకపట్టు పట్టవచ్చు.


ఎగువ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే, 2018–19 సంవత్సరానికి జి.వి.ఏలో వృద్ధి 7.2 శాతంగా ఉండగలదని అంచనా. మొత్తంమీద, గరిష్ఠంగా 7.3–7.4 శాతంగా, కనిష్ఠంగా 7.1–7.2 శాతంగా ఉండగలదని, రిస్కులు సమానంగా ఉంటాయని భావిస్తున్నారు.

### ద్రవ్యోల్బణంపై అంచనాలు

ఈ ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 5.1 శాతంగా ఉండగలదని ఆర్.బి.ఐ అంచనా వేసింది. మునుపటి డిసెంబర్ సమావేశంలో అది 4.3–4.7 శాతంగా ఉండగలదని వేసిన అంచనాలకన్నా ఇది గణనీయంగా హెచ్చుగా ఉంది. వాస్తవిక రిటైల్ ద్రవ్యోల్బణం డిసెంబర్‌లో అప్పటికి 17 నెలల గరిష్ఠ స్థాయిలో, 5.2 శాతంగా ఉంది. అది ఆర్.బి.ఐ పెట్టిన 4 శాతం లక్ష్యంకన్నా ఎక్కువగా ఉంది. ''వాస్తవిక ఫలితాలను పరిశీలిస్తే, వినియోగదార్ల ధరల సూచి (సి.పి.ఐ) ద్రవ్యోల్బణం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యూ 3లో సగటున 4.6 శాతంగా ఉంది. నవంబరులో అసాధారణంగా పెరిగిన ఆహార ధరలు ఆ పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచాయి. డిసెంబర్‌లో ధరలు సడలినప్పటికీ, శీతాకాలంలో ఓ మోస్తరుగా ఉండాల్సిన ఆహార ధరలు అలా లేవని చెప్పాలి'' అని ఆర్.బి.ఐ పేర్కొంది. పెట్రోలు పంపుల వద్ద పెట్రోలు, డీజిలు ధరలు తీవ్రంగా పెరిగాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరల్లో కొంతకాలంగా వస్తున్న పెరుగుదలలను అవి ప్రతిబింబించాయి.

చిల్లర ద్రవ్యోల్బణం 2018–19లో మొదటి ఆరు నెలల్లో 5.1–5.6 శాతంగా ఉండగలదని ఆర్.బి.ఐ పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల గణాంక హెచ్.ఆర్.ఎ ప్రభావం తగ్గిపోతూండడాన్ని కూడా లెక్కలోకి తీసుకున్నట్లు తెలిపింది. హెచ్‌టూలో అది 4.5–4.6 శాతంగా ఉండగలదని తెలిపింది. పటిష్ఠమైన సానుకూల బేస్ ప్రభావాల కారణంగా వచ్చే ఆర్థిక సంవత్సరం ద్వితీయ భాగంలో ద్రవ్యోల్బణం మితంగా ఉండగలదని తెలిపింది. ఏడవ కేంద్ర వేతన సంఘం (సి.పి.సి) హెచ్.ఆర్.ఎ ప్రభావం చెదిరిపోతుందని తెలిపింది. సాధారణ వర్షపాతం నమోదు కాగలదని, ప్రభుత్వ సరఫరా నిర్వహణ సమర్థంగా ఉండగలదనే భావనతో, ఆహార ద్రవ్యోల్బణం మితంగానే ఉండగలదని అంచనా వేస్తున్నట్లు ఆర్.బి.ఐ ప్రకటన తెలిపింది. గత వారం వెలువడిన కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలతో రానున్న ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం అధికంగా ఉండగలదని మార్కెట్లలోని వారు భావించారు. రైతులకు కనీస మద్దతు ధరలు పెంచుతామని ప్రభుత్వం చెప్పింది. సర్వ ఆరోగ్య రక్షణ పథకాన్ని ప్రకటించింది.

**రిస్కులు:** గ్రామీణ ప్రాంతాలు, మౌలిక వసతులకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వడాన్ని ఆర్.బి.ఐ స్వాగతించింది. ప్రభుత్వ ఖర్చులు పెరిగి, రాబడులు క్షీణించడం వల్ల, ప్రైవేటు ఫైనాన్స్, పెట్టుబడుల కార్యకలాపాలు మందగించవచ్చని హెచ్చరించింది.






## జె.ఎల్.ఆర్ అమ్మకాలు 3 శాతం జంప్

న్యూఢిల్లీ: టాటా మోటార్స్ యాజమాన్యంలోని జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జె.ఎల్.ఆర్) అంతర్జాతీయ అమ్మకాలు 3 శాతం పెరిగి జనవరిలో 49,066 యూనిట్లుగా నిలిచాయి. ల్యాండ్ రోవర్ శ్రేణి 35,000 యూనిట్ల అమ్మకాలు నమోదు చేసింది. చైనాలో కొనసాగుతున్న డిమాండ్ ప్రోత్సాహకరంగా ఉందని జె.ఎల్.ఆర్. గ్రూప్ అమ్మకాల విభాగ డైరెక్టర్ యాండీ గాస్ చెప్పారు. అయితే, బ్రిటన్, ఐరోపా మార్కెట్లలోని కఠిన ట్రేడింగ్ పరిస్థితుల వల్ల ఇప్పటికీ సవాళ్ళు ఎదుర్కొంటున్నట్లు ఆయన తెలిపారు. ఫలితంగా బ్రిటన్‌లో 4 శాతం, ఐరోపాలో 9 శాతం అమ్మకాలు తగ్గినట్లు ఆయన తెలిపారు. కానీ, మెక్సికో, ఇండియా, బ్రెజిల్ తదితర విదేశీ మార్కెట్లలో మరిన్ని సానుకూల ఫలితాలు కనిపించి అమ్మకాలు 9 శాతం పెరిగి 6,551 యూనిట్లకు చేరాయని ఆయన చెప్పారు.

## మాల్స్‌లో ఖాదీ విక్రయం

న్యూఢిల్లీ: పెద్ద పెద్ద రిటైల్ స్టోర్సులు ఇకపై డిజైనర్ ఖాదీ దుస్తులు విక్రయించేందుకు కొంత ప్రదేశాన్ని కేటాయించవచ్చు. ఈ స్వదేశీ వస్త్రాన్ని సమరశీల ధోరణిలో మార్కెట్ చేసి, సామాన్య ప్రజానీకంలో దానికి ఆదరణను పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనివల్ల హస్తకళాకారుల ఆదాయం పెరిగే అవకాశం ఉంది. ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు దాదాపు 800 గ్రామాలను ఖాదీ క్లస్టర్లుగా మార్చనున్నట్లు మధ్య, చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమల శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ చెప్పారు. ఖాదీని ఖాదీ భవన్ నుంచి బయటకు తీసుకొచ్చి మాల్స్, గొలుసుకట్టు దుకాణాల సంస్థలలోకి తీసుకెళ్ళే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోంది. ''జనం సాధారణంగా ఖాదీని ఫ్యాషన్ కానిదిగా, పాత తరం వారు వేసుకునేది చూస్తారు. (ముంబయిలో) బిగ్ బజార్, పాంటాలూన్స్, డబ్ల్యు, గ్లోబస్ వంటి 30 రిటైల్ చైన్లతో మేం చర్చలు జరిపాం. ఫలితంగా, ఈ గొలుసుకట్టు దుకాణాల సంస్థలు చాలా వాటిలో డిజైనర్ ఖాదీ దుస్తులకు ప్రత్యేక విక్రయ విభాగాలను మొదటిసారిగా చూడబోతున్నాం. అవి ఖాదీకి మరింత విలువను చేకూరుస్తాయి. ఈ క్రమంలో హస్త కళాకారులకు కూడా సహాయపడినట్లు అవుతుంది'' అని ఎం.ఎస్.ఎం.ఇ కార్యదర్శి అరుణ్ కుమార్ పాండా చెప్పారు.

# వృద్ధి అంచనా తగ్గడంతో జావగారిన ఉత్సాహం



- **నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీలు**

ముంబయి: రిజర్వ్ బ్యాంక్ రెపో రేటును మార్చకుండా 6 శాతం వద్దనే ఉంచాలని నిర్ణయించి, 2017–18 సంవత్సరానికి ఆర్థిక వృద్ధి అంచనాను మాత్రం 6.7 శాతం నుంచి 6.6 శాతానికి తగ్గించడంతో బి.ఎస్.ఇ సెన్సెక్స్ బుధవారం 113 పాయింట్లు క్షీణించిన దశలో ముగిసింది. కేంద్ర బ్యాంక్ వడ్డీ రేటును అలాగే ఉంచుతుందని మదుపరులు చాలా వరకు ఊహించిందే. కానీ, ఆర్.బి.ఐ ఆర్థిక వృద్ధి అంచనాను తగ్గించడం సెంటిమెంట్‌ను బలహీనపరచింది. ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడంతో ట్రేడింగ్ ప్రారంభంలో సెన్సెక్స్ 470 పాయింట్లకు పైగా పెరిగింది. కానీ, మదుపరులు హెచ్చు స్థాయిలలో లాభాల స్వీకరణకు దిగడంతో మళ్ళీ పడిపోయి 34,008.42 పాయింట్ల కనిష్ఠ స్థితికి జారుకుంది. చివరకు సెన్సెక్స్ 113.23 పాయింట్లు క్షీణించి 34,082.71 పాయింట్ల వద్ద ముగిసింది. వరుసగా గత ఆరు సెషన్లలో సెన్సెక్స్ 2,087.31 పాయింట్లు కోల్పోయింది. అదే విధంగా, ఎన్.ఎస్.ఇ నిఫ్టీ కూడా 21.55 పాయింట్లు క్షీణించి 10,476.70 పాయింట్ల వద్ద ముగిసింది. అది ఇంట్రా–డేలో 10,614–10,446.40 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. తాత్కాలిక డాటా ప్రకారం, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు మంగళవారం రూ. 2,326.10 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించగా, దేశీయ మదుపు సంస్థలు రూ. 1,699.74 కోట్ల విలువ చేసే షేర్లను కొనుగోలు చేశాయి.

### తేరుకున్న ప్రపంచ మార్కెట్లు

ప్రపంచ మార్కెట్లలో ట్రేడర్లు కొద్దిగా తేరుకున్నారు. షేర్ల ధరల్లో తీవ్ర హెచ్చు తగ్గుల తర్వాత, డౌ జోన్స్ పటిష్ఠమైన హెచ్చు స్థితిలో ముగిసింది. జపాన్‌కు చెందిన నికాయ్ 0.16 శాతం లాభంతో ముగిసింది. హాంకాంగ్‌కు చెందిన హ్యాంగ్ సెంగ్ 0.89 శాతం క్షీణతను, చైనా షాంఘై ఇండెక్స్ 1.82 శాతం క్షీణతను నమోదు చేశాయి. యూరోపియన్ షేర్లు మంగళవారం ఆరు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయిన తర్వాత, తేరుకున్నాయి. పటిష్ఠమైన ధరల వద్ద తిరిగి లావాదేవీలు ప్రారంభించాయి.

## క్యూ 3లో రూ. 17 వేల కోట్ల సేకరణ

న్యూఢిల్లీ: భారతీయ కంపెనీలు 2017 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికపై షేర్లు జారీ చేయడం ద్వారా రూ. 17,000 కోట్లను సమీకరించాయని భారతీయ సెక్యూరిటీలు, ఎక్స్ఛేంజ్ బోర్డ్ (సెబి) డాటా వెల్లడించింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో అదే కాలంలో సేకరించిన (రూ. 11,531 కోట్ల) నిధులకన్నా 51 శాతం పెరిగినట్లు లెక్క. వ్యాపార విస్తరణ, కొంత అప్పు తీర్చి కొత్తగా అప్పు తీసుకోవడం, చల మూలధన అవసరాలు, ఇతర సాధారణ కార్పొరేట్ ప్రయోజనాలకు ఈ నిధులు సమీకరించారు. లిస్ట్ అయిన కంపెనీలు 2017 డిసెంబర్ 31తో ముగిసిన త్రైమాసికంలో ప్రిఫరెన్షియల్ కేటాయింపు ద్వారా రూ. 17,434 కోట్లు సేకరించాయని సెబి డాటా తెలిపింది.

## లాభాల మేఘాల్లో స్పైస్‌జెట్

ముంబయి: బడ్జెట్ విమానయాన సంస్థ స్పైస్‌జెట్ 2017 డిసెంబరుతో ముగిసిన మూడు నెలల కాలానికి 32 శాతం వృద్ధిని కనబరుస్తూ రూ. 240 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. దీనితో స్పైస్‌జెట్ వరుసగా 12 త్రైమాసికాలలో లాభాలు ప్రకటించినట్లు అయింది. ప్రయాణికుల నుంచి రాబడులు అధికమవడం లాభాలకు తోడ్పడింది. స్పైస్‌జెట్ చరిత్రలో ఒక త్రైమాసికంలో ఇంత అత్యధిక లాభాలు చవిచూడడం కూడా ఇదే మొదటి సారి. గత ఆర్థిక సంవత్సరం అదే కాలంలో కంపెనీ గడించిన నికర లాభం రూ. 181.14 కోట్లుగా ఉంది. కంపెనీ 2017–18 క్యూ 3లో కార్యకలాపాల ద్వారా మొత్తం రూ. 2,081.95 ఆదాయాన్ని చూసింది. స్పైస్‌జెట్ విమానాల్లో సగటున 95 శాతం సీట్లు భర్తీ అవుతున్నాయి.



గ్రేటర్ నోయిడా 2018 ఆటో ఎక్స్‌పోలో కనువిందు చేస్తున్న హ్యాందాయ్ ప్రీమియం కాంపాక్ట్ హ్యాచ్‌బ్యాక్ ఎలైట్ ఐ20 కారు



ఆటో ఎక్స్‌పో 2018లో మెర్సిడెస్ బెంజ్ ఇ220 కారును ఆవిష్కరించిన కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, ప్రధాన కార్యనిర్వహణాధికారి రోలండ్ ఫోగర్



ఆటో ఎక్స్‌పో 2018లో యారిస్ కాన్సెప్ట్ కారును ప్రదర్శించిన టయోటా కంపెనీ అధికారులు

మనం పర్యాటకం

గురువారం, 8 ఫిబ్రవరి 2018

www.manamnews.com



## ప్రయాణానికి తెలుపు!

ఇతర రంగుల కార్లతో పోల్చితే తెలుపు రంగు కార్లలోనే ప్రయాణం సురక్షితం అని పరిశోధనల్లో తేలింది. 'యునైటెడ్ స్టేట్స్ నేషనల్ సేఫ్టీ కౌన్సెల్' జరిపిన అధ్యయనంలో ఇది నిరూపితమైంది. ప్రయాణంలో ఉన్నప్పుడు ఎదురుగా వచ్చే వాహన చోదకులు చాలా దూరంలో ఉండగానే తెలుపు రంగు కార్లను గుర్తించి అప్రమత్తం అవుతారట! దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు తగ్గుతాయి. ఒకవేళ ప్రమాదం జరిగినా తీవ్రత తగ్గుతుంది. ప్రయాణికులు కొద్ది గాయాలతోనే బయటపడే అవకాశం ఉంది. ఈ కారణం వల్లే రోడ్ల మీద తెల్లరంగు కార్లు చాలా ఎక్కువగా కనిపిస్తాయి. అందుకే కొన్ని దేశాల్లో పోలీసులు తెలుపు రంగు కార్ల వాడకానికే ప్రాధాన్యం ఇస్తారు.




## సెల్ఫ్ డ్రైవింగ్

ఎక్కడికైనా వెళ్లాలంటే ట్రైనో, బస్సో బుక్ చేస్తాం. కానీ ఇప్పుడు సెల్ఫ్ డ్రైవ్‌దే భవిష్యత్తు అంటున్నారు నిపుణులు. దీనికి కారణం 'హోమ్ స్టే'లే. కొందరు పర్యాటకుల కోసమే తమ ఇళ్లను అద్దెకిస్తూ ఉంటారు. గోవా, కేరళ, కూర్గ్, పాండిచ్చేరిల్లో వీటికి మంచి డిమాండ్. దాంతో యూత్ ట్రావెలర్స్ రయ్‌మంటూ తమకు నచ్చిన చోటికి దూసుకెళిపోతున్నారు. ఈ విషయంలో గోవా నంబర్ వన్.



## విమానం ఎక్కేయ్!

నగరజీవి లైఫ్ సాఫీగా, హాయిగా సాగిపోయే నది కాదు. అల్లకల్లోలంగా కనిపించే ఓ సముద్రమనే చెప్పచ్చు. ఉదయాన్నే నిద్ర లేవడం నుంచి అన్ని పనులు చకచకా ముగించుకోవాలనే తొందరలో తనను తానే పట్టించుకోవడానికి సమయం చిక్కదు! ఇక ఫ్యామిలీతో హాయిగా గడపడానికి టైం ఎక్కడిది? అందుకే వీలున్నవాళ్లు సెలవు దొరికినప్పుడల్లా కుటుంబంతో సహా ట్రిప్స్‌కు వెళ్లడానికి మొగ్గుచూపుతున్నారు. ఈ మధ్య కాలంలో ఈ ట్రెండ్ మరింత ఎక్కువైంది. ఇందులో హైదరాబాద్ నుంచే షార్ట్‌ట్రిప్స్ వేయడానికి రెడీగా ఉన్నవాళ్లు అధిక సంఖ్యలో ఉన్నారు ఇది ఓ ట్రావెల్స్ ఆన్‌లైన్ బుకింగ్ సంస్థ చేసిన తాజా అధ్యయనంలో వెల్లడైంది. మొత్తం 2,700 మందిని సర్వే చేయగా, ఇందులో హైదరాబాద్ నుంచే 73 శాతం మంది షార్ట్ ట్రిప్స్ వేస్తామని చెప్పారు. ఇందులో మిగిలిన వారు కొత్త ప్రాంతాలకు వెళ్లాలని, అక్కడి సంస్కృతీ సంప్రదాయాలను తెలుసుకోవాలనీ ముచ్చట పడుతున్నారు. అలాగే, చాలా మంది లోకల్ ట్రిప్స్‌కే ప్రాధాన్యం ఇవ్వగా, మరి కొంత మంది విదేశాలకు కూడా పర్యటిస్తామని చెబుతున్నారు.



బెంగళూరు అనగానే పచ్చదనం కళ్లముందు కదులుతుంది. చల్లటి వాతావరణం స్నేహంగా పలకరిస్తుంది. అందుకే ఆ ప్రదేశం అందమైన పర్యాటక కేంద్రమైంది. ఈ మహానగరం మాత్రమే కాదు.. దీనికి చుట్టుపక్కల చూడదగిన ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. అవేంటో చూసేద్దాం...

# సేదతీరుదాం

### పర్వతాల కోట

స్కందగిరి 'కలవరదుర్గ' అనే పర్వతాల కోట. బ్రిటిషర్లతో పోరాడేందుకు వీలుగా టిప్పు సుల్తాన్ ఈ ప్రదేశంలో ఎన్నో కోటలు కట్టించాడు. తర్వాతి కాలంలో ఈ కోటలు కూలిపోయినా వాటి ఆనవాళ్లు ఇప్పటికీ మిగిలే ఉన్నాయి. ఈ కొండ ప్రాంతం మీద ట్రెక్కింగ్ చేస్తూ అందాలను వీక్షించొచ్చు. అయితే ఇక్కడ దొంగలు, మోసగాళ్లు ఎక్కువ. గైడ్‌ల పేరుతో తప్పు దారిలో తక్కువ దూరం చుట్టి తీసుకొచ్చి ఎక్కువ డబ్బులు వసూలు చేస్తుంటారు. కాబట్టి ఐదుగురు బృందంగా ఏర్పడి స్వయంగా ట్రెక్కింగ్‌కి వెళ్లిరావటం ఉత్తమం. చీకటి పడుతున్న సమయంలో ట్రెక్కింగ్ చేయకపోవటమే మంచిది. ఇక్కడ ట్రెక్కింగ్ ప్రారంభంలోనే పాపాగ్ని మఠ్ అనే గుడి ఉంటుంది. గుడికి కుడివైపున తిరిగి వంద మీటర్లు నడిస్తే పైకి దారి కనిపిస్తుంది. ఈ దారివెంటే ప్రయాణిస్తూ కొండల మీద గీసిన బాణం గుర్తులను అనుసరిస్తే ఎటువంటి ఇబ్బంది లేకుండా కొండంతా చుట్టిరావొచ్చు. రాత్రివేళ మూన్‌లైట్ ట్రెక్కింగ్ కూడా చేయొచ్చు. ఇందుకోసం రాత్రి 12 నుంచి బయల్దేరి కొండపైకి 3-4 గంటలకు చేరుకోవచ్చు. అడ్వంచర్‌సగా ఉండాలనుకుంటే టెంట్స్, స్లీపింగ్ బ్యాగ్స్ తీసుకెళ్లాలి. మంచినీళ్లు, స్వెటర్లు, స్నాక్స్, టార్చ్ తప్పనిసరి.

### ఓ పర్వత సముదాయం

ఓ పర్వత కర్నాటక, తమిళనాడు సరిహద్దులో ఉండే బిలిగిరి రంగన్ ఓ పర్వత సముదాయం. బి.ఆర్.హిల్స్ అని పిలిచే ఈ ప్రదేశం బర్డ్ వాచింగ్‌కు అనుకూలమైనది. అప్పుడప్పుడూ అడవి జంతువులు కూడా కనిపిస్తూ ఉంటాయి. ఇక్కడున్న బిఆర్‌టి వైల్డ్‌లైఫ్ శాంక్చురీలో రకరకాల జంతువులు చూడొచ్చు. కావేరి, తుంగభద్ర నదుల మధ్య నెలవైన ప్రదేశం కాబట్టి పచ్చదనం, చల్లదనాలకు ఇక్కడ కొదవే ఉండదు. బిఆర్ హిల్స్‌లోని ఎత్తయిన కొండ మీద బిలిగిరి రంగస్వామి దేవాలయం సందర్శించుకోవచ్చు. ఇక్కడున్న రెండువేల ఏళ్లనాటి దొడ్డ సంపిగె మార అనే ఓ పెద్ద చంపక చెట్టు ఉంది. దీని ఎత్తు 34 మీటర్లు, వెడల్పు 20 మీటర్లు. ఇక బిఆర్ హిల్స్‌లో ఫిషింగ్, రివర్ రాఫ్టింగ్, ట్రెక్కింగ్ చేయొచ్చు.



ఒక పూటలో వెళ్లి రాగల హాలిడే స్పాట్ ముత్యాల మడువు. దీన్నే వర్ల్ వ్యాలీ అని కూడా అంటారు. చుట్టూ కొండలు మధ్యలో లోయ.. దాన్లో నెలవై ఉన్న ఈ చిన్న జలపాతం, కొలను చక్కని పిక్నిక్ స్పాట్. వంద అడుగుల ఎత్తు నుంచి జారిపడే జలపాతం, చుట్టుపక్కన పరుచుకున్న పచ్చదనం ఈ ప్రదేశం ప్రత్యేకతలు. ఈ జలపాతం అడుగునున్న కొలను లోతుగా ఉండదు. కాబట్టి నిరభ్యంతరంగా కొలనులో మునకలేయొచ్చు. ఇదే లోయలో ఇంకో రెండు జలపాతాలు కూడా ఉన్నాయి. వాటిని కూడా తప్పక చూసి తీరాల్సిందే! ఇక్కడో చిన్న శివాలయం కూడా ఉంది. అయితే వీటి దగ్గరికి నేరుగా వాహనాల్లో వెళ్లే వీలుండదు. కాబట్టి పార్కింగ్‌లో వెహికల్స్ వదిలి వంద మెట్ల దాకా ఎక్కాల్సి ఉంటుంది. పార్కింగ్ ప్లేస్‌లో రెస్ట్ రూమ్స్, రెస్టారెంట్లు ఉంటాయి.



బెంగళూరు పరిసర ప్రాంతాల్లో చూడదగ్గ ముఖ్యమైన దేవాలయాల్లో రంగనాథస్వామి దేవాలయం ఒకటి. ఈ గుడి తిరుమలై అనే కొండ మీద ఉంది. ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన ఈ దేవాలయం ప్రాకారం, గోపురాల నిర్మాణ కౌశలం చూసి తరించాల్సిందే! శంఖం, చక్రం, గద ధరించి అభయ ముద్రతో దర్శనమిచ్చే మూడడుగుల నారాయణుడి విగ్రహం అద్భుతమనిపిస్తుంది. ఈ దేవాలయం చుట్టు పక్కల రాముడు, ఆంజనేయుడు, సీతమ్మవార్ల గుళ్లు కూడా ఉన్నాయి. కళ్యాణ కట్ట, గరుడ స్తంభం కృష్ణదేవరాయల కాలం నాడు నిర్మించినవి. ప్రత్యేక సందర్భాల్లో ఇక్కడ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

### పిక్నిక్ స్పాట్


వన్ డే పిక్నిక్ స్పాట్‌కు తగిన ప్రదేశం ఇది. కుటుంబంతో కలిసి ఒక్కరోజులో ట్రిప్ ముగించే వీలున్న టూరిస్ట్ ప్లేస్ కూడా! అవలబెట్టకు ఓ చారిత్రక విశిష్టత ఉంది. కామధేను కాలుమోపిన ప్రదేశమని నమ్ముతారు. ఇక్కడి కొండ మీద ఆలయం ఉంది. ట్రెక్కింగ్ అవకాశం కూడా ఉంది. అసలే పచ్చదనం. ఇక వర్షాకాలంలో అయితే ఎటుచూసినా చెట్లు, పూలతో పరిసరాలన్నీ ఆహ్లాదకరంగా ఉంటాయి. కొండ పైనున్న హిల్ టాప్, దానికి కొంచెం దిగువన ఉండే క్లిఫ్ స్పెషల్ ఎట్రాక్షన్స్. క్లిఫ్ చేరుకోవటం తేలికే.





### ఇలా వెళ్లాలి

పర్యాటక ప్రదేశాలన్నీ బెంగళూరు చుట్టుపక్కలే కాబట్టి ముందుగా బెంగళూరు చేరుకోవాల్సిందే. హైదరాబాద్ లేదా విశాఖపట్నం ఎక్కడి నుంచైనా విమానంలో బెంగళూరు చేరుకుని అక్కడి నుంచి కారులో ఈ ప్రాంతాలన్నీ చుట్టిరావొచ్చు. ప్రయాణ ఖర్చు హైదరాబాద్ నుంచి విమానంలో వన్‌వే టికెట్ ధర మూడు వేల నుంచి మూడున్నర వేలు. విశాఖపట్నం నుంచి కూడా ఇంతే ఉంటుంది. ఇక బెంగళూరు నుంచి ట్యాక్సీ ఖర్చు అదనం. సొంత కారైతే బెంగళూరు నుంచి దారి పొడవునా ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ టూర్‌ను ఎంజాయ్ చేయొచ్చు. టూవీలర్ మీద వెళ్లాలనుకుంటే స్కందగిరి తప్ప మిగతా ప్రాంతాలకు నిరేయంగా వెళ్లిరావొచ్చు. స్కందగిరిలో వాహనాల దొంగలు ఎక్కువ. వాహనాల పార్ట్స్, ఆయిల్ మాయమవుతుంటాయి. కాబట్టి జాగ్రత్త అవసరం.



## బీచ్‌లలో రారాజు

గిరిపుత్రి గుహ నుంచి పల్లెలను దాటుతూ సముద్రతీరం చేరుకుంటే బీచ్‌లలో రారాజుగా చెప్పుకునే 'అతుబీచ్' దర్శనం ఇస్తుంది. ఒక వైపు ఎత్తైన పర్వత శిఖరాలు, పచ్చని చెట్లు, ఆ చెట్ల పచ్చదనాలు ప్రతిఫలిస్తూ మెరిసే సముద్ర జలాలు, ఆ సముద్రపు అందాలను రెట్టింపు చేసే తెల్లని బీచ్ మనల్ని అబ్బురపరుస్తాయి. అక్కడ వందల మంది పర్యాటకులు, లేత కొబ్బరి నీటిని చప్పరిస్తూ, గొడుగుల కింద కూర్చుని బీచ్ అందాలను ఆస్వాదిస్తూ వుంటారు.

## చక్కటి టూరిస్ట్ ప్లేస్

కావేరి నదికి సమీపంలోని శివసముద్ర జలపాతం, మెకెదతు ఫాల్స్ మధ్యలో ఉందీ ప్రదేశం. కావేరి నదిలో దొరికే మహశిర్ చేప ఈ ప్రాంతం ప్రత్యేకత. జలపాతాలు, అడవులు, జంతువులతో నిండిన భీమేశ్వరి కుటుంబసమేతంగా వెళ్లిరావాల్సిన చక్కటి టూరిస్ట్ ప్లేస్. కావేరి నది పక్కనే విస్తరించిన ప్రదేశం కాబట్టి ఇదొక ప్రసిద్ధ ఫిషింగ్ హబ్‌గా కూడా పేరు పొందింది. నది పొడవునా అక్కడక్కడా ఫిషింగ్ క్యాంప్స్ కనిపిస్తాయి. ఫిషింగ్ వచ్చినవాళ్లేకాదు రానివాళ్లు కూడా ఇక్కడ చేపలు పట్టొచ్చు. కాబట్టి వీలైతే గాలం తీసుకుని ఆ ప్రయత్నం కూడా చేయొచ్చు. ఫిషింగ్ క్యాంప్‌లో అన్ని సౌకర్యాలు ఉంటాయి. దోమ తెరలు, మంచాలు, స్నానం కోసం సదుపాయం, ఓపెన్ ఎయిర్ డైనింగ్ హాల్‌లో భోజనం ఏర్పాట్లు ఉంటాయి. ఫిషింగ్‌తోపాటు ట్రెక్కింగ్, బోటింగ్‌కు కూడా భీమేశ్వరి అనుకూలమైనది. కావేరి నదిలో రివర్ రాఫ్టింగ్, కోరకల్ రైడ్ చేయొచ్చు. అంత ఓపికలేనివాళ్లు విశ్రాంతిగా కూర్చుని పక్షుల కిలకిలలు వింటూ సేదతీరొచ్చు. వసతి కోసం టెంటెడ్ కాటేజెస్, లాగ్ హట్స్ ఉన్నాయి.

## టూర్‌లో డైట్ రూల్స్



వెకేషన్‌కో, హాలిడేస్‌లోనో టూర్ ప్లాన్ చేసుకుంటారు. అయితే ప్రయాణంలో డైట్ విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోకపోతే టూర్ మొత్తం అప్‌సెట్ అయ్యే అవకాశం ఉంటుంది. ఎక్కడపడితే అక్కడ, ఏ ఫుడ్ పడితే ఆ ఫుడ్ తింటే కొత్త సమస్యలు వచ్చి పడతాయి. అందుకే టూర్ ప్లాన్ చేస్తున్నట్లయితే ఈ కింది టిప్స్‌ను ద ష్టిలో పెట్టుకోండి. ప్రతి రెండు గంటలకొకసారి కొద్దిగా ఆహారం తీసుకోవాలి. దీనివల్ల మెటబాలిజం బూస్ట్ అవుతుంది. ట్రావెలింగ్‌లో హెల్తీ ఫుడ్ దొరకడం కష్టమే. అయితే బరువును మెయిన్‌టేన్ చేయడానికి ఉప్పు తీసుకోవడం తగ్గించాలి. తాజా పండ్లు తీసుకోవాలి. సోడా, కూల్‌డ్రింక్స్‌ను సాధ్యమైనంత వరకు దూరం పెట్టాలి. దీనివల్ల పొట్ట ఆరోగ్యంగా ఉండటమే కాకుండా హార్మోన్ల స్థాయి పెరుగుతుంది. చీజ్, బీన్స్, చేపలు వంటి వాటిలో ప్రొటీన్స్, అమైనో యాసిడ్స్, ఫ్యాటీయాసిడ్స్ పుష్కలంగా లభిస్తాయి. ఇవి హార్మోన్ల నియంత్రణలో బాగా ఉపయోగపడతాయు. తరచుగా నీళ్లు తాగుతుండాలి. దీనివల్ల శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటుంది. ఎలాంటి ఫుడ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలనే సందేహం చాలా మందిలో ఉంటుంది. టూర్స్‌కు వెళ్లినపుడు రెస్టారెంట్లలో, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తినక తప్పదు. అయితే అలాంటి ప్రదేశాల్లో తిన్నా సాస్, ఫ్రైడ్ ఫుడ్, చీజ్, బాకన్ వంటి వాటికి దూరంగా ఉండాలి. డ్రైఫ్రూట్స్, నట్స్‌ను తీసుకెళ్లాలి. ట్రావెలింగ్ హెల్తీ స్నాక్స్ అంటే ఇవే. ఎనర్జీ లెవెల్స్‌ను పెంచడానికి ఇవి బాగా ఉపయోగపడతాయి. వాల్‌నట్స్, పిస్తా, బాదం, కాన్‌బెర్రీ వంటి వాటిని ఎంచుకోవచ్చు. ట్రావెలింగ్‌లో డైట్ రెస్ట్రిక్షన్స్ పెట్టుకుంటే కుదరదు. అలాకాకుండా దొరికిన ఆహారాన్ని అతిగా కాకుండా మితంగా తింటే సరిపోతుంది. ఈ జాగ్రత్తలు తీసుకున్నట్లయితే టూర్‌లో అనారోగ్య సమస్యలు దరిచేరకుండా ఉంటాయి.

మనం స్పోర్ట్స్
గురువారం 8 ఫిబ్రవరి 2018
www.manamnews.com



అజేయ సెంచరీ చేసిన టీమిండియా కెప్టెన్ - ధావన్ అర్ధ సెంచరీ

# విరాట్ వీరంగం

కేప్‌టౌన్: టెస్టుల్లో పేలవ ప్రదర్శన కనబరిచిన కోహ్లీ సేన వన్డేల్లో మాత్రం ప్రొటీస్‌కు సొంత గడ్డపై పట్టపగలే చుక్కలు చూపిస్తున్నారు. వరుస గాయాలతో సతమతమవుతున్న సౌతాఫ్రికాపై మరో దెబ్బ వేసేందుకు సిద్ధమయ్యారు. విరాట్ కోహ్లీ మరోసారి కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి జట్టుకు భారీ స్కోరు అందించాడు. శిఖర్ ధావన్ అర్ధ సెంచరీతో జట్టుకు తనవంతు సహకారం అందించాడు. భారీ గెలుపు లక్ష్యంతో బరిలోకి దిగిన ప్రొటీస్‌ను బుమ్రా ఆరంభంలోనే దెబ్బ కొట్టాడు. రెండో ఓవర్లో బుమ్రా వేసిన రెండో బంతికి హషీం ఆమ్లా ఎల్‌బిడబ్ల్యూగా వెనుదిరిగాడు. దీంతో 1 పరుగు వద్ద సౌతాఫ్రికా తొలి వికెట్ కోల్పోయింది. కడపటి వార్తలందే సమయానికి సౌతాఫ్రికా జట్టు ..... ఓవర్లలో .... వికెట్ల నష్టానికి ..... పరుగులు చేసింది.



సౌతాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో విరాట్ కోహ్లీ మరోసారి విశ్వరూపం చూపించాడు. తనదైన శైలిలో ఆడుతూ అజేయ సెంచరీ సాధించాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాను కగిసా రబాడ ఆరంభంలోనే దెబ్బ తీశాడు. తొలి ఓవర్లో చివరి బంతికి రోహిత్ శర్మ అవుటయ్యాడు. దీంతో కెప్టెన్ విరాట్ కోహ్లీ బరిలోకి దిగాడు. కోహ్లీ, శిఖర్ ధావన్ జంట మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా నెమ్మదిగా ఆడింది. తర్వాత అసలు బ్యాటింగ్ ప్రారంభమైంది. అరంగేట్ర బౌలర్ లుంగి ఎన్‌గిడి బౌలింగ్‌లో భారీ పరుగులు రాబట్టారు. వీరిద్దరి భాగస్వామ్యాన్ని విడగొట్టేందుకు ప్రొటీస్ కెప్టెన్ ఐడెన్ మార్‌క్రమ్ వరుస విరామ సమయాల్లో బౌలింగ్‌లో మార్పులు చేశాడు. అయినప్పటికీ కోహ్లీ, ధావన్ ఏమాత్రం భయపడకుండా రన్‌రేట్‌ను 6కుపైగా కొనసాగించారు. తొలుత ధావన్ 42 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. కోహ్లీ మరింత ఆలస్యంగా 64 బంతుల్లో 46వ అర్ధ సెంచరీ సాధించాడు. తర్వాత టీమిండియా పరుగులకు అడ్డు కట్ట వేసేందుకు ప్రొటీస్ కెప్టెన్ మార్‌క్రమ్ ఇరువైపులా స్పిన్నర్లను దించాడు. జేపీ డుమినీ, ఇమ్రాన్ తాహిర్ బౌలింగ్ చేశారు. అయితే డుమినీ రెండు వికెట్లు తీశాడు. తొలుత ధావన్ (63)ను పెవిలియన్ పంపాడు. తర్వాత వచ్చిన అజింక్య రహానే అనవసరమైన షాట్‌కు పోయి తక్కువ పరుగులకే వెనుదిరిగాడు. తర్వాత ఉన్నట్టుండి టీమిండియా 160 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. అయితే ఈ మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యాకు పదోన్నతి కల్పించి ఎంఎస్ ధోనీ కంటే ముందుగా బ్యాటింగ్‌కు పంపారు. డుమినీ బౌలింగ్‌లో పాండ్యా భారీ సిక్సర్ కొట్టడంతో ఈ ప్రయోగం ఫలించింది. తర్వాత క్రిస్ మోరిస్ మళ్లీ బౌలింగ్‌కు దిగాడు. కొద్ది సేపటికే మోరిస్ వేసిన వైడ్ బాల్‌కు పాండ్యా వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో 188 పరుగుల వద్ద టీమిండియా నాలుగో వికెట్ పడింది. ఒకవైపు వికెట్లు పడుతున్నా మరో ఎండ్‌లో ఉన్న కోహ్లీ పేస్, స్పిన్ బౌలింగ్‌లను ఎదుర్కొంటూ 40వ ఓవర్లో 120 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. వన్డేల్లో కోహ్లీకిది 34వ సెంచరీ కాగా.. సౌతాఫ్రికాపై మూడోది. 40 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసిన టీమిండియా 50 ఓవర్లలో 300 పరుగులను దాటింది. 42వ ఓవర్లో తాహిర్ వేసిన బంతిని భారీ షాట్ కొట్టబోయిన ధోనీ లాంగా ఆన్ బౌండరీ వద్ద ఎన్‌గిడి చేతికి చిక్కాడు. ఈ సిరీస్‌లో తొలిసారి టీమిండియా టాపార్డర్‌ను సౌతాఫ్రికా దెబ్బతీసింది. తర్వాత వచ్చిన కేదార్ జాదవ్.. పెహ్లువాయో బౌలింగ్‌లో కీపర్ క్లాసెన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో 43 ఓవర్లలో టీమిండియా 6 వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. అయితే తర్వాత వచ్చిన భువనేశ్వర్.. కోహ్లీతో కలిసి ఎనిమిదో వికెట్‌కు 67 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. చివరి ఓవర్లో కోహ్లీ 150 పరుగులు పూర్తి చేశాడు. 157 బంతుల్లో 11 ఫోర్లు, ఒక సిక్సర్‌తో దీన్ని సాధించాడు. రబాడ వేసిన చివరి రెండు బంతుల్లో కోహ్లీ ఒక సిక్సర్, ఒక ఫోర్ కొట్టడంతో టీమిండియా 6 వికెట్ల నష్టానికి 303 పరుగులు సాధించింది. కోహ్లీ 159 బంతుల్లో 160 పరుగులతో అజేయంగా నిలిచాడు. ప్రొటీస్ బౌలర్లలో డుమిని 2 వికెట్లు తీసుకోగా.. రబాడ, మోరిస్‌లకు చెరో వికెట్ లభించింది.

# సిరీస్ మనదే

- రెండో వన్డేలోనూ మిథాలీ సేన విజయం
- స్మృతి మంధన సెంచరీ
- హర్మన్‌ప్రీత్, వేద కృష్ణమూర్తి అర్ధ సెంచరీలు
- 2-0తో సిరీస్ కోల్పోయిన సౌతాఫ్రికా మహిళల జట్టు

కింబెర్లీ: భారత మహిళా క్రికెటర్ స్మృతి మంధన మరోసారి అద్భుత ప్రతిభ కనబరచడంతో సౌతాఫ్రికాతో వన్డే సిరీస్‌లో భారత జట్టు 2-0తో కైవసం చేసుకుంది. బుధవారమిక్కడ జరిగిన రెండో వన్డేలో మిథాలీ సేన 178 పరుగుల తేడాతో సౌతాఫ్రికాను చిత్తు చేసింది. టాస్ ఓడటంతో భారత జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగింది. తొలి వన్డేలో సెంచరీ మిస్సయిన మంధన 129 బంతుల్లో 135 పరుగులు చేయడంతో భారత్ 3 వికెట్ల నష్టానికి 302 పరుగుల భారీ స్కోరు సాధించింది. మంధన సెంచరీలో 14 ఫోర్లు ఒక సిక్సర్ ఉన్నాయి. సౌతాఫ్రికాపై మంధనకు ఇది రెండో వన్డే సెంచరీ. తొలి వన్డేల్లో మంధన 98 బంతుల్లో 84 పరుగులు చేసి అవుటైంది. ఆ మ్యాచ్‌లో భారత జట్టు 88 పరుగులతో గెలిచింది. మంధనతో పాటు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (55 నాటౌట్), వేద కృష్ణమూర్తి (51 నాటౌట్) అర్ధ సెంచరీలతో జట్టుకు తమవంతు సహకారం అందించారు. ఓపెనర్ పూనమ్ రౌత్ (20), కెప్టెన్ మిథాలీ రాజ్ (20) ఆరంభంలో బాగానే ఆడినప్పటికీ తర్వాత దాన్ని కొనసాగించడంలో విఫలమయ్యారు. భారత బ్యాట్స్‌వుమన్‌ను కట్టడి చేయడంలో సౌతాఫ్రికా బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారు. మూడు వికెట్లు మాత్రమే తీయగలిగారు.

తొలి వన్డేల్లో మాదిరిగానే ఈ మ్యాచ్‌లోనూ భారత బౌలర్లు సత్తా చాటారు. దీంతో సౌతాఫ్రికా 30.5 ఓవర్లలో 124 పరుగులకు ఆలౌటైంది. లెగ్ స్పిన్నర్ పూనమ్ యాదవ్ అద్భుతంగా బౌలింగ్ చేసి 24 పరుగులిచ్చి 4 వికెట్లు తీసుకుంది. ఎడమ చేతి స్పిన్నర్ రాజేశ్వరీ గైక్వాడ్ (2/14), దీప్తి శర్మ (2/34) రెండేసి వికెట్లు పడగొట్టారు. భారత పేస్ బౌలర్ ఝులన్ గోస్వామి తన ఘనమైన కెరీర్‌కు మరో కీర్తి కిరీటాన్ని జత చేసుకుంది. వన్డేల్లో 200 వికెట్లు తీసిన తొలి మహిళా క్రికెటర్‌గా రికార్డుల్లోకెక్కింది. 25 ఏళ్ల గోస్వామికిది 166వ వన్డే. ఓపెనర్ లారా వోల్వార్ట్‌ను అవుట్ చేయడంతో గోస్వామికి 200వ వికెట్ లభించింది. ఆరంభం నుంచి భారత బౌలింగ్ అటాక్‌ను ఎదుర్కోవడంలో సౌతాఫ్రికా జట్టు ఇబ్బందులు పడింది. ఇద్దరు బ్యాట్స్‌వుమెన్ మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. ఓపెనర్ లిజెల్లె లీ ఒంటరి పోరాటం కొనసాగించి 75 బంతుల్లో 73 పరుగులు చేసింది. అయితే సహచరుల నుంచి ఆమెకు ఎటువంటి సహకారం లభించలేదు. రెండంకెల స్కోరు సాధించిన మరో సౌతాఫ్రికా బ్యాట్స్‌వుమెన్ మారిజాన్నే కాప్. ఈమె అజేయ 17 పరుగులు చేసింది.



స్మృతి మంధన సెంచరీ (135)

## ఝులన్ గోస్వామి రికార్డు

### వన్డేల్లో 200 వికెట్లు తీసిన తొలి బౌలర్

భారత మహిళా ఫాస్ట్ బౌలర్ ఝులన్ గోస్వామి ప్రపంచ మహిళల క్రికెట్‌లో తన కంటూ ఓ ప్రత్యేక పేజీని సృష్టించుకుంది. సౌతాఫ్రికాతో బుధవారం కింబెర్లీలో జరిగిన రెండో వన్డేలో 200వ వికెట్ తీసింది. దీంతో ప్రపంచ మహిళల వన్డే క్రికెట్‌లో 200 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా రికార్డుల్లోకెక్కింది. గతేడాది మే 9వ తేదీన ఝులన్ మహిళల వన్డేల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఘనత సాధించింది. అప్పుడు కూడా సౌతాఫ్రికాపై వికెట్ తీయడంతో ఝులన్ ఆ రికార్డును సాధించింది. మహిళల వన్డే క్రికెట్‌లో భారత మహిళలు వరల్డ్ రికార్డు బుక్కుపై ఆధిక్యత ప్రదర్శిస్తున్నారు. కెప్టెన్ మిథాలీ రాజ్ కూడా అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా నిలవడమే కాకుండా నంబర్ వన్ ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. 35 ఏళ్ల ఝులన్ 2వ ర్యాంక్‌లో కొనసాగుతోంది. 2007లో ఝులన్ వుమెన్స్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును గెలుచుకుంది. ఆ 12 నెలల కాలంలో ఝులన్ అసాధారణ ప్రతిభ కనబరిచింది. 2002లో వన్డేల్లో అరంగేట్రం చేసిన ఝులన్‌ను 2010లో అర్జున, రెండేళ్ల తర్వాత ప్రతిష్టాత్మక పద్మశ్రీ అవార్డులు వరించాయి.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.